www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 259
మంగళవారం | 17-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: విదియ ఉ. 10.56 తదుపరి తదియ; నక్షత్రం: పునర్వసు రా. 12.44 తదుపరి పుష్యమి; వర్జ్యం: మ.12.58-2.32; దుర్ముహూర్తం: ఉ.8.53-9.37, రా.9.57-10.48; అమృతఘడియలు: రా.10.22-11.56; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.42; సూర్యాస్తమయం: 5.40
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గ్రూప్-2 ప్రశ్నలపై వివాదం

- పరీక్షల్లో మావోయిస్టులు, ఎన్‌కౌంటర్లపై పది ప్రశ్నలు
- చంద్రబాబు విజన్ 2020 డాక్యుమెంట్ తయారీ సంస్థ ఏదీ?
- రాయపాటి, లగడపాటి, టి.సుబ్బరామిరెడ్డి కంపెనీలు ఏవీ?
- సమైక్య పాలకుల గురించి అడిగారంటూ విమర్శలు
- ప్రశ్నలు ఏపీపీఎస్సీ కోసమా?: మాజీ మంత్రి హరీశ్‌రావు

45.57% అభ్యర్థుల హాజరు

ముగిసిన పరీక్షలు

10

తండ్రీకొడుకులకు ఝలక్

కేసీఆర్‌పై కేసు!

- మాజీ సీఎంకు విద్యుత్తు కొనుగోళ్లు, ఒప్పందాల షాక్
- కరెంటుపై జస్టిస్ లోకూర్ నివేదికకు క్యాబినెట్ ఓకే
- ఈ సమావేశాల్లోనే అసెంబ్లీలోకి.. చర్చ కూడా
- కేసీఆర్ సహా పాత్రధారులపై తీసుకునే చర్యల ప్రకటన
- భద్రాద్రి ప్లాంట్‌తో పాతికేళ్లలో రూ.9 వేల కోట్ల భారం
- ఛత్తీస్‌గఢ్ ఒప్పందంతో రూ.3,642 కోట్ల నష్టం
- గనులకు దూరంగా యాదాద్రి.. రవాణాకే 1600 కోట్లు
- నిగ్గు తేల్చిన జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదిక





హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ హయాంలో పదేళ్లపాటు చేసుకున్న విద్యుత్తు ఒప్పందాలు; ప్లాంట్ల నిర్మాణంలో తప్పిదాలపై విచారణ జరిపి జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ కమిషన్ సమర్పించిన నివేదికను తెలంగాణ మంత్రివర్గం సోమవారం ఆమోదించింది. ఆయా నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు ఇతర పాత్రధారులపై చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. సదరు నివేదికను ప్రస్తుతం కొనసాగుతున్న శాసన సభలో ప్రవేశపెట్టాలని తీర్మానించింది. నివేదికపై సభలో విస్తృతంగా చర్చించిన తర్వాత.. మాజీ సీఎం కేసీఆర్‌పై తీసుకునే చర్యలకు సంబంధించి అసెంబ్లీ సాక్షిగానే ప్రకటన చేయనుంది. దీని ఆధారంగా కేసీఆర్ సహా పలువురిపై కేసు నమోదు చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం దాదాపు ఐదు గంటలపాటు మంత్రివర్గ సమావేశం జరిగింది. ఇందులో ప్రధానంగా విద్యుత్తు కమిషన్ నివేదికపైనే సుదీర్ఘంగా చర్చ జరిగింది. గత పదేళ్ల కాలంలో కేసీఆర్ డిస్కమ్‌లను ఆర్థికంగా కుప్పకూల్చారని, ఆయన మెప్పు కోసం విద్యుత్తు సంస్థలు మునుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని, విద్యుత్తు కొనుగోళ్లు, పవర్ ప్లాంట్ల నిర్మాణంలో తీసుకున్న నిర్ణయాలతో రానున్న 25 ఏళ్లపాటు తెలంగాణ సమాజం మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తేల్చింది. కాలం చెల్లిన టెక్నాలజీతో కట్టిన భద్రాద్రి పవర్ ప్లాంట్ కారణంగా రానున్న 25 ఏళ్లలో రూ.9,000 కోట్ల దాకా ప్రజలపై భారం పడనుందని అభిప్రాయపడింది. సూపర్ క్రిటికల్‌తో పోల్చుకుంటే సబ్ క్రిటికల్‌లో ప్లాంట్ ఆక్సిలరీ కన్జంప్షన్ (ప్లాంట్ సొంతంగా వినియోగించుకునే కరెంట్), హీట్ రేట్, మెయింటెనెన్స్ తదితర ఖర్చులు ఏటా రూ.350 కోట్ల వరకూ అదనంగా పడతాయని, ప్లాంటు జీవిత కాలం 25 ఏళ్లకు దాదాపు రూ.9,000 కోట్ల వరకూ అదనపు భారం పడుతుందని క్యాబినెట్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక, ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న విద్యుత్తు కొనుగోలు ఒప్పందంతో రూ.3,642 కోట్ల నష్టం జరిగిందని నివేదిక తేల్చింది. దీనిపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. అప్పట్లో పోటీ బిడ్డింగ్‌కు వెళ్లడంతో యూనిట్ కరెంట్ కేరళకు రూ.3.60కే లభించిందని, కానీ, తెలంగాణకు తొలుత రూ.3.90కే యూనిట్ విద్యుత్తు లభించినా

మిగతా 12వ పేజీలో...

కేటీఆర్ మెడకు ఫార్ములా ఈ ఉచ్చు

- నేడో రేపో నోటీసులు.. అరెస్టు?
- విచారణకు ఇప్పటికే గవర్నర్ ఓకే
- మంత్రి మండలిలో సుదీర్ఘ చర్చ
- పత్రాలు సీఎస్ ద్వారా ఏసీబీకి
- చట్టప్రకారమే ముందుకు
- ఐదు ఆర్డినెన్సులకు ఆమోదం

12

జిల్లాలు యథాతథం

- అమరావతిలో వరద భయం
- పెట్టుబడిదారులు హైదరాబాద్‌కు
- ఇక్కడ రియల్ ఎస్టేట్ పెరిగింది
- ఫార్ములా ఈ పెట్టుబడుల లెక్కలు
- రూ.55 కోట్లో.. రూ.700 కోట్లో
- ఏసీబీ విచారణలో తేలుతుంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

13



ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ ఇక లేరు

2

- ప్రపంచ ప్రఖ్యాత తబలా మ్యాస్ట్రో కన్నుమూత
- ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో అమెరికాలో మృతి
- తండ్రి ఉస్తాద్ అల్లారఖా వద్ద శిక్షణ.. 12 ఏళ్లకే కచేరీలు
- విశ్వవిఖ్యాత సంగీత కళాకారులతో కలిసి ప్రదర్శనలు
- పద్మ పురస్కారాలతో గౌరవించిన కేంద్ర ప్రభుత్వం
- ఐదు 'గ్రామీ'లు సహా పలు అంతర్జాతీయ అవార్డులు

పుట్టగానే నన్ను మా నాన్న చేతుల్లో పెట్టారు. సంప్రదాయం ప్రకారం ఆ సమయంలో.. బిడ్డ చెవిలో తండ్రి ప్రార్థన చేయాలి. శిశువును ఈ ప్రపంచంలోకి స్వాగతిస్తూ మంచి మాటలు చెప్పాలి. కానీ మా నాన్న నన్ను చేతుల్లోకి తీసుకోగానే.. నా చెవిలో తబలా తాళాలు వినిపించారు. "మీరేం చేస్తున్నారు? ప్రార్థన చేయాలి కదా" అని మా అమ్మ అడిగితే.. "నా ప్రార్థనలు ఇవే. నేను ప్రార్థన చేసేది ఇలాగే. నేను సరస్వతీ దేవి, వినాయకుడి భక్తుణ్ని" అన్నారు మా నాన్న. తనకు తన గురువుల నుంచి వచ్చిన జ్ఞానాన్ని తన కుమారుడికి పంచడానికే అలా చేశానని ఆయన చెప్పారు

- జాకీర్ హుస్సేన్ తన తండ్రి గురించి చెప్పిన మాటలు



ఆర్ఆర్ఆర్ డీపీఆర్‌కు గడువు పెంపు!

12

- దక్షిణ భాగం కన్సల్టెన్సీ ఎంపిక టెండర్ల గడువు ఈ నెల 27 వరకు పొడిగింపు
- అదే రోజు తెరుచుకోనున్న బిడ్లు
- నోటిఫికేషన్‌లో మార్పులుచేర్పుల వల్లే..



13

ఈ ఏడాదికి డిటెన్షన్ రద్దు!

- ఓయూ, జేఎన్‌టీయూ పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీలతో త్వరలో భేటీ
- సిలబస్, రీయింబర్స్‌మెంట్‌పై చర్చిస్తాం
- శాసనసభలో మంత్రి దామోదర
- 2 వర్సిటీల్లో ఒకే విధానం ఉండాలి: ఒవైసీ

మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

- ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్స్
- షెడ్యూల్ విడుదల చేసిన బోర్డు
- మార్చి నెలాఖరు నుంచి పది పరీక్షలు?

హైదరాబాద్,డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 3వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు అధికారులు సోమవారం విడుదల చేశారు. మార్చి 5 నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్, మార్చి 6వ తేదీ నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ వార్షిక పరీక్షలు ప్రారంభం అవుతాయి. మార్చి 25వ తేదీ వరకు ఈ పరీక్షలు

మిగతా 14వ పేజీలో...

కాంట్రాక్టుకు లంచం

- భారత సంస్థలకు అమెరికా కంపెనీల భారీ ముడుపులు
- ఇచ్చింది మూగ్, ఒరాకిల్ కార్పొరేషన్, అల్బెమార్లె
- తీసుకున్నది ద.మ.రైల్వే, హెచ్ఏఎల్, ఐవోసీ అధికార్లు
- డబ్బులిచ్చిన సంస్థలపై అమెరికా జరిమానాల కొరడా
- ముడుపులపై 300 శాతం అధికంగా పెనాల్టీ
- ప్రాసిక్యూషన్‌ను తప్పించడానికి యూఎస్ నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబరు 16: భారత కుబేరుడు గౌతమ్ అదానీపై అమెరికా సంస్థల ఆరోపణల వేడి చల్లారకముందే.. ఇప్పుడు అలాంటి లంచాల కథే మరొకటి వెలుగుచూసింది. ఈసారి లంచం ఇచ్చింది అమెరికా కంపెనీలు. పుచ్చుకున్నది భారతీయ ప్రముఖ సంస్థల అధికారులు, ఇతర దేశాల్లోని సంస్థలు. అయితే కేసుల్లేకుండా చేయడానికి లంచాలు ఇచ్చిన తమ కంపెనీలపై అమెరికా ప్రభుత్వం భారీ పెనాల్టీ విధించింది. ఆ కంపెనీలు ఇచ్చిన ముడుపులపై 300 శాతం అధికంగా జరిమానా వేసి ప్రాసిక్యూషన్‌ను తప్పించినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సెక్) ఆదేశాలను బట్టి

మిగతా 2వ పేజీలో...



బీఏసీలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, సీఎం రేవంత్, హరీశ్, ప్రశాంత్‌రెడ్డి, కూనంనేని

సర్పంచుల బిల్లులపై దుమారం

- పెండింగ్‌లో రూ.691 కోట్లు.. అవి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాం నాటివే
- అందుకే అది 'బకాయిల రాష్ట్ర సమితి'.. మంత్రిగా సంతకం చేయని హరీశ్
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదు.. కానీ ఆ బిల్లులు చెల్లిస్తాం: మంత్రి సీతక్క
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్.. కాంగ్రెస్ హస్తం భస్మాసుర హస్తమైంది: హరీశ్
- అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం.. 'లగచర్ల'పై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం
- తోసిపుచ్చిన స్పీకర్ ప్రసాద్‌కుమార్.. అసెంబ్లీ సమావేశాల్లో గరంగరం
- సభ అజెండాను ఇప్పుడే నిర్ణయించండి.. బీఏసీలో బీఆర్ఎస్ డిమాండ్
- సభ్యులు సలహాలిస్తారు.. స్పీకర్ అజెండా నిర్ణయిస్తారు.. రేవంత్ స్పష్టీకరణ

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శాసన సభ శీతాకాల సమావేశాలు గరంగరంగా జరుగుతున్నాయి. సోమవారం అసెంబ్లీలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వాయిదాలు, వాకౌట్ల పర్వం నడిచింది. శాసనసభలో 'ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం.. దోపిడి రాజ్యం' అని ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేయగా.. 'ఇది ప్రజాప్రభుత్వం' అని అధికారపక్ష సభ్యులు ప్రతి నినాదాలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఉదయం సభ వాయిదా పడి తిరిగి మధ్యాహ్నం ప్రారంభం కాగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

మిగతా 13వ పేజీలో...

మిర్చి రైతుకు నష్టాల ఘాటు!



- భారీగా పడిపోయిన ధరలు
- ఇప్పటికే కోటి బస్తాలు కోల్డ్ స్టోరేజీల్లో
- గతేడాది రూ.23 వేల వరకు పలికిన ధర
- ఈసారి క్వింటా 12 వేల నుంచి 16 వేలే..
- విదేశాలకు ఎగుమతులు తగ్గడమే కారణం

వరంగల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మిర్చి రైతులను నష్టాల ఘాటు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎర్ర బంగారం ధరలు నేలచూపులతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి ఒడిదొడుకులను ఎదుర్కొని పంట సాగు చేస్తే చివరికి నష్టాలే మిగులుతున్నాయని వాపోతున్నారు. గతేడాది ఇదే నెలలో గరిష్ఠంగా రూ.23 వేల ధర పలికిన ఎండు మిర్చి ప్రస్తుతం రూ.16 వేలు కూడా దాటడం లేదు. క్వింటాల్ మిర్చికి రూ.7 వేల వరకు నష్టాలతో అమ్ముకోవాల్సిన దుస్థితి. గతేడాదే తక్కువ ధరలు వచ్చాయని కోటి బస్తాలకు పైగా మిర్చిని కోల్డ్‌స్టోరేజీల్లో రైతులు నిల్వ చేశారు. ఇప్పుడు గతం కంటే ధరలు పతనం కావటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. విదేశీ మార్కెట్‌కు మిర్చి ఎగుమతులు తగ్గటంతోనే ధరలు పతనమవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2020-22 మధ్యకాలంలో మిర్చికి మంచి ధరలు పలకడంతో చాలా మంది రైతులు పత్తిని కాదని మరీ మిర్చి వైపు మొగ్గు చూపారు. ఉమ్మడి జిల్లాలు వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నల్లగొండ, నిజామాబాద్ మహబూబ్‌నగర్‌లలో అత్యధికంగా మిర్చి సాగు చేస్తున్నారు. అయితే ఎన్నో ఆటుపోట్లను

మిగతా 3వ పేజీలో...



కీలక బిల్లు నేపథ్యంలో బీజేపీ ఎంపీలకు విప్

నేడే జమిలి బిల్లు

2

- పార్లమెంటులో ప్రవేశపెట్టి.. వెంటనే జేపీసీకి..
- 2029లో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు
- 2034నాటికి జమిలి పరిధిలోకి స్థానిక సంస్థలు
- 2027లో పునర్విభజన, మహిళా రిజర్వేషన్ పూర్తి
- ఏదైనా రాష్ట్రంలో జమిలి సాధ్యం కాకపోతే..?
- రాష్ట్రపతి ఉత్తర్వులతో ఆ అసెంబ్లీకి తర్వాత ఎన్నికలు
- ఈ మేరకు నిర్వహణకు వీలుండేలా బిల్లులో నిబంధన

కార్పొరేషన్‌గా కొత్తగూడెం!

3

- కొత్తగూడెం, పాల్వంచ మునిసిపాలిటీలు కలిపి ఏర్పాటు
- మొత్తం నాలుగు మండలాల్లోని 35 గ్రామ పంచాయతీల విలీనం
- సర్కారు పరిశీలనలో ప్రతిపాదనలు
- త్వరలో ప్రకటన జారీకి అవకాశం





ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ ఇక లేరు

ఊపిరితిత్తుల్లో సమస్యతో అమెరికాలో కన్నుమూత

- చిన్నప్పటి నుంచే తండ్రి ఉస్తాద్ అల్లారఖా వద్ద శిక్షణ
- పన్నెండేళ్ల వయసు నుంచే దేశవ్యాప్తంగా కచేరీలు
- విశ్వవిఖ్యాత సంగీతకళాకారులతో కలిసి ప్రదర్శనలు

న్యూయార్క్, డిసెంబరు 16: ప్రపంచ ప్రఖ్యాత తబలా విద్వాంసుడు.. పద్మవిభూషణ్ పురస్కారగ్రహీత.. ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ (73) ఇక లేరు. అధిక రక్తపోటు, గుండె, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలతో బాధపడుతూ రెండు వారాలుగా శాన్‌ఫ్రాన్సిస్కో(అమెరికా)లోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన.. భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారుజామున ఐదున్నర గంటలకు కన్నుమూశారు. జాకీర్‌హుస్సేన్ 'ఇడియోపతిక్ పల్మనరీ ఫైబ్రోసిస్ (ఊపిరితిత్తుల వ్యాధి)'తో చనిపోయినట్టు వైద్యులు వెల్లడించారు. జాకీర్‌కు భార్య ఆంటోనియా మిన్నెకోలా, ఇద్దరు కుమార్తెలు అనీసా ఖురేషీ, ఇసబెల్లా ఖురేషీ ఉన్నారు. ఆయన అంత్యక్రియలు బుధవారం లేదా గురువారం నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. లెజెండరీ తబలా మ్యాస్ట్రో, ఉస్తాద్ అల్లారఖా ఖాన్ కుమారుడైన జాకీర్‌హుస్సేన్.. 1951, మార్చి 9న బొంబాయి (నేటి ముంబై)లో జన్మించారు. ఊహ తెలిసిన నాటి నుంచే తండ్రి అడుగుజాడల్లో నడిచారు! నిజానికి జాకీర్‌హుస్సేన్ తాతముత్తాతల్లో సంగీత కళాకారులెవరూ లేరు! ఆయన తండ్రి అల్లా రఖా.. పన్నెండేళ్ల వయసులో, సంగీతం నేర్చుకోవాలనే అభిలాషతో జమ్ము కశ్మీర్‌లోని తమ ఊరైన ఫగ్వాల్ నుంచి లాహోర్‌కు పారిపోయారు. అక్కడ మియా ఖాదర్ బక్ష్ వద్ద పంజాబ్ ఘరానా పెర్కుషన్‌లో శిక్షణ పొందారు. సంగీతమే లోకంగా జీవించిన ఆయన.. తన తొలి సంతానమైన జాకీర్ హుస్సేన్ పుట్టగానే ఆ చిన్నారి చెవిలో తారకమంత్రంలా తబలా తాళాలను వినిపించి ఈ ప్రపంచంలోకి స్వాగతం పలికారు. ఇంట్లో ఎల్లప్పుడూ మోగే తబలా నాదాలు వింటూ పెరిగిన జాకీర్.. చిన్న వయసులోనే తండ్రి నేతృత్వంలో సాధన ప్రారంభించారు. "అబ్బాజీ చాలా కఠినమైన గురువు. నేను వేరే గదిలో తబలా సాధన చేస్తున్నా.. ఒక చెవి ఆయన నాపైనే వేసి ఉంచేవారు. తనకు ఎప్పుడు ఏది నేర్పాలనిపిస్తే దాన్ని నేర్పేవారు. ఆయనతో జీవితం 24/7 ఒక సాధన ప్రక్రియలాగానే ఉండేది. ఫజల్, తౌఫీక్ (జాకీర్ తమ్ముళ్లు) పుట్టిన తర్వాత కూడా అది మారలేదు. మా వరకూ మాకు ఆయన మొదట గురువే. ఆ తర్వాతే తండ్రి" అని జాకీర్ ఒక సందర్భంలో వివరించారు. అలా తండ్రి కఠిన శిక్షణలో రాటుదేలిన జాకీర్‌హుస్సేన్.. ఏడేళ్ల వయసులో తొలి ప్రదర్శన ఇచ్చారు. పన్నెండేళ్లకే దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించి విశేష పేరుప్రఖ్యాతులు సంపాదించారు. అదే సమయంలో అమ్మ మాట విని.. చదువులోనూ మేటి అనిపించుకున్నారు. ముంబైలోని సెయింట్ జేవియర్ నుంచి డిగ్రీ పట్టా పుచ్చుకున్నారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ నుంచి సంగీతంలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఆ సమయంలోనే అక్కడ ఆయనకు పలువురు పాశ్చాత్య సంగీత కళాకారులతో పరిచయాలయ్యాయి.

దీంతో తరచుగా అమెరికా పర్యటనలు చేస్తూ.. ఏడాదికి దాదాపు 150 దాకా కచేరీలు ఇస్తూ అక్కడా అమిత ప్రజాదరణ పొందారు. సితార్ మ్యాస్ట్రో పండిట్ రవిశంకర్‌తో కలిసి అమెరికాలో తొలిసారి కచేరీ ఇచ్చిన జాకీర్‌హుస్సేన్.. దరివిలా పలువురు ప్రపంచ ప్రఖ్యాత కళాకారులతో కలిసి పనిచేశారు. ఇటు భారతదేశంలోనూ అలీ అక్బర్ ఖాన్, శివకుమార్ శర్మ వంటి ప్రముఖ సంగీత కళాకారులతో కలిసి ప్రదర్శనలు ఇచ్చారు. న్యూయార్క్‌లో ఉండగానే ఆయనకు ప్రముఖ గిటారిస్ట్ జాన్ మెక్‌లాఫ్‌లిన్‌తో పరిచయమైంది. అంతర్జాతీయంగా పేరొందిన 'బీటిల్స్' బ్యాండ్‌లోని లీడ్ గిటారిస్ట్ జార్జ్ హ్యారిసన్‌కు జాకీర్‌హుస్సేన్ అత్యంత ఇష్టుడు. 1971లో.. అమెరికన్ బ్యాండ్ 'శాంతి'లో భాగమైన జాకీర్.. 1975లో జాన్ మెక్‌లాఫ్‌లిన్‌తో కలిసి 'శక్తి' బ్యాండ్‌లో పనిచేశారు. ఆ బ్యాండ్‌లో జాకీర్‌హుస్సేన్‌తోపాటు.. ఎల్ శంకర్, టీహెచ్ విక్కు వినాయక్ రామ్, ఆర్.రాఘవన్ కూడా ఉన్నారు. తర్వాత కొద్దికాలానికి విడిపోయిన ఆ బృందం.. మళ్లీ 'రిమెంబర్ శక్తి' పేరుతో మళ్లీ కలిసింది. 1987లో జాకీర్ హుస్సేన్ తన తొలి సోలో ఆల్బమ్ 'మేకింగ్ మ్యూజిక్'ను విడుదల చేశారు. దాదాపు ఆరు దశాబ్దాల సంగీత ప్రస్థానంలో.. ఇటు భారతీయ సంప్రదాయ సంగీతానికి, అటు ప్రపంచ సంగీతానికి ఎనలేని సేవలందించారు. పలు భారతీయ, అంతర్జాతీయ చిత్రాలకు సంగీతం అందించడమే కాక.. హీట్ అండ్ డస్ట్ వంటి కొన్ని చిత్రాల్లో నటించారు కూడా. నాలుగు దశాబ్దాల క్రితం అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో స్థిరపడ్డ జాకీర్ హుస్సేన్.. తన మేనేజర్, కథక్ నృత్య కళాకారిణి అయిన అంటోనియా మినెకోలా అనే ఇటాలియన్ అమెరికన్‌ను వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు.. అనీసా, ఇసబెల్లా. పెద్ద కుమార్తె అనీసా చిత్రపరిశ్రమలో పనిచేస్తుండగా.. చిన్న కుమార్తె నృత్య కళాకారిణి.

ఎన్నెన్నో అవార్డులు

వేలికొసలతో తబలపై అద్భుతాలు సృష్టించిన జాకీర్‌హుస్సేన్ ప్రతిభను.. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు వరించాయి! తన కెరీర్‌లో ఆయన ఐదు గ్రామీ పురస్కారాలను అందుకున్నారు. అందులో మూడు.. ఈ ఏడాది అందుకున్నవే! ఒకేసారి మూడు గ్రామీలు అందుకున్న తొలి భారతీయుడు ఆయనే. ఇక భారత ప్రభుత్వం ఆయన్ను.. 1988లో పద్మశ్రీ, 2002లో పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. 2023లో.. దేశ రెండో అత్యున్నత పౌరపురస్కారమైన పద్మవిభూషణ్‌ను ప్రకటించి గౌరవించింది.

చివరాఖరు: "మీ కచేరీ ప్రపంచంలో ఎక్కడ జరిగినా వేల మంది వస్తారు ఎందుకని?" అని ప్రశ్నిస్తే.. "అది నా గొప్పతనం కాదు. సంగీతం గొప్పతనం. నేను సంగీతానికి పూజారిని మాత్రమే" అని సవినయంగా సమాధానం ఇచ్చారు జాకీర్‌హుస్సేన్! ఆ వినయమే, నిత్య విద్యార్థిగా ఉండే తత్వమే, సంగీతంపై గౌరవమే.. ఆయన్ను నిజమైన 'ఉస్తాద్'గా నిలిపాయి!!

జాకీర్ హుస్సేన్‌తో కమల్‌హాసన్



ఘటం విద్వాంసుడు వినాయక్‌రామ్‌తో



వాహ్ తాజ్!

నేపథ్యంలో తాజ్ మహల్! దాని ముందు జాకీర్‌హుస్సేన్, ఒక పిల్లాడు. ఇద్దరూ తబలా వాయిస్తుంటారు. చివర్లో జాకీర్ ఆ చిన్నారిని ఉద్దేశించి.. 'వాహ్ ఉస్తాద్!' అంటాడు. దానికి ఆ చిన్నారి.. 'అరే హుజూర్, వహ్ తాజ్ బోలియే' అంటాడు. ఇప్పుడు నాలుగు పదులు దాటినవారందరికీ ఆ యాడ్ ఓ మధుర జ్ఞాపకం! ఆ సంగతి పక్కన పెడితే.. తాజ్‌మహల్ టీ పాశ్చాత్యదేశాల వినియోగదారులకు సంబంధించిందన్న అపప్రథను తొలగించిన యాడ్ అది. ఆ టీ భారతీయుల కోసం ఉద్దేశించినదే అనే విషయాన్ని తెలపడానికి ప్రకటనకర్తలు ప్రయోగించిన అస్త్రం.. జాకీర్‌హుస్సేన్. ఆ వాణిజ్యప్రకటన సృష్టికర్తలు.. కేవీ శ్రీధర్, కేఎస్ చక్రవర్తి. సుమంత్ర ఘోషల్ ఆ యాడ్‌ను చిత్రీకరించారు. "ఒక సంగీత కళాకారుడు సంగీతాభిమానులకు అద్భుతమైన అనుభవాన్ని అందించడానికి ఎలా వేలాది గంటలు సాధన చేస్తాడో.. అదే తరహాలో మావద్ద ఉన్న టీ టేస్టర్లు వేలాది రుచులను పరీక్షించి, చివరికి దీన్ని ఎంపిక చేశారని చెప్పడానికి మేం ఆ ప్రకటనను అలా రూపొందించాం" అని కేవీ శ్రీధర్ గతంలో తెలిపారు. అప్పట్లో వాణిజ్య ప్రకటనలనగానే.. ఎక్కువగా సినీ తారలు, క్రికెటర్ల వైపు చూసేవారు. అలాంటి సమయంలో తబలా మ్యాస్ట్రో అయిన జాకీర్‌హుస్సేన్‌ను ఈ ప్రకటనకు ఎంచుకోవడం ద్వారానే వారు సగం విజయం సాధించారని వాణిజ్యప్రకటనల నిపుణులు చెబుతారు!

స్నేహితుడి పాడె మోసి..



జాకీర్ హుస్సేన్ ప్రపంచం మొత్తానికీ ఉస్తాద్! దానికంటే ముందు.. సంతూర్ మ్యాస్ట్రో పండిట్ శివకుమార్ శర్మకు మాత్రం ప్రాణానికి ప్రాణమైన దోస్త్!! ఒకటా రెండా.. ఐదు దశాబ్దాలకు పైబడిన స్నేహం వారిది. సంగీత కళాకారులుగా మారిన వారి పరిచయం ప్రాణస్నేహంగా మారింది. 2022 మే నెలలో శివకుమార్ చనిపోయేదాకా వారి బంధం చెక్కుచెదరకుండా కొనసాగింది. శివకుమార్ చనిపోయినప్పుడు.. జాకీర్ హుస్సేన్ ఆయన పార్థివ దేహాన్ని తన భుజాలపై మోసి మిత్రుడిపై తనకున్న ప్రేమను చాటుకున్నారు. అంతేకాదు.. శ్మశానంలో శివకుమార్ శర్మ చితి పక్కన విచారంగా నిలబడి కంటతడి పెడుతున్న జాకీర్ హుస్సేన్ ఫొటో అప్పట్లో వైరల్ అయింది. 'ఇదీ నిజమైన ఇండియా.. స్నేహానికి కుల, మత భేదాలు లేవు' అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో వారి స్నేహం గురించి విస్తృతంగా చర్చించుకున్నారు.

లోకం తీరు



జాకీర్ హుస్సేన్ మృతికి ప్రముఖుల నివాళి

- శాస్త్రీయ సంగీతంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు: మోదీ



న్యూఢిల్లీ, డిసెంబరు 16: జాకీర్ హుస్సేన్ మృతిపై అన్ని వర్గాల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంగీత ప్రియులను ఆకట్టుకున్న అసాధారణ ప్రతిభావంతుడు అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ట్వీట్ చేశారు. భారతీయ, పశ్చిమ దేశాల మధ్య సంగీత వారధి అని పేర్కొన్నారు. జాకీర్ హుస్సేన్‌కు పద్మ విభూషణ్ ప్రదానం చేసే అవకాశం తనకు లభించిందని తెలిపారు. ఉస్తాద్ అసమాన ప్రతిభ ప్రజల హృదయాల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటుందని ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. భారతీయ సంగీతాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారని అన్నారు. జాకీర్ హుస్సేన్ మృతిపట్ల ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భారతీయ శాస్త్రీయ సంగీతంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ప్రపంచ సంగీతంతో మేళవించారని కొనియాడారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, బీజేపీ అధ్యక్షుడు నడ్డా తదితరులు సైతం సంతాపం తెలిపారు. భారతీయ శాస్త్రీయ సంగీతంలో మహోన్నతుడు జాకీర్ హుస్సేన్ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. జాకీర్ హుస్సేన్ వారసత్వం ప్రభావం సంగీత ప్రపంచంపై తప్పక ఉంటుందన్నారు. జాకీర్ హుస్సేన్ మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు అని రాహుల్ గాంధీ అన్నారు. జాకీర్ హుస్సేన్ మృతిపట్ల ఖర్గే, మమతా బెనర్జీ, యోగి ఆదిత్యనాథ్ తదితరులు సంతాపం తెలిపారు. జాకీర్ హుస్సేన్ మృతి భారతీయ సంగీతానికే కాదని.. మొత్తం సంగీత ప్రపంచానికే తీరని లోటు అని ఆరెస్సెస్ పేర్కొంది.

అవార్డు అందిన మరునాడే ఆపుదల

- వివాదాస్పదమైన సుబ్బులక్ష్మి పురస్కార ప్రదానం
- టి.ఎం. కృష్ణను గ్రహీతగా గుర్తించకూడదన్న సుప్రీం

న్యూఢిల్లీ, డిసెంబరు 16: ప్రఖ్యాత కర్ణాటక సంగీత గాయకుడు టి.ఎం. కృష్ణకు ప్రతిష్ఠాత్మక సంగీత కళానిధి ఎం.ఎస్.సుబ్బులక్ష్మి పురస్కారం ప్రదానం చేయడం మలుపులు తిరిగింది. ఆయనకు ఆదివారమే పురస్కారాన్ని బహూకరించగా, ఆయనను పురస్కార గ్రహీతగా గుర్తించకూడదంటూ సోమవారం సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకొంది. అదే సమయంలో ఈ ఉత్తర్వులు టి.ఎం. కృష్ణ విద్వత్తును గానీ, న్యాయ నిర్ణేతల విజ్ఞతనుగానీ తక్కువ చేయడం కిందికి రావని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం గమనార్హం. ఎంఎస్ సుబ్బులక్ష్మి అవార్డును ఈ ఏడాది కృష్ణకు ఇవ్వాలని మద్రాస్ మ్యూజిక్ అకాడమీ నిర్ణయించింది. అయితే, సుబ్బులక్ష్మిపై కృష్ణ గతంలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని, ఆమె పేరుతో ఉన్న అవార్డును ఆయనకు ఇవ్వకూడదని సుబ్బులక్ష్మి మనుమడు వి.శ్రీనివాసన్ అభ్యంతరం తెలిపారు. దీనిపై ఆయన తొలుత మద్రాసు హైకోర్టును ఆశ్రయించగా అవార్డును ప్రదానం చేయవచ్చంటూ ఈ నెల 13న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన వెంటనే సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఆదివారం కృష్ణకు అవార్డును ప్రదానం చేశారు. శ్రీనివాసన్ అప్పీలుపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. "పురస్కారాన్ని ఇప్పటికే అందజేసినందున కృష్ణను అవార్డు గ్రహీతగా గుర్తించకుంటే బాగుంటుందని భావిస్తున్నాం. ఆయన కూడా ప్రస్తుతానికి అవార్డు గ్రహీతనని చెప్పుకోకుంటే మంచిది" అని ఉత్తర్వుల్లో తెలిపింది. అంతకుముందు ధర్మాసనం ఎదుట వాడివేడిగా వాదోపవాదాలు జరిగాయి. పిటిషనర్ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్. వెంకట్రామన్ వాదించారు. సుబ్బులక్ష్మిని 'అతి పెద్ద నకిలీ', 'సాధువులా కనిపించే బార్బీ బొమ్మ' అంటూ కృష్ణ విమర్శించారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ ఆరోపణలను టి.ఎం.కృష్ణ ఖండించారు. తాను వేరే సందర్భంలో చేసిన వ్యాఖ్యలను తప్పుగా అన్వయించారని అన్నారు.

'జై శ్రీరాం' అనడం క్రిమినల్ నేరమా: సుప్రీం

న్యూఢిల్లీ, డిసెంబరు 16: 'జై శ్రీరాం' అనడం క్రిమినల్ నేరమా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఏదైనా మతానికి చెందిన పేరునుగానీ, నినాదాన్నిగానీ ఎలుగెత్తి చెప్పడం తప్పు ఎలా అవుతుందని వ్యాఖ్యానించింది. మసీదు లోపల జై శ్రీరాం అన్న నినాదాలు చేశారంటూ ఇద్దరు వ్యక్తులపై కర్ణాటకలో కేసు నమోదయింది. ఆ కేసును అక్కడి హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ పిటిషనర్ హైదర్ అలీ సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ అప్పీలుపై సోమవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. "జై శ్రీరాం అన్న నినాదం చేయడం నేరమవుతుందా? ఆ ఇద్దరు వ్యక్తులే ఈ నినాదం చేసినట్టు ఎలా గుర్తించారు? సీసీటీవీ కెమేరాలు ఉన్నాయని చెబుతున్నా వారిని గుర్తించింది ఎవరు?" అని అడిగింది. తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. 2023 సెప్టెంబరు 24న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మసీదులో చొరబడి జైశ్రీరాం నినాదాలు చేయడంతో పాటు బెదిరించారంటూ కేసు నమోదైంది. అయితే, ఆ నినాదం చేయడం వల్ల ఎలాంటి ఘర్షణలు జరగలేదని, నినాదాలు ఎవరు చేశారో తాను స్వయంగా చూడలేదని పిటిషనరే పేర్కొన్నందున కేసు కొట్టివేస్తున్నట్టు కర్ణాటక హైకోర్టు తెలిపింది.

మహా కుంభ మేళాకు సిఖ్స్ ఫర్ జస్టిస్ బెదిరింపు

న్యూఢిల్లీ, డిసెంబరు 16: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 2025 సంవత్సరంలో జరగనున్న మహాకుంభ్ మేళాకు నిషేధిత సిఖ్స్ ఫర్ జస్టిస్ సంస్థ నుంచి బెదిరింపు వచ్చింది. ఆ సంస్థ చీఫ్, తీవ్రవాది గురు పత్వంత్ సింగ్ పన్నున్ ప్రధాని మోదీ హిందుత్వ సిద్ధాంతానికి వ్యతిరేకంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపాడు. అంతేగాక ఇస్కాన్ సాధువుని అరెస్టు చేసినందుకు బంగ్లాదేశ్ ప్రధానిని ప్రశంసించాడు. కెనడా ప్రభుత్వం కూడా ఇదేవిధంగా ఆ దేశంలో హిందుత్వ సంస్థలను, అక్కడి ఆలయాలను నియంత్రించాలని కోరాడు. గుజరాత్‌లోని దేశ తొలి ఉపప్రధాని వల్లభ్‌భాయ్ పటేల్(స్టాట్యూ ఆఫ్ యూనిటీ) విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకునేవారికి 25,000 అమెరికన్ డాలర్లు ఇస్తానన్నాడు.

నేడే జమిలి ఎన్నికల బిల్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా కేంద్రం రాజ్యాంగ సవరణ బిల్లును మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. వెంటనే ఈ బిల్లును జేపీసీకి నివేదించాలని కేంద్రం నిర్ణయించింది. జమిలి సహా ఇతర బిల్లులు కూడా ప్రవేశపెట్టి ఉభయ సభలను సాధ్యమైనంత త్వరలో వాయిదా వేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ వర్గాల ప్రకారం.. 2029లో జమిలి ఎన్నికలు జరిపించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది. 2029లో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయని, స్థానిక సంస్థల ఎన్నికలను కూడా జమిలి పరిధిలోకి తీసుకురావడం 2034 నాటికి జరుగుతుందని అధికార వర్గాలు అంటున్నాయి. జమిలి ఎన్నికలకు ప్రధాన అడ్డంకులను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. వివిధ రాజకీయ పార్టీలను ఒప్పించి రాజ్యాంగ సవరణలు సాఫీగా జరిగేలా చూడడం ప్రధానమైనది. అలాగే జనాభా లెక్కల సేకరణ, నియోజకవర్గాల పునర్విభజన కూడా ఈలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది జనాభా లెక్కల సేకరణను, 2027 నాటికి నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ అమలు చేసే నియోజకవర్గాల గుర్తింపును పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, పార్లమెంటుతో పాటు ఏదైనా రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితులు ఉంటే?.. అలాంటి సందర్భంలో ఏం చేయాలో నిర్దేశించే నిబంధనను రాజ్యాంగ సవరణ బిల్లులో పొందుపరిచింది. ఆ రాష్ట్ర ఎన్నికలను తర్వాత నిర్వహించేలా రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసే వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు బిల్లులోని సెక్షన్ 2 సబ్ క్లాజ్ 5లో చేర్చారు. ఈ బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం కేంద్రం జేపీసీకి నివేదిస్తుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మంగళవారం సాయంత్రానికి జేపీసీ సభ్యులను ప్రకటించే అవకాశం ఉందని తెలిపాయి. కీలకమైన జమిలి బిల్లు ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మంగళవారం పార్లమెంటు సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశిస్తూ బీజేపీ లోక్‌సభలో తమ ఎంపీలకు విప్ జారీ చేసింది.

మీ భాష సరే.. పనులే బాలేవు

మీరు జేఎన్‌యూ..నేను మునిసిపల్ స్కూల్.. రాసింది చదవడం నాకు కూడా వచ్చు

- నిర్మలా సీతారామన్‌పై ఖర్గే విసుర్లు
- కుటుంబం కోసమే రాజ్యాంగ సవరణలు
- కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి నిర్మల నిప్పులు
- రాజ్యసభలో వాడీవేడిగా రాజ్యాంగ చర్చ..





న్యూఢిల్లీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంపై రాజ్యసభలో సోమవారం జరిగిన చర్చ అధికార, విపక్ష నేతల మధ్య తీవ్ర వాగ్యుద్ధాన్ని రాజేసింది. ఈ చర్చ సందర్భంగా కాంగ్రెస్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విరుచుకుపడగా, నిర్మలను ఉద్దేశించి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పదునైన విమర్శల దాడిని సాగించారు. దీంతో రాజ్యాంగంపై చేపట్టిన చర్చ రాజ్యసభను వేడెక్కించింది. తమ నేతలను కాపాడుకోడానికీ, కుటుంబం, రాజకీయ వంశ పరిరక్షణకూ తప్ప ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు 'వృద్ధ రాజకీయ పార్టీ' (కాంగ్రెస్) ఏనాడూ రాజ్యాంగ సవరణ చేయలేదని మంత్రి నిర్మలా సీతారామన్ ధ్వజమెత్తారు. మాజీ ప్రధాన మంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ నుంచి నేటివరకు.. 42వ రాజ్యాంగ సవరణ నుంచి షాబానో ఉదంతంలో చేసిన సవరణ దాకా.. కాంగ్రెస్‌ది ఇదే తంతు అని విమర్శించారు. "భావ ప్రకటన స్వేచ్ఛను రాజ్యాంగంలో పొందుపరచడం పట్ల దేశం గర్విస్తుంది. కానీ, అప్పటి తొలి మధ్యంతర ప్రభుత్వం ఈ స్వేచ్ఛకు నియంత్రణలు విధిస్తూ రాజ్యాంగ సవరణ తెచ్చింది. రాజ్యాంగాన్ని ఆమోదించి అప్పటికి ఒక ఏడాది కూడా కాలేదు" అని నిర్మల తీవ్ర స్వరం వినిపించారు. ఆమె వ్యాఖ్యలపై ఖర్గే అంతే దీటుగా స్పందించే ప్రయత్నం చేశారు. "నేను మునిసిపల్ స్కూలులో చదివాను. రాసిచ్చింది చదవడం నాకు కూడా వచ్చు. ఆమె జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చదివారు. ఆమె మాట్లాడే ఇంగ్లీష్, హిందీ సహజంగానే బాగుంటాయి. కానీ, పనులే ఏమీ బాగా లేవు" అని ఖర్గే విరుచుకుపడ్డారు. రాజ్యాంగాన్ని, జాతీయజెండాను, అశోకచక్రను ద్వేషించిన చరిత్ర కలిగినవారు.. తమకు పాఠాలు చెప్పాలని చూడటం ఆశ్చర్యపరుస్తోందని ఎద్దేవా చేశారు. "రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజున వీళ్లు (నిర్మలను ఉద్దేశించి) దానిని తగలబెట్టారు. అంబేడ్కర్, నెహ్రూ, గాంధీల దిష్టిబొమ్మలకు ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో ఆ రోజున నిప్పుపెట్టారు" అని ఖర్గే ఆరోపించారు. స్త్రీ, పురుష వివక్ష లేకుండా అందరికీ సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పించిన ఘనత 'వృద్ధ రాజకీయ పార్టీ', రాజ్యాంగాలదేనని, అప్పటికి మహిళలకు ఓటుహక్కు గురించిన ఆలోచనే ప్రపంచంలోని అత్యధిక దేశాలకు లేదన్నారు. ఈ నిర్ణయాన్ని ఆనాడు ఆర్ఎస్ఎస్, జన్‌సంఘ్ వ్యతిరేకించాయని ఖర్గే విమర్శించారు. ఆర్ఎస్ఎస్‌కు చెందిన పూర్వ నాయకులు రాజ్యాంగాన్ని వ్యతిరేకించారనేది సుస్పష్టమన్నారు.

రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం

రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని, కుల గణన చేపట్టకపోవడానికి అదే కారణమని ఖర్గే ఆరోపించారు. రాజ్యాంగాన్ని, జాతీయ జెండాను ఆర్ఎస్ఎస్ అంగీకరించలేదని, అందుకే 2002 జనవరి 26న ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించాలని న్యాయస్థానం ఆదేశించిందని ఖర్గే తెలిపారు. రిజర్వేషన్ అంశంపై రాష్ట్రాలకు నెహ్రూ లేఖలు రాయడం సహా అనేక అంశాల్లో వాస్తవాలను ప్రధాని మోదీ వక్రీకరించి దేశాన్ని తప్పుదారి పట్టించారని ఖర్గే ఆరోపించారు. ఇందుకుగాను దేశానికి ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.


ప్రియాంక భుజాన 'పాలస్తీనా' బ్యాగ్



కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా 'పాలస్తీనా' అనే పదం ముద్రించబడి వున్న బ్యాగ్‌ను భుజాన వేసుకొని సోమవారం పార్లమెంట్‌కు రావడం చర్చనీయాంశంగా మారింది. ప్రియాంక ఆ బ్యాగ్‌ను ధరించి ఉన్న ఫొటోను కాంగ్రెస్ అధికార ప్రతినిధి షామా మహమ్మద్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. ప్రత్యేక బ్యాగ్‌ను ధరించడం ద్వారా ఆమె పాలస్తీనాకు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. దీనిపై బీజేపీ ఎంపీ, ఆ పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర స్పందించారు. గాంధీ కుటుంబం విషయానికి వస్తే ఇదేమీ కొత్త కాదని, నెహ్రూ నుంచి ప్రియాంక వరకు గాంధీ కుటుంబసభ్యులు 'బుజ్జగింపు' బ్యాగ్‌లతో తిరుగుతున్నారని వ్యాఖ్యానించారు.

కాంట్రాక్టుకు లంచం

(మొదటి పేజీ తరువాయి)



జరిమానాలు చెల్లించిన కంపెనీల్లో మూగ్ ఇంక్, ఒరాకిల్ కార్పొరేషన్, అల్బెమార్లె కార్పొరేషన్ ఉన్నాయి. మూగ్ ఇంక్‌కు భారత్‌లో అనుబంధ సంస్థ అయిన మూగ్ మోషన్ కంట్రోల్స్ ప్రైవేట్స్ లిమిటెడ్ (ఎంఎంసీపీఎల్) ద్వారా హిందుస్థాన్ ఏరో నాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), సౌత్ సెంట్రల్ రైల్వే రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్డీఎస్ఓ) అధికారులకు లంచం ఇచ్చి కాంట్రాక్టులు దక్కించుకున్నట్లు అక్టోబరు 11న సెక్ పేర్కొంది. ఆగస్టు 2020లో "ఏజెంట్ ఏ"ని నియమించుకోవడం ద్వారా సౌత్ సెంట్రల్ రైల్వే టెండర్ల జాబితా కంపెనీల్లో మూగ్ చోటు దక్కించుకుందని, ఆ తర్వాత నెలలో 34,323 డాలర్ల విలువైన కాంట్రాక్టు విజేతగా నిలిచిందని సెక్ పేర్కొంది. ఈ కాంట్రాక్టులో 10 శాతం కమిషన్ మూగ్ ఇచ్చినట్లు వెల్లడించింది. ఇక నవంబరు 2021లో హెచ్ఏఎల్‌కు విడిభాగాలు, సేవలు అందించే 13,99,328 డాలర్ల కాంట్రాక్టు దక్కించుకునేందుకు హెచ్ఏఎల్ అధికారి ఒకరికి 2.5% కమిషన్ ఇచ్చినట్లు సెక్ తెలిపింది. హెచ్ఏఎల్, రైల్వేలకు సుమారు 5 లక్షల డాలర్లు మూగ్ లంచం ఇచ్చినట్లు సెక్ చెప్పింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)తో పాటు ఇండోనేసియా, వియత్నాంలోని కంపెనీల కాంట్రాక్టుల కోసం అల్బెమార్లె కార్పొరేషన్ భారీగా ముడుపులు ఇచ్చి దక్కించుకున్నట్లు గతేడాది సెక్ పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా 700కు పైగా కంపెనీలకు రిఫైనింగ్ సొల్యూషన్స్‌ను అల్బెమార్లే సరఫరా చేస్తోంది. 2009-2017 మధ్య ఐఓసీతో సంబంధాలు నెరిపింది. 2017లో 63.5 మిలియన్ల డాలర్లు లంచం ఇస్తూ అమెరికా అధికారులకు దొరికింది.

ఒరాకిల్ కూడా అదే దారిలో

టెక్ దిగ్గజం ఒరాకిల్ కార్పొరేషన్ ఇండియాతో పాటు యూఏఈ, తుర్కియేల్లో అవినీతి చర్యలకు పాల్పడినట్లు సెక్ తెలిపింది. ఓ ట్రాన్స్‌పోర్టేషన్ కంపెనీ నుంచి 2019లో ఒరాకిల్ సేల్స్ ఉద్యోగులు అధిక రాయితీ పొందారని, ఆ కంపెనీలో ఎక్కువ భాగస్వామ్యం రైల్వేకు ఉందని తెలిపింది. రాష్ట్ర యాజమాన్యంలోని ఓ సంస్థ నిధుల విడుదల విషయంలో 6.8 మిలియన్ డాలర్ల ముడుపులు చెల్లించినట్లు వెల్లడించింది.

జరిమానా ఇలా..

- హెచ్ఏఎల్, రైల్వేల్లో 5 లక్షల డాలర్లకుపైగా ముడుపులు ఇస్తూ దొరికిన మూగ్ ఇంక్‌కు సెక్ 1.68మిలియన్ల డాలర్లకుపైగా ఫైన్ వేసింది.
- ఇండియన్ రైల్వేస్, యూఏఈ, తుర్కియేల్లో 6.8 మిలియన్ డాలర్లు లంచం ఇచ్చిన ఒరాకిల్ కార్పొరేషన్‌కు 23 మిలియన్ డాలర్లు పెనాల్టీ విధించి సెక్ కేసు సెటిల్ చేసింది.
- ఐఓసీతో పాటు ఇండోనేసియా, వియత్నాంలో 63.5 మిలియన్ డాలర్లకు పైగా లంచాలు ఇచ్చిన అల్బెమార్లె కార్పొరేషన్‌కు 198 మిలియన్ డాలర్ల భారీ జరిమానా విధించింది.



నార్కట్‌పల్లిలో బస్టాండ్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న మాల ధారులు, ధర్నాలో కూర్చున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

గాయత్రి యజ్ఞంకు అనుమతించాలని ఆందోళన

- రోడ్డుపై భిక్ష చేసి మాలధారుల నిరసన
- నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ఘటన

నార్కట్‌పల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో హనుమత్ గాయత్రి యజ్ఞం నిర్వహణకు అనుమతి ఇవ్వ కపోవడాన్ని నిరసిస్తూ హనుమాన్, అయ్యప్ప మాలధారులు సోమవారం ఆందోళన నిర్వహించారు. నార్కట్‌పల్లి స్టాండ్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. రోడ్డుపైనే మాలధారులు మధ్యాహ్నం భిక్ష చేశారు. నార్కట్‌పల్లిలో మసీదు ఎదురుగా ఉన్న అంగడి స్థలంలో ఈ నెల 17న యజ్ఞం నిర్వహించేం దుకు పోలీసుల అనుమతి కోరారు. ఆ స్థలంపై కొంతకాలంగా వివాదం నడు స్తుండటంతో పోలీసులు అనుమతి నిరాకరించారు. చివరకు యజ్ఞం నిర్వహ ణపై జిల్లా కలెక్టర్, ఎస్పీల వద్ద చర్చించిన తర్వాత నిర్వహించుకోవాలని చేసిన సూచనను మన్నిస్తూ మంగళవారం జరగాల్సిన యజ్ఞాన్ని తాత్కాలి కంగా వాయిదా వేశారు. బీజేపీ, నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి, హైందవ సంఘాల నాయకులు నిరసనలో పాల్గొన్నారు. మరోవైపు నార్కట్‌పల్లి మసీ దులో నమాజ్ జరుగుతున్న సమయంలో కొందరు రాళ్లు రువ్వి రెచ్చగొట్టే చర్య లకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఎంబీటీ(మజ్లిస్ బచావో తెహ్రీక్) నేత అమ్జె దుల్లాఖాన్ ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ చేసిన వీడియోను తొలగించాలని కోరుతూ ఆ సంస్థకు లేఖ రాసినట్లు నార్కట్‌పల్లి సీఐ నాగరాజు తెలిపారు.

రాములోరి భక్తులకు అసౌకర్యం కలగొద్దు

- అధికారులకు మంత్రి సురేఖ ఆదేశం

హైదరాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్స వాలకు భద్రాచలం వచ్చే సీతారామచంద్రస్వామి భక్తులకు ఎలాంటి అసౌ కర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఈనెల 31 నుంచి వచ్చేనెల 20వ తేదీ వరకు నిర్వహించే ఈ అధ్యయనోత్సవాలకు హాజరుకావాల్సిందిగా మంత్రిని ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఆమెకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ ఏర్పా ట్లపై అధికారుల్ని మంత్రి ఆరా తీశారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు కాబట్టి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆమె ఆవిష్క రించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ఆలయ ఈవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ధూపదీప అర్చకుల వేతనం 25 వేలకు పెంచండి

- రాష్ట్ర ప్రభుత్వానికి అర్చకుల విజ్ఞప్తి

హైదరాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ధూపదీప నైవేద్య అర్చకులకు చెల్లిస్తున్న రూ.10 వేల గౌరవ వేతనాన్ని రూ.25 వేలకు పెంచి ఇవ్వాలని ధూపదీప నైవేద్య అర్చకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెరిగిన ధరల్ని పరిగణనలోకి తీసుకుని వేతనాన్ని పెంచడంతో పాటు ప్రతి నెల 10వ తేదీలోపు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తీసుకోమని వారు కోరారు. అలాగే తమకూ అర్చక వెల్ఫేర్ ఫండ్ సదుపాయాలను వర్తింప జేయాలని, ఆరోగ్య భద్రతకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, త్రిసభ్య కమిటీలో స్థానం కల్పించాలని విన్నవించారు. న్యాయమైన తమ సమస్యలను పరిష్కరించమని త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ తెలిపారు.

రైతు బీమా నగదు కాజేసిన ఏఈవో

కురవి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మరణించిన రైతు కుటుంబానికి రైతు బీమా నగదును అందించాల్సిన ఏఈవో.. బాధిత కుటుంబం నిరక్షరాస్యతను ఆసరా చేసుకుని కాజేశాడు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రా తిమడుగు గేటుతండాకు చెందిన రైతు బానోత్ ఈ ఏడాది జూన్ 9న మృతి చెందాడు. నామినీగా ఉన్న ఆయన భార్య బానోత్ ఇరానీ స్థానికుల సాయంతో రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకున్నారు. అక్టోబరు 10న బీమా సొమ్ము 5లక్షలు ఇరానీ ఖాతాలో జమ అయినా ఆమెకు తెలియలేదు. ఆమె నిరక్షరాస్య తను ఆసరాగా చేసుకున్న ఏఈవో బానోత్ కల్యాణ్ కొన్ని సంతకాలు చేస్తే నగదు వెంటనే చేతికొస్తాయని నమ్మించి చెక్కుపై సంతకం చేయించుకుని అక్టోబరు 19న ఇరానీ ఖాతాలో ఉన్న ఆ డబ్బును తన ఖాతాకు బదిలీ చేయిం చుకున్నాడు. నెల తర్వాత ఇరానీ గుండ్రాతిమడుగులోని బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా ఆమె ఖాతాలోని నగదు ఏఈవో కల్యాణ్ ఖాతాకు బదిలీ అయిందని అధికారులు తెలిపారు. దీనిపై ఏఈవో కల్యాణ్‌ను ప్రశ్నించగా.. వారం రోజుల్లో డబ్బు ఇస్తా అంటూ ఆయన ఇచ్చిన చెక్కు బౌన్స్ అయింది. దీంతో బాధితు రాలు కురవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్‌కు చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం

- గోదావరి బోర్డుకు వివరాలివ్వాలని సీడబ్ల్యూసీ లేఖ

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిన్నకాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ) కింద సహాయం అందించాలని కేంద్రం తాజాగా నిర్ణయించడంతో ఆ పథకానికి ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ తీసుకోవడానికి వీలుగా ప్రతిపాదనలను తెలంగాణ ప్రభుత్వం సమ ర్పించింది. కేంద్రం నుంచి ప్రాజెక్టులకు సహాయం పొందాలంటే విధిగా ఇన్వెస్ట్ మెంట్ క్లియరెన్స్ తీసుకోవాలి. ప్రాజెక్టుకు వెచ్చించే నిధులపై హేతుబద్ధత ఉందా..? లేదా..? వంటి అంశాలను నిర్ధారించుకోవాలి. మేడిగడ్డ బ్యారేజీకి ఎగువన కన్నెపల్లి గ్రామంలో గోదావరి నదిపై రూ.545.15 కోట్ల వ్యయంతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిన విషయం విదితమే. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి ఏఐబీపీ కింద సహాయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణ యించి ప్రతిపాదనలు సమర్పించింది. ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సమర్పించగా టీఏసీ మినిట్స్‌తో పాటు రోజుకు ఏ మేర నీటిని తరలిస్తారు? రియల్ టైమ్ టెలిమెట్రీ విధానం ఏర్పాటు చేసి, గోదావరి బోర్డుకు వివరాలు అందించాలని కేంద్ర జలవనరుల సంఘం (సీడ బ్ల్యూసీ) కోరింది. ఇక తాజాగా ఏ మేరకు ప్రాజెక్టుపై ఖర్చుపెట్టారనే సమగ్ర వివరాలు అందించాలని పేర్కొంది. కాగా, కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సహాయం అందించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పలు దఫాలు కేంద్రాన్ని కోరింది. అయితే ఖర్చుకు సంబంధించిన సమగ్ర వివరాలు సమర్పిస్తే ఏఐబీపీ కింద సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని కేంద్రం తెలిపింది. అయితే దాన్ని సున్నితంగా అప్పటి ప్రభుత్వం తోసిపుచ్చింది. సమగ్ర వివరాలు అందిస్తే బండారం బయటపడుతుందనే కారణంతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ తీసుకోలేదని విమర్శలు వచ్చాయి.

ఏడాదిలో మావోయిస్టులను ఏరివేస్తాం

వారి వల్లే గ్రామాలు అభివృద్ధి చెందలేదు.. ఇప్పటికైనా లొంగిపోవాలి

- గ్రామాల్లో ఏడాదిలోపు వసతులు కల్పిస్తాం.. ప్రతి పేద కుటుంబానికి ఇల్లు
- మావోయిస్టు నేత హిడ్మా ఇలాకాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- ఛత్తీస్‌గఢ్‌లోని గుండం గ్రామంలో బడి ప్రారంభం.. గ్రామస్థులతో మాటామంతీ
- షా రాకతో భద్రతా బలగాలతో నిండిపోయిన దండకారణ్యం



ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా గుండం గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న అమిత్ షా

చర్ల, డిసెంబరు 16: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గుండం గ్రామంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం పర్యటించారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా ఇలాకాగా భావించే ప్రాంతం లోని గుండం గ్రామానికి అమిత్ షా ఉదయం 11 గంటలకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన పాఠశాలను ప్రారంభించారు. చిన్నారులతో సరదాగా మాట్లాడారు. అనంతరం గ్రామంలో చెట్టు కింద ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్థులతో మాట్లాడారు. ఏళ్లు గడుస్తున్నా గ్రామం అభివృద్ధి చెందలేదని, పక్కా ఇళ్లు, రోడ్లు కూడా కని పించడం లేదని, ఈ పరిస్థితికి మావోయిస్టులే ముఖ్య కారణమని అమిత్ షా అన్నారు. 2026 నాటికి ఛత్తీస్ గఢ్‌లో మావోయిస్టులు లేకుండా చేస్తామని చెప్పారు. ఇప్పటికైనా మావోయిస్టులు తుపాకులు వీడాలని, లొంగిపోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వచ్చే ఏడాదిలోపు అన్ని గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్డు సదుపా యాలు కల్పిస్తామని చెప్పారు. ప్రతీ పేద కుటుంబా నికి పక్కా ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రభుత్వం పాఠశాల ఏర్పాటు చేసిందని, ప్రతీ చిన్నారిని బడికి పంపించాల్సిన బాధ్యత తల్లి దండ్రులపై ఉందని చెప్పారు. చదువుకుంటేనే కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా పోలీసు క్యాంపులో చెప్పా లని, అన్ని రకాలుగా బలగాలు ఆదుకుంటాయని తెలిపారు. ప్రతీ కుటుంబం ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా తదితర వివరాలను క్యాంపులో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం అమిత్ షా సీఆర్పీఎఫ్ అధికారులతో సమావేశమ య్యారు. మావోయిస్టుల కదలికలతో పాటు మావో యిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. గుండం గ్రామం, దాని పరిసర ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. గుండం గ్రామం హిడ్మా సొంత ఊరైన పూవర్తి గ్రామానికి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గుండం, తెర్రం, పూవర్తి గ్రామాలను మావోయిస్టు పార్టీ రాజ ధానులుగా పిలుస్తారు. గతంలో ఈ ప్రాంతంలోని అడవులపై నుంచి హెలికాప్టర్‌లో వెళ్లాలన్నా భయ పడే పరిస్థితి ఉండేది. అలాంటిది నేడు ఆయా గ్రామాలకు బలగాలు రహదారులు ఏర్పాటు చేశాయి. వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. హిడ్మా ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పర్యటించి పోలీసు బలగాల్లో ఆత్మస్థైర్యం నింపాలనే లక్ష్యంతోనే అమిత్ షా పర్యటన సాగినట్లు తెలుస్తోంది. ఆయన వెంట ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి, బస్తర్ ఐజీ సుందర్‌రాజ్, ఇతర అధికారులు ఉన్నారు. అమిత్ షా పర్యటన నేపథ్యంలో దండకారణ్యం మొత్తం బలగాలతో నిండిపోయింది.

నదుల అనుసంధానంపై కేంద్రం భేటీ 19న

- కేంద్ర జలశక్తి మంత్రి అధ్యక్షతన సమావేశం

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నదుల అను సంధానం, ప్రాజెక్టుల పురోగతిపై చర్చించడానికి వీలుగా న్యూఢిల్లీలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) వార్షిక సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటలకు ఈ భేటీ ఉంటుంది. ఇందులో ప్రధానంగా గోదావరి-కావేరీ అనుసంధానంపై చర్చించనున్న ట్లు సమాచారం. ఇంచంపల్లి వద్ద రిజర్వాయర్ కట్టకుండా.. సమ్మక్కసాగర్(తుపాకులగూడెం)బ్యారేజీలో 83మీటర్ల పైన నిల్వ చేసిన నీటిని మాత్రమే తరలించాలని, ఇక గోదావరి-కావేరీ అనుసంధానంలో తెలంగాణకు కేటాయించే కోటా కింద గొట్టిముక్కల వద్ద 2 రిజర్వాయర్లు కట్టించాలని, కృష్ణా జలాల వివాదం తేలేదాకా నాగార్జునసాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకోరాదన్న తెలంగాణ ప్రతిపాదనలపై చర్చ జరగనుంది. పోలవరం నుంచే గోదావరి-కావేరీ అను సంధానం చేపట్టాలని ఏపీ విజ్ఞప్తి చేయగా... కేం ద్రం సున్ని తంగా తిరస్కరించి గోదావరి-పెన్నా అనుసంధానం అంత్ర రాష్ట్ర ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించిన విషయం విదితమే.

అంతర్ జిల్లా భార్యాభర్తల బదిలీలకు సీఎం అంగీకారం

- పీఆర్టీయూ ప్రకటన

హైదరాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా భార్యాభర్తల బదిలీలకు సీఎం రేవంత్ రెడ్డి అంగీకరించినట్టు ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) ప్రక టించింది. 317 స్పౌజ్ బదిలీల్లో భాగంగా అన్ని జిల్లాల భార్యాభర్తల అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశమివ్వాలని సోమవారం సీఎంకు పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి వినతి పత్రాన్ని అంద జేశారు. దీనిపై సీఎం స్పందిస్తూ, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలను మినహాయించి మిగతా జిల్లా ల్లో అవకాశం ఇస్తామన్నారని పీఆర్టీయూ సభ్యులు తెలి పారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు.

మిర్చి రైతుకు నష్టాల ఘాటు!

(మొదటి పేజీ తరువాయి)

ఎదుర్కొని మిర్చిని పండించటం ఒక ఎత్తయితే.. ఆరబోసి, ఎండబె ట్టడం మరో ఎత్తు.. ఇంతా చేసి మార్కెట్‌కు తీసుకెళ్తే ఆశించిన ధర దక్కడం లేదు. గతేడాది ఆశించిన స్థాయిలో ధరలు లభించకపోవ టంతో నష్టాల్లో కూరుకుపోయిన రైతులకు.. ఈ ఏడాది కూడా ఎర్ర బంగారం ధరలు పడిపోతుండటం గోరు చుట్టుపై రోకలి పోటులా మారింది. కొత్త మిర్చి ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి వస్తుండగా.. రైతులు ఎక్కువ సాగు చేసే తేజ రకం మిర్చికి రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకు.. వండర్ హాట్ మిర్చికి రూ.11 వేల నుంచి రూ.14 వేల మధ్య ధరలున్నాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే తేజ రకం మిర్చికి క్వింటాలుకు రూ.7 వేల వరకు, వండర్‌హాట్ రకానికి రూ.14 వేల వరకు ధరలు తగ్గినట్టుగా మార్కెట్ వర్గాలు పేర్కొంటు న్నాయి. ఇటు గతేడాది కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్న ఏసీ మిర్చికి అదే స్థాయిలో ధరలు తగ్గాయి. ఒక్క వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లోనే సుమారు 25 లక్షల బస్తాలను నిల్వ చేయగా, ఖమ్మంతో పాటు మిగతా వ్యవసాయ మార్కెట్లలో 75 లక్షలకు పైగా బస్తాలను భద్రపరిచారు. గతేడాది డిసెంబరులో తేజ రకం ఏసీ మిర్చికి గరిష్ఠంగా రూ.24,250 ధర ఉండగా, వండర్‌హాట్ రకానికి రూ.27,300 వరకు పలికింది. అయితే ప్రస్తుతం ఏసీ తేజ రకానికి రూ.15,500 వరకు, వండర్ హాట్ రూ.13 వేల వరకే ధరలున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. ధరల పతనంతో పాటు కోల్‌స్టోరేజీల్లో నిల్వకు బస్తాకు రూ.150 నుంచి రూ.300 వరకు చెల్లించటం అదనపు భారంగా మారిందని వాపోతున్నారు.

ఎగుమతులు లేకనే..

మిర్చి ధరల పతనానికి విదేశాలకు ఎగుమతులు తగ్గడమే ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం మిర్చికి మంచి ధరలు రావటంతో తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా మిర్చి సాగు వి స్తీర్ణం పెరిగిందని.. అయితే అదే స్థాయిలో ఎగుమతులు లేవంటున్నారు. మిర్చి ఎగుమతుల్లో 70 శాతం చైనా, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాలకేన న్నారు. శ్రీలంకలో నెలకొన్న ఆర్థిక పరిస్థితుల్లో ఎగుమతులపై ప్రభావం పడిందని.. అలాగే చైనాకు కూడా భారీగా ఎగుమతులు తగ్గటంతో ధరల పతనానికి దారి తీసిందని అంటున్నారు.

ఈవీఎంలపై 'ఇండియా'లో భేదాభిప్రాయాలు

- ఒమర్ అబ్దుల్లా బాటలో కాంగ్రెస్‌ను తప్పుపట్టిన టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ
- సీఎం అయ్యాక మీరు మారిపోయారు
- ఒమర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ, డిసెంబరు 16: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ల వి షయంలో 'ఇండియా' కూటమిలో భేదాభిప్రాయాలు పెరిగిపోతున్నాయి. ఈవీఎంలపై కాంగ్రెస్ అనుమానం వ్యక్తం చేయడాన్ని ఇటీవల జమ్ము-కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా తప్పుపట్టగా తాజాగా టీఎంసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీ కూడా ఆయన బాటలోనే కాంగ్రెస్‌ను తప్పుపట్టారు. ఈవీఎంలపై పలు ప్రతిపక్ష పార్టీలు చేసిన ఆరోపణలను అభిషేక్ సోమవారం తోసిపుచ్చారు. ఈవీఎంల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతున్న వారు.. వాటిని ఎలా ట్యాంపరింగ్ చేయవచ్చో ఈసీకి ఓ డెమోను సాక్ష్యంగా చూపించాలని ఆయన పేర్కొన్నారు. కాగా, ఈవీఎంలపై ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందించింది. సీఎం అయ్యాక మీరెందుకు మారిపోయారని ఆయనను కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ప్రశ్నించారు. సమాజ్‌వాదీ పార్టీ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, శివసేన(యూబీటీ)లు కూడా ఈవీఎంపై అభ్యంతరాలు వ్యక్తం చేశాయని గుర్తు చేశారు. వాస్తవాలను పరిశీలించాలని, కూటమిలో ఒకరిగా ఉన్న మీరు సీఎం అయ్యాక భాగస్వాములతో ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు మీకు ఎన్నికల్లో ఎలా పోరాడాలో తెలియకపోతే ఈవీఎంలను నిందించవద్దని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర విమర్శించారు.

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి సుప్రీంకోర్టు నోటీసులు

ఎన్నికల అఫిడవిట్‌లో వివరాలు దాచారని కేసు

న్యూఢిల్లీ, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసన సభ ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పలు అంశాలను దాచిపెట్టారనే ఆరోపణలకు సంబంధించి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి (బీఆర్‌ఎస్)కి సోమవారం సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అఫిడవిట్‌లో ఆదాయ పన్ను వివరాలను సరిగ్గా పొందుపరచలేదని ప్రత్యర్థి అజ్మీరా శ్యామ్ ఆరోపించారు. తొలుత ఇదే విషయమై హైకో ర్టులో పిటిషన్ వేయగా అక్కడ నిరాశ ఎదురయింది. దాంతో ఆయన నవంబర్ 21న సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. దీనిపై ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనల తర్వాత కోవ లక్ష్మికి నోటీసులు జారీ చేసింది. తదు పరి విచారణను వచ్చే నెల 30కు వాయిదా వేసింది.

అదనపు ఎస్పీలకు నాన్‌క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో అదనపు ఎస్పీలుగా విధులు నిర్వహిస్తున్న పలువు రికి నాన్‌క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు హోంశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా సోమ వారం ఉత్తర్వులు జారీ చేశారు. కె. గుణశేఖర్, జి. నర్సింహా రెడ్డి, ఎస్. మల్లా రెడ్డి, మద్దిపాటి శ్రీనివాస్, పి. శోభన్ కుమార్, టి. సాయిమనోహర్, డి. రమేశ్, జె. చెన్నయ్య, పి. విజయ్ కుమార్ నాన్‌క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి పొందారు. కాగా, రాచకొండ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ డీసీపీగా ఉన్న పి. కరుణాకర్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. రాచకొండ ట్రాఫిక్ డీసీపీ కె. మనోహర్‌ను రోడ్డు భద్రతా విభాగానికి, మాదాపూర్ ఎస్‌వోటీ డీసీపీ డి. శ్రీనివాస్‌ను మేడ్చల్ ఎస్‌వోటీ డీసీపీగా నియమించారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా: చిన్నారెడ్డి

సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది సమస్యలను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి భరోసా ఇచ్చారు. ప్రజాభ వన్‌లో సోమవారం సర్వశిక్ష అభియాన్ సిబ్బంది చిన్నారెడ్డి తో భేటీ అయ్యారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరి ష్కరించాలని కోరగా చిన్నారెడ్డి పైవిధంగా స్పందించారు.

నగరపాలక సంస్థగా కొత్తగూడెం!

- కొత్తగూడెం, పాల్వంచ మునిసిపాలిటీలతో పాటు.. నాలుగు మండలాల్లోని 35 గ్రామ పంచాయతీల విలీనం
- ప్రతిపాదనలను పరిశీలిస్తున్న ప్రభుత్వం.. త్వరలోనే ప్రకటన



కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్

హైదరాబాద్, డిసెంబరు 16(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో మరో నగరపాలక సంస్థ ఏర్పాటు కానున్నట్లు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 13 కార్పొరే షన్లు ఉండగా.. కొత్తగూడెం పురపాలక సంస్థను నగర పాలక సంస్థగా మార్చా లని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సర్కారు పరిశీలిస్తోంది. ప్రస్తుతం పుర పాలక సంస్థలుగా ఉన్న కొత్తగూడెం, పాల్వంచతోపాటు నాలుగు మండలా ల్లోని 35 గ్రామ పంచాయతీలను కార్పొ రేషన్‌లో విలీనం చేసే అవకాశం ఉంది. చుంచుపల్లి మండలంలోని 3 ఇంక్లైన్, 4 ఇంక్లైన్, బాబు క్యాంప్, చుంచుపల్లి (పీటీ), ధన్‌బాద్, గౌతంపూర్, ఎస్‌కే.నగర్ (బదావత్ తండా), నంద తండా, పెనుబల్లి, ప్రశాంతినగర్, రామాంజనేయ కాలనీ, రుద్రంపూర్, వెంకటేశ్వరకాలనీ, విద్యానగర్ కాలనీ పంచాయతీలు, లక్ష్మీదేవిపల్లి మండలంలోని అశోక్‌నగర్ కాలనీ, చాటకొండ (ఆర్), హమాలీకాలనీ, లక్ష్మీదేవిపల్లి, లోతువాగు, ప్రశాంత్ నగర్, సంజయ్ నగర్, సాతివారిగూడెం, శేషగిరినగర్, శ్రీనగర్ కాలనీ పంచాయతీలు, పాల్వంచ మండలంలోని బసవతారక కాలనీ, జగన్నాథ పురం, కేశవపురం, లక్ష్మీదేవిపల్లి (ఎస్), సుజాతానగర్ మండలంలోని 2ఇంక్లైన్ (హెడ్ క్వార్టర్), కోమటిపల్లి, లక్ష్మీదేవిపల్లి, నిమ్మలగూడెం, మంగపేట, నాయకుల గూడెం, సుజాతానగర్ పంచాయతీలు కార్పొరేషన్‌లో విలీనం కానున్నాయి. ప్రస్తుతం కొత్తగూడెం మునిసిపాలిటీ పరిధిలో 97,337 మంది ఉండగా, పాల్వంచ పరిధిలో 89721 మంది నివసిస్తున్నారు. సుజాతానగర్ మండలంలోని ప్రతిపాదిత 7 పంచాయతీల పరిధిలో 11,124, చుంచుపల్లిలోని 14 పంచాయతీల పరిధిలో 41,860, లక్ష్మీదేవిపల్లి మండలంలోని 10 పంచాయతీల్లో 21,432, పాల్వంచలోని నాలుగు పంచాయతీల్లో 5,903 మంది నివసిస్తున్నారు. రెండు మునిసిపాలిటీలతో పాటు పంచాయతీలు కలిపితే మొత్తం జనాభా 2,67,337కి చేరుతుంది. కొత్తగా వి లీనం కానున్న 35 పంచాయతీల్లో ఏడుగురు సర్పంచ్‌ల పదవీకాలం 28 నెలలు ఉండగా.. మిగతా 28 పంచాయతీల పదవీకాలం ఐదారు నెలల్లో ముగియనుంది. కార్పొరేషన్ ఏర్పాటుకు సంబంధించిన అన్ని అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెంను నగర పాలక సంస్థగా ఉన్నతీకరించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇప్పటికే పలుమార్లు సీఎం రేవంత్‌ను కోరగా.. తప్పకుండా ఏర్పాటు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొత్త కార్పొరే షన్ ఏర్పాటు విషయాన్ని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించనున్నట్లు తెలిసింది.

ఇండోర్‌లో యాచకులకు డబ్బులిస్తే ఇక కేసులు

- నూతన సంవత్సరం నుంచి అమలు

ఇండోర్, డిసెంబరు 16: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో భిక్షాటన వృత్తిని ప్రభుత్వం సంపూర్ణంగా నిషేధించింది. యాచకులకు డబ్బులు ఇస్తే.. ఇచ్చే వారిపైనే తిరిగి కేసు పెట్టనుంది. జనవరి ఒకటో తేదీ నుంచి ఈ నూతన వి ధానం అమల్లోకి రానుంది. దేశంలో ఇండోర్ సహా పది నగరాలను యాచకులు లేని ప్రాంతాలుగా తీర్చి దిద్దాలని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ నిర్ణయించింది. ఈ జాబితాలో హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, చెన్నైలు కూడా ఉనాయి. దాన్ని అమలు చేసేందుకు ఇండోర్ జిల్లా యంత్రాంగం సన్నద్ధమయింది. యాచకులకు భిక్షం వేసే వారిపై కేసులు పెడుతామని సోమవారం కలెక్టర్ ఆశీష్ సింగ్ ప్రకటించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కలిగిస్తామని తెలిపారు. యాచకులను పునరావాస కేంద్రాలకు తరలిస్తామని చెప్పారు. ఇండోర్‌లో కొంతమందికి పక్కా ఇళ్లు, పిల్లలకు ఉద్యోగాలు ఉన్నా యాచక వృత్తిని వదలడం లేదు. ఇంకొందరు గ్యాంగులుగా ఏర్పడి చాలా మందిని ఈ వృత్తిలోకి దించుతున్నారు. ఇతర రాష్ట్రాల వారిని తీసుకువచ్చి భిక్షాటన చేయిస్తున్నారు. ఇదొక సంఘ వ్యతిరేక కార్యక్రమంగా మారింది. ఈ నేపథ్యంలో నగరంలో యాచక వృత్తిపై సంపూర్ణంగా నిషేధం అమలు చేస్తామని ప్రాజెక్టు అధికారి దినేష్ మిశ్రా తెలిపారు.

బండరాయితో కొట్టి చంపి.. మృతదేహంపై అత్యాచారం

- ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న యాచకురాలి హత్య
- శారీరక వాంఛ తీర్చలేదనే.. జీడిమెట్లలో ఘోరం

జీడిమెట్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం, గంజాయికి బానిసై.. దొంగతనాలు చేస్తూ జులాయిగా తిరుగుతున్న ఆ వ్యక్తి అత్యంత హేయమైన చర్యకు ఒడిగట్టాడు. శారీరక వాంఛ తీర్చ లేదన్న కోపంతో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న యాచకురాలిని బండ రాయితో కొట్టి చంపాడు. తర్వాత మృతదేహంపై అత్యాచారం చేశాడు. జీడిమెట్ల పరిధిలో ఈ ఘోరం జరిగింది. కొన్ని నెల లుగా కుత్బుల్లాపూర్ చౌరస్తా, హెచ్‌ఎంటీ గేటు ముందు ఓ మహిళ (45) భిక్షాటన చేస్తూ అక్కడే ఫుట్‌పాత్‌పైనే ఉంటోంది. కర్ణాటకలోని గాజుల కోటికా గ్రామానికి చెందిన నరేశ్ (31) కుత్బుల్లాపూర్, చింతల్ ప్రాంతంలో కూలీ పనులు చేస్తూ.. రాత్రుళ్లు ఫుట్‌పాత్‌పైనే ఉంటున్నాడు. పూటుగా మందుకొట్ట డమే కాకుండా గంజాయి, వైట్‌నర్ మత్తుకూ అలవాటు పడ్డాడు. జల్సాల కోసం అప్పుడప్పుడూ దొంగతనాలు చేస్తు న్నాడు. ఈ క్రమంలో ఫుట్‌పాత్‌పై ఉంటున్న యాచకురాలిపై నరేశ్ కన్ను పడింది. తన కామవాంఛ తీర్చాలని కోరితే, ఆమె అంగీకరించలేదు. ఈనెల 10వ రాత్రి 10గంటలకు ఓ వ్యక్తి హెచ్‌ఎంటీ గేటు ముందున్న యాచకురాలి వద్దకొచ్చి, ఆమెను బైక్‌పై ఎక్కించుకొని వెళ్లి.. అరగంట తర్వాత మళ్లీ అక్కడే విడిచి పెట్టి వెళ్లాడు. వ్యక్తితో ఆమె వెళ్లడం, రావడం చూసిన నరేశ్ రాత్రి 11గంటలకు ఆమె వద్దకొచ్చి శారీరక వాంఛ తీర్చాలని మరోసారి అడిగాడు. ఆమె నిరాకరించడంతో ఫుట్‌పాత్‌పై యాచకురాలు దుప్పటికప్పుకొని నిద్రపోతుండగా అర్ధరాత్రి ఒంటిగంటకు వచ్చి ఓ పెద్ద బండరాయిని ఆమె మీద వేశాడు. తీవ్ర గాయాలతో ఆమె ప్రాణాలు విడిచింది. అనంతరం మృతదే హంపై అత్యాచారం చేసి పారిపోయాడు. సీసీ ఫుటేజీ ఆధా రంగా నిందితుడు నరేశ్‌ను పోలీసులు గుర్తించారు. సోమవారం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడిపై గతం లోనే జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

జనరేటర్ పొగ కారణంగా 12 మంది భారతీయుల మృతి

- జార్జియాలో దారుణం

టిబ్లిసి, డిసెంబరు 16: జనరేటర్ పొగ కారణంగా జార్జియా దేశంలో 12 మంది భారతీయులు మరణించారు. ఈ విషయాన్ని ఇక్కడి భారతీయ రాయబార కార్యాలయం ప్రకటించింది. వీరంతా గుడౌరీ పర్వతంపై ఉన్న భారతీయ రెస్టారెంట్లో పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి కరెంటు పోవడంతో రెండో అంతస్తులోని బెడ్‌రూంల వద్ద ఉన్న ఓ గదిలోని జనరేటర్‌ను ఆన్ చేశారు. దాని నుంచి విడుదలయిన కార్బయిన్ మోనాక్సైడ్ కారణంగా బెడ్‌రూంల్లో ఉన్న వీరంతా ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు భావిస్తున్నారు.

మేయొట్టే దీవుల్లో తుఫాన్: వేలాది మంది మృతి

పారిస్, డిసెంబరు 16: హిందూ మహా సముద్రంలో ఫ్రాన్స్ ఆధీనంలో ఉన్న మేయొట్టే ద్వీప సముదాయాన్ని తాకిన 'ఛిడో' తుఫాన్ కారణంగా అపార ప్రాణ నష్టం సంభవించింది. ప్రస్తుతం వందల మంది మరణించినట్టు సమాచారం అందినా, కచ్చితంగా ఆ సంఖ్య వేలకు చేరుకుంటుందని ఆదివారం అధికార వర్గాలు తెలిపాయి. గంటలకు 200 కి.మీ.వేగంతో గాలులు వీయడంతో భవనాలకు భారీ నష్టం సంభవించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శుష్క వాదోపవాదాలు!

రాజ్యాంగానికి డెబ్బయ్‌ఐదేళ్ళయిన సందర్భంలో లోక్‌సభలో జరిగిన చర్చ ఆశించినస్థాయిలో లేకపోయింది. ఎప్పటిలాగానే ఈ దేశపౌరులకు చట్టసభలో ఏదో రచ్చసాగుతోందని అనిపించింది తప్ప, తాము ఎన్నుకున్న ప్రతినిధులు దేశభవిష్యత్తుకు అత్యవశ్యకమైన అంశం మీద మాట్లాడుతున్నారని వారికి అనిపించలేదు. అధికారపక్షం, విపక్షం ఏకమాటగా అత్యంతకీలకమైన ఈ ఘట్టాన్ని ఆరంభించి నందున లోతైనచర్చతో, విలువైన వ్యాఖ్యలతో, చూడచక్కని దృశ్యాలతో ఇది సాగాలని మేధావులంతా కోరుకున్నారు. రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా పయనం సాగుతున్నదీ లేనిదీ తేల్చుకోవాలన్నా, భవిష్యత్తులో అడుగులు ఎలా పడాలో నిర్ణయించుకోవాలన్నా ఉభయపక్షాల మధ్యా సయోధ్య, సుహృద్భావం ఉండాలి. ఇంతటి ఉన్నతమైన సందర్భంలో కూడా అవే ఊకదంపుడు వ్యాఖ్యలు, నాటు విమర్శలు, మోటు మాటలు వినవలసి రావడం దురదృష్టకరం. తాము ఉన్న స్థితికీ, అనుభవిస్తున్న హోదాలూ అధికారాలకూ ఆ మహాగ్రంథమే కారణమనీ, కనీసం ఈ సందర్భంలోనైనా దానిపట్ల గౌరవంతో ఆచితూచి మాట్లాడాలనీ, ఉన్నతంగా నడవాలనీ మన నాయకులకు అనిపించలేదు.

సమీక్ష, ఆత్మవిమర్శ అవసరమైన ఈ సందర్భంలో అది సంఘటితంగా జరిగినప్పుడే ప్రయోజనకరంగా ఉంటుంది. ఆశయాలు అద్భుతంగా ఉన్నా, ఆచరణలో లోపాలు ఉంటాయి కనుక, రాజ్యాంగం అమలులో ఎదురవుతున్న సవాళ్ళను, విస్మరణలను కోపతాపాలు లేకుండా చర్చించుకోవడం అవసరం. అధికార, ప్రతిపక్షాలు ఈ సందర్భాన్ని కూడా ఎదుటిపక్షాన్ని తప్పుబట్టడానికీ, అవమానించడానికి వాడుకోవడం ద్వారా పైచేయి సాధించాలని తెగ తాపత్రయపడ్డాయి. ఒక విధంగా, ఈ పరస్పర దూషణలో ప్రజలకు ఈ పార్టీలేవీ తమ పక్షాన లేవని మరోమారు అర్థమైంది. ఇందిర కాలంలో విధించిన అత్యయిక స్థితిని కాంగ్రెస్ మీద బ్రహ్మాస్త్రంలాగా అధికారపక్షం ప్రయోగించడం కొత్తేమీ కాదు. అది అధికారికంగా జరిగితే, ఇప్పుడు అనధికారికంగా అంతకంటే భయానకమైన అప్రకటిత ఎమర్జెన్సీ దేశంలో అమలవుతోందని విపక్షం ఆరోపించడమూ పదేళ్లుగా చూస్తున్నదే. ఎమర్జెన్సీని ప్రకటించి ఇందిరా గాంధీ రాజ్యాంగాన్ని చీలికలు పీలికలు చేశారంటూ నరేంద్రమోదీ తన అద్భుతమైన వాగ్ధాటితో అప్పటి పరిస్థితులను అభివర్ణించారు. జైళ్ళు, మీడియా, ప్రజలు, స్వేచ్ఛ, ఉక్కుపాదాలు, అణచివేత వంటి మాటలు దట్టించిన ఈ దాడిలో అతి ఉండవచ్చునేమో కానీ, అసత్యమేమీలేదు. అయితే, దానిని ఆయన ఒక ప్రస్తావనగా కాక ఓ ఘాటైన రాజకీయ విమర్శగానే చేశారు. సుదీర్ఘకాలం దేశాన్ని ఏలిన కాంగ్రెస్ హయాంలో అనేక రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థలు, వ్యవస్థలు ఏర్పడి, ఈ దేశంలో ప్రజాస్వామ్యం వేళ్ళూనుకున్న విషయాన్ని కూడా ఆయన ఓ మాటగా ప్రస్తావించివుంటే బాగుండేది. వేరుపడిన పాకిస్థాన్ ప్రబల నిదర్శనంగా పొరుగునే ఉన్నది కనుక, మనం కోల్పోని రాజ్యాంగ ఆశయాలను, కాపాడుకున్న విలువలనూ కొన్నింటిని స్మరించి, వాటి పునాదిగా ఎదిగిన క్రమాన్ని ఈ సందర్భంలో ప్రస్తావించి ఉంటే సరిపోయేది. తన హయాంలోనే దేశం ఎదిగిందనీ, వెలుగులు చూసిందనీ, దశాబ్దాల కాంగ్రెస్ ఏలుబడిలో అంతా చీకటేనని ఆరోపిస్తున్నందున ఈ సందర్భంలో కూడా ఆయన నోట ఓ మంచిమాట రాకపోయింది. అప్పటి తప్పిదాన్ని ఒప్పుకోవడానికీ, అత్యయిక స్థితిని ఓ మాటగా ఖండించడానికి కాంగ్రెస్ పార్టీకి కూడా ఇంతకుమించిన తరుణం లేదు. కానీ, ఎప్పటిలాగానే, సంస్థలు, వ్యవస్థల విచ్ఛిన్నంమీద అది ఆరోపణలు ఎక్కుపెట్టింది. రాజ్యాంగం మీద చేయాల్సిన చర్చను నెహ్రూ కుటుంబం చుట్టూ తిప్పడానికి అధికారపక్షానికి ఎందుకంత ఉత్సాహమో అర్థంకాదు. ఉభయపక్షాలు ప్రస్తావించిన విషయాలేమీ ఇప్పుడు కొత్తగా విన్నవేమీ కాదు కనుకనే, చాలామందికి ఇది రాజ్యాంగంపై చర్చలాగా కాక, అవిశ్వాస తీర్మానం రచ్చలాగా అనిపించింది.

ప్రజాస్వామ్యం, లౌకికవాదం, న్యాయవ్యవస్థ సహా పలు స్వతంత్ర వ్యవస్థల మనుగడ, పౌరహక్కులు, అణచివేతలు, అక్రమ నిర్బంధాలు ఇత్యాది అంశాలపై తమ నిబద్ధతను పునరుద్ఘాటించి, ఈ దేశ ప్రజలకు ఓ మాట ఇచ్చేందుకు మన నాయకులెవ్వరూ సిద్ధంగా లేరన్న విషయం మరోమారు స్పష్టమైంది. రాజ్యాంగం పట్ల గౌరవం ఉన్నా, ఆ వెలుగు బాటలో నడవాలన్న సదాశయం ఉన్నా ఈ చర్చ మరింత ఉన్నతంగా జరిగేది. రాజ్యాంగ ఆశయాలకు పూర్తిభిన్నంగా వ్యవహరిస్తూ, సకల అరిష్టాలకు మీరే కారకులని పరస్పరం విమర్శించుకుంటూ, త్వంశుంఠ నాటకాన్ని ఎంతకాలమైనా కొనసాగించగల తెలివితేటలు మన నాయకులకు కావల్సినన్ని ఉన్నాయి.

ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటైన ఏకసభ్య కమిషన్‌కు రాష్ట్రంలోని మాల మేధావుల తరఫున ఇటీవల ఇచ్చిన నోట్ సంక్షిప్త పాఠం ఇది.

ఎస్సీ రిజర్వేషన్లను శాస్త్రీయబద్ధంగా వర్గీకరించాలి

తెలంగాణ రాష్ట్రంలోని మాల మేధావులుగా ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ అంశానికి సంబంధించి మా అభిప్రాయాలను కొన్ని ముఖ్యమైన ప్రతిపాదనల రూపంలో పెడుతున్నాం.

1. ఆగస్టు 1, 2024న సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణపై తీర్పు ఇచ్చింది. ఇది భారత రాజ్యాంగ మౌలిక స్వరూపానికి పూర్తిగా భిన్నమైనదే కాక వ్యతిరేకమైనది కూడా. ఎందుకంటే ఎస్సీ రిజర్వేషన్లకు దేశవ్యాప్త చట్టబద్ధత కల్పించే అధికరణ–341 స్ఫూర్తికి పూర్తి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఉప వర్గీకరణ చేసుకోవచ్చని అభిప్రాయపడింది. కానీ షెడ్యూల్ కులాలకు సంబంధించిన మార్పులు పార్లమెంటు వేదికగానే జరగాలని ప్రతిపాదించిన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్, మాజీ పార్లమెంటు సభ్యులు మునుస్వామి పిళ్లై సూచనలకు పూర్తిగా విరుద్ధమైనది.

2. అయినప్పటికీ ఎస్సీ కులాలకు సంబంధించిన రిజర్వేషన్లను ఈక్విటీ తాత్విక పునాదిగా ఉప వర్గీకరణ చేసి ఎస్సీ కులాలలోని అర్హులైన సమూహాలకు సామాజిక న్యాయం చేకూర్చాలనే వాదనను సమర్థిస్తున్నాం.



3. అయితే ఎస్సీ రిజర్వేషన్లు ఉప వర్గీకరణను చేసేటప్పుడు ప్రభుత్వం ఈ క్రింది సూచనల ఆధారంగా చేస్తే ఆ వర్గీకరణలో సహజ న్యాయం, ప్రజాస్వామిక స్ఫూర్తి బలంగా ఉండటానికి ఆస్కారం ఉంటుంది.

i) తెలంగాణలో అందుబాటులో ఉన్న ఎస్సీ కులాల జనాభాను నిష్పాక్షికంగా, నిర్దిష్టంగా లెక్క కట్టాలి. ప్రభుత్వాలు కల్పించిన విద్య, ఉద్యోగ, స్థిర చరాస్తులు వంటివి కలిగి ఉండటంలో, ప్రభుత్వాలు ఇప్పటికే వారికి కల్పించిన వివిధ సంక్షేమ పథకాలను అనుభవించటం లేదా లబ్ధి పొందటంలో ఏయే కులాలు ఏ స్థాయిలలో ఉన్నారో లెక్కలు తీయాలి. వాటి ఆధారంగా ఎస్సీ కులాల ఆర్థిక అభివృద్ధి, సామాజిక పురోగతి, వెనుకబాటుతనాన్ని అంచనా వెయ్యాలి.

ii) గడచిన 75 సంవత్సరాలలో దేశంలో రాజ్యాంగ ఫలాలను పొందటంలో మొత్తం ఎస్సీ కులాలలో ఏయే కులాలు ముందు వరుసలో ఉన్నాయో, అలాగే ఏవి వెనకబడి ఉన్నాయో ఒక శాస్త్రీయ పద్ధతిలో గుర్తించాలి.

iii) ప్రభుత్వాల సంక్షేమ పథకాల లబ్ధిలో, నిర్దిష్ట అవకాశాలైన విద్య ఉద్యోగాలు వంటి వాటిలో ఉన్న వ్యత్యాసాల ఆధారంగా రాష్ట్రంలో అందుబాటులో ఉన్న మొత్తం ఎస్సీ కులాలను ఉప– సమూహాలుగా చేయాలి. అంటే ఒకవేళ ఎస్సీ కులాలలో ఇప్పటికే కొద్ది పాటి తేడాలతో రిజర్వేషన్ల ప్రతిఫలాలను పొందిన లేదా పొందుతున్న మాల, మాదిగ, ఆ రెండింటికి అనుబంధంగా ఉండి రిజర్వేషన్ల ఫలాలను పొందిన ప్రధాన కులాలను అన్నింటినీ కలిపి ఒక సమూహంగా లేదా గ్రూపుగా చేయవచ్చు. ఇప్పటికీ విద్య ఉద్యోగాలలో, ఇతరత్రా సంక్షేమ ప్రతిఫలాలను వారి వారి జనాభా దామాషా ప్రకారం పొందలేకపోయిన అన్ని ఇతర కులాలను ఒక ప్రత్యేక సమూహం లేదా గ్రూపుగా ఏర్పాటు చేయవచ్చు. (లేదా)

iv) ఇప్పటి వరకు రిజర్వేషన్ ఫలాలను అనుభవించని, బడి మెట్లు ఎక్కని కులాలను A గ్రూపులో పెట్టి, మాల, మాల పూజారి కులాలైన మాల దాసరి, పంబాల లాంటి వారిని, మాదిగ బైండ్ల, మాదిగ దాసరి లాంటి కులాలను B గ్రూప్‌లో చేర్చాలి. (లేదా)

v) రూపొందించిన ప్రతి గ్రూపులోను దానికి కేటాయించబడిన రిజర్వేషన్లు పొందటంలో ఇప్పటికే వెనుకబడిన శ్రేణులకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చే శాస్త్రీయ క్రమానుగత శ్రేణి సూత్రానికి చట్టబద్ధతను కల్పించాలి. అప్పుడు మాత్రమే అవకాశం పొందటంలో అందరికీ న్యాయం జరుగుతుంది.

vi) ఇప్పటికే షెడ్యూల్ కులాలలో విద్య, ఉద్యోగ, రాజకీయంగా, ఆర్థికంగా ఏదో ఒక మేరకు అభివృద్ధి చెందిన ఒక తరగతి ముందుకు వచ్చింది. ఇటువంటప్పుడు తిరిగి కులాల వారీగా రిజర్వేషన్లు కల్పిస్తే అభివృద్ధి చెందినవారే తిరిగి రిజర్వేషన్లలో ఎక్కువ భాగం పొందుతారు. అందువల్ల ఎవరికైతే రిజర్వేషన్లు ఎక్కువ స్థాయిలో చేరాలో వారికి అందవు. కాబట్టి అన్ని కులాలలో అభివృద్ధి ఆధారంగా పై తరగతి, మధ్యతరగతి, కింది తరగతులుగా వర్గీకరించటం వల్ల రిజర్వేషన్లు ఎక్కువ భాగం కింది తరగతికి, ఆ తర్వాత భాగం మధ్య తరగతికి కొద్ది భాగం పై తరగతికి కల్పించబడతాయి. ఇందువల్ల షెడ్యూల్ కులాల మధ్య ఐక్యత పెరిగి రాజ్యాంగం ఆశించిన కుల నిర్మూలన జరుగుతుంది.

చివరగా సామాజిక న్యాయ సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న మేము, అధికరణ 341 విషయాలు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భిన్నమైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించబోయే ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ చట్టంలో అత్యంత వెనుకబడిన అంటరాని కులాలకు ఏ మాత్రం అన్యాయం జరగకూడదని కోరుతున్నాం.

– ప్రొఫెసర్లు లింబాద్రి, ఘంటా చక్రపాణి, ఎస్. మల్లేష్, చెన్నప్ప, కె. లక్ష్మీనారాయణ, నాగం కుమారస్వామి, సవీన్, కె.వై. రత్నం, డబ్ల్యు. మాయదేవి, పి. లక్ష్మీనారాయణ, బి. వెంకయ్య, వరలక్ష్మి, పద్మావతి, ఎస్. శ్రీనివాస్, పుష్ప చక్రపాణి, నాగేష్, మమత, ఎల్లయ్య, ఎర్రగట్టు స్వామి; మల్లేపల్లి లక్ష్మయ్య, డాక్టర్ ఎం.ఎఫ్ గోపీనాథ్, గోరటి వెంకన్న, డాక్టర్ పట్టా వెంకటేశ్వర్లు, మామిడి నారాయణ, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ ఎస్. నవీన్, డాక్టర్ జి. చంద్రశేఖర్, డాక్టర్ బ్రిజేష్, డాక్టర్ హుస్సేన్, డాక్టర్ ఎన్. కిషోర్, డాక్టర్ దండు స్వామి.

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

విధానాలలో మరింత సాహసం కావాలి!

ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు బడ్జెట్ పరిమితులను దృష్టిలో ఉంచుకోకుండా గెలుపే లక్ష్యంగా అంతులేని హామీలు ఇవ్వడం, ప్రజలు వాటిని విశ్వసించి ఓట్లేస్తే, గెలిచి అధికారం చేపట్టాక వాటిని అరకొరగా అమలు చేయడం, కొన్ని హామీలనైతే అసలే పట్టించుకోకపోవడం గత నాలుగు దశాబ్దాలుగా ఆనవాయితీ కొనసాగుతున్నది.



గత నిరంకుశ పాలకులపై, వారి విధానాలపై, ఎన్నికల హామీల ఉల్లంఘనపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఎన్నో విమర్శలు చేశారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ భాషలో మాట్లాడితే, రేవంత్ కూడా అదే భాషలో సమాధానం చెప్పేవారు. తొమ్మిది న్నరేళ్ల కేసీఆర్ పాలనపై విముఖతతో ఉన్న సాధారణ ప్రజలు నాటి రేవంత్ దూకుడును, ఆయన భాషను హర్షించి ఉండవచ్చు. కానీ అధికారం చేపట్టాక కూడా రేవంత్ భాషలో పెద్దగా మార్పు లేదు. అదే దూకుడును కొనసాగిస్తున్నారు. ఇచ్చిన హామీల అమలులో గత ప్రభుత్వానికి భిన్నంగా వ్యవహరిస్తేనే ప్రజలు ఇలాంటి దూకుడును హర్షిస్తారు. లేదంటే విముఖత ప్రదర్శిస్తారు. "మూసీ పునరుజ్జీవనం లాంటి అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డొస్తే, ఎవరినైనా బుల్డోజర్‌లతో తొక్కేస్తాం" అని ఇటీవల ముఖ్యమంత్రి హెచ్చరించారు. నిజానికి ఈ బుల్డోజర్ భాష బీజేపీ నాయకులది. బుల్డోజర్ ఆచరణ కూడా బీజేపీ ప్రభుత్వాలదే. ఈ భాషను, చర్యలను ఇటీవల సుప్రీంకోర్టు తప్పుపట్టింది కూడా. రేవంత్ అదే భాషనూ, చర్యలనూ అరువు తెచ్చుకోవడం అంటే, బీజేపీ నిరంకుశ భావజాలాన్ని అరువు తెచ్చుకోవడమే. తెలంగాణలో ప్రజలు సంతోషంగా, సుభిక్షంగా ఉండాలనే రాజకీయ చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకీ, ముఖ్యమంత్రికీ ఉంటే ఈ బుల్డోజర్ భావజాలానికి గురి కాకుండా కొన్ని రంగాలలో రొటీన్‌కు భిన్నంగా స్పష్టమైన విధానాలను రూపొందించాలి. వాటిని ధైర్యంగా ప్రకటించి అమలు చేసే సాహసాన్ని ప్రదర్శించాలి.

ముఖ్యంగా ప్రజాస్వామిక పాలనా స్ఫూర్తికి భిన్నమైన పోకడలను ప్రభుత్వం సవరించుకోవాలి. దామగుండం, మూసీ, లగచర్ల, దిలావర్‌పూర్ లాంటి ఘటనలు ముందుకు వచ్చినప్పుడు ప్రభుత్వం వెంటనే ఆయా ప్రజల ఆందోళనలపై "రాజకీయ ప్రేరేపితం" అన్న ముద్ర వేయటం, పోలీసు బలగాలతో ఆ అసంతృప్తిని అణచివేయాలని చూడటం తగని పని. ప్రజలతో, ప్రజా సంఘాలతో, పౌర సమాజ ప్రతినిధులతో చర్చల ద్వారా, ప్రజల సమస్యల పరిష్కారానికి పూనుకోవాలి. ఆ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్ళడానికి ఒక శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. తక్షణం ముందుకు వచ్చిన సమస్యను ఏదో ఒక హామీ ఇచ్చి మభ్యపెట్టి, కాలం దాటేయాలని చూడకుండా, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించడానికి చర్చలు కొనసాగించాలి. దిలావర్‌పూర్‌లో ప్రజల డిమాండ్ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని ఆపేసింది. కానీ మహిళలతో సహా, అక్కడ పోరాడిన ప్రజలపై అక్రమ కేసులు పెడుతున్నది. ఈ ధోరణి అక్కడి ప్రజలకు సరైన సూచనలు ఇవ్వదు.

> రేవంత్ రెడ్డి పాలన రెండవ సంవత్సరంలో ప్రవేశించింది. గతంలో హామీ ఇచ్చి అమలు చేయని అంశం ఒకటి ప్రజలకు ఇంకా జ్ఞాపకం ఉంది– అదే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత. ఈ అసెంబ్లీ సమావేశాలలో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించి, వాటిని అమలు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి, బడ్జెట్ కేటాయింపులు చేసి అమలు చేయాలి. అలాగే వివిధ వర్గాల శ్రేయస్సు దిశగా విస్పష్ట విధాన ప్రకటనలు చేయాల్సిన అంశాలు మరెన్నో ఉన్నాయి.

ప్రజా భవన్‌లో వారానికి రెండుసార్లు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రజావాణిని మరింత బలోపేతం చేయాలి. గ్రామ, మండల, జిల్లా స్థాయి నుండీ ప్రజలు తమ నిత్య జీవిత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చినప్పుడు వాటిని స్థానికంగానే వేగంగా పరిష్కరించే ప్రయత్నం చేయాలి. ఇందుకుగాను ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా పౌర సేవల చట్టాన్ని ఆమోదించి అమలు చేయాలి. ప్రజల ఫిర్యాదులకు రాష్ట్ర స్థాయిలో టోల్ ఫ్రీ నంబర్‌ను వెంటనే ప్రారంభించాలి.

రేవంత్‌రెడ్డి పాలన రెండవ సంవత్సరంలో ప్రవేశించింది. గతంలో హామీ ఇచ్చి అమలు చేయని అంశం ఒకటి ప్రజలకు ఇంకా జ్ఞాపకం ఉంది– అదే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత. ఈ డిసెంబర్ 9 నుంచి మొదలైన అసెంబ్లీ సమావేశాలలో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించి, వాటిని అమలు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి బడ్జెట్ కేటాయింపులు చేసి అమలు చేయాలి. అలాగే వివిధ వర్గాల శ్రేయస్సు దిశగా విస్పష్ట విధాన ప్రకటనలు చేయాల్సిన అంశాలు మరెన్నో ఉన్నాయి.

ఎన్నికల మేనిఫెస్టోలో పేద మధ్యతరగతి ప్రజలకు, రైతులకు, కార్మికులకు, ముఖ్యంగా అసంఘటిత కార్మికులకు, దళితులకు, ఆదివాసీలకు, వెనుకబడిన వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి బడ్జెట్ కేటాయింపులు చేసి అమలు చేయాలి. అందుకు అవసరమైన విధాన ప్రకటనలను ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశాలలో చేయాలి. ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలోనే, ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్, ముస్లిం డిక్లరేషన్‌ల అమలు ప్రారంభిస్తామని స్పష్టంగా ప్రకటించాలి.

వ్యవసాయ రంగంలో సమగ్ర వ్యవసాయ విధానం, శాస్త్రీయ పంటల ప్రణాళిక, సేంద్రియ వ్యవసాయ విధానం రూపకల్పనకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, 2025 ఖరీఫ్ నుండీ వాటిని అమలులోకి తీసుకువస్తామని ప్రభుత్వం ప్రకటించాలి. వానాకాలం, యాసంగి సీజన్‌లలో కేవలం వరిని ప్రోత్సహించడం కాకుండా, పప్పు ధాన్యాలను, నూనె గింజలను, చిరు ధాన్యాలను, కూరగాయలను ప్రోత్సహిస్తామని, స్పష్టంగా అసెంబ్లీలో ప్రకటించాలి. ఎగుమతి ఆధారిత, సాగు నీరు ఎక్కువ అవసరమయ్యే పంటలను కాకుండా, రాష్ట్రానికి అవసరమయ్యే అన్ని పంటలను ప్రోత్సహిస్తామని కూడా ప్రభుత్వం ప్రకటన చేయాలి. బడ్జెట్‌లో విలువైన నిధులను, రాష్ట్రంలో ఖరీదైన నీళ్ళను ఉపయోగించి వరి లాంటి పంటలను పండించి, వాటిని ఎగుమతి చేయడం అర్థం లేని పనిగా ప్రభుత్వం గుర్తించాలి.

ఒక సర్వే నంబర్‌లో ఎవరు సాగు చేస్తే వారికి మాత్రమే – అంటే నిజమైన సాగుదారులకు మాత్రమే ప్రభుత్వ పథకాల సాయం అందుతుందని, 2011 చట్టాన్ని అమలు చేసి, కౌలు రైతులను గుర్తిస్తామని, వారి వ్యవసాయానికి కూడా సహకారం అందిస్తామని స్పష్టంగా ఈ అసెంబ్లీ సమావేశాలలో విధాన ప్రకటన చేయాలి. ఇందుకోసం భూమి యజమానులు సహా, అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించడానికి ప్రభుత్వమే పూనుకుంటుందని కూడా ప్రకటించాలి.

రాష్ట్రంలో పారిశ్రామికీకరణ అవసరమే కానీ, గత ప్రభుత్వం రాష్ట్రంలో కాలుష్యకారక ఫార్మా, ఇథనాల్, ఇతర పరిశ్రమలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తామని రవంత్ ప్రభుత్వం అసెంబ్లీలో స్పష్టంగా ప్రకటించాలి. కేంద్రం అనుమతులు ఇచ్చినా సరే రాష్ట్ర ప్రభుత్వానికి ఉండే అధికారాలను ఉపయోగించుకుని, తాము రాష్ట్రాన్ని, రాష్ట్ర పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రాధాన్యత ఇస్తామని కూడా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి స్పష్టం చేయాలి.

దళితుల, వెనుకబడిన వర్గాల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను, రైతుల చేతుల్లో ఉన్న ఇతర భూములను అభివృద్ధి పేరుతో, పరిశ్రమల పేరుతో, భూసేకరణ, ల్యాండ్ పూలింగ్ పేరుతో లాక్కోబోమని కూడా ఈ అసెంబ్లీ సమావేశాలలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి. పరిశ్రమల ఏర్పాటు కోసం, ఇతర అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూమి అవసరమైనప్పుడు, భూమి సేకరణ పేరుతో రైతుల నుంచి తక్కువ పరిహారం చెల్లించి భూమి గుంజుకోవడం ఆపాలి. ఆయా పారిశ్రామికవేత్తలను, పరిశ్రమకు అవసరమైన భూములను, రైతుల నుండీ మార్కెట్ ధరకు నేరుగా కొనుక్కోమని ప్రోత్సహించాలి. లేదా పరిశ్రమల ఏర్పాటుకు భూమి అవసరమైన మేరకు రైతులను ఒప్పించి భూమిని లీజుకు తీసుకోమని ఆయా పరిశ్రమల యాజమానులను ప్రోత్సహించాలి. ఆ భూమిలో ఏర్పడే కంపెనీలలో, సంస్థలలో రైతులకు భూమి విలువకు అనుగుణంగా తగిన వాటాలు ఇచ్చేలా యాజమానులను ఒప్పించాలి. అందుకు అనుగుణంగా రాష్ట్ర పారిశ్రామిక విధానంలో మార్పులు చేయాలి. ఆ భూమిలో అనుకున్న సమయానికి కంపెనీ ఏర్పాటు కాకపోయినా, ఏర్పడిన కంపెనీ ఏ కారణం చేతనైనా మూతపడినా ఆ భూమి యాజమానులైన రైతులకే తిరిగి చెందుతుంది. కర్ణాటక రైతు సంఘాలు ఇలాంటి వినూత్న ఆలోచనను రైతుల పక్షాన డిమాండ్‌గా ముందుకు తెచ్చాయి. ఇది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆలోచించాల్సిన అంశం.

రాష్ట్రంలో ఏర్పడే ప్రతి పరిశ్రమ, సేవా రంగ సంస్థలు కూడా తప్పకుండా 80 శాతం ఉద్యోగాలు స్థానిక తెలంగాణ యువతకు మాత్రమే ఇచ్చేలా టీఎస్–ఐపాస్ చట్టంలో సవరణ చేస్తామని ఈ అసెంబ్లీ సమావేశాలలో ప్రకటించాలి. రాష్ట్రంలో ప్రతి సంస్థా కార్మికులకు సంక్షేమం, భద్రత అందించేలా కార్మిక చట్టాలను అమలు చేయాల్సి ఉంటుందని, ఆయా కంపెనీలతో ఒప్పందాలు చేసుకునేటప్పుడు, లేదా అనుమతులు ఇచ్చేటప్పుడు స్పష్టమైన షరతులు పెట్టాలి.

రేవంత్ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ఈ ప్రకటనలు చేయగలిగితే, రెండవ పాలనా సంవత్సరంలో వీటిని అమలుచేయడానికి ప్రాధాన్యత ఇస్తే ప్రజలు హర్షిస్తారు. మా అభివృద్ధి నమూనా మాదే అని మొదటి సంవత్సరం లాగే రేవంత్ ప్రభుత్వం ముందుకు వెళితే ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది.

● కన్నెగంటి రవి
తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ

నకారా ఆశయాలను కొనసాగిద్దాం

నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లందరు సకాలంలో పెన్షన్ పొందుతూ ప్రశాంత జీవనం గడపడం వెనుక ధరమ్ స్వరూప్ నకారా (డి.యస్ నకారా) చేసిన కృషి, సాగించిన పోరాటం చిరస్మరణీయం. మన దేశంలో పెన్షన్ పొందుతున్న పెన్షనర్లకు ఆయన చిరస్మరణీయుడు.

డి.యస్ నకారా 1914 ఏప్రిల్ 8న ముంబైలో జన్మించి, అలహాబాద్ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ లిటరేచర్‌లో బంగారు పతకం అందుకున్నారు. ఉర్దూ సాహిత్యంలో ఆయన చేసిన సేవలకు మాజీ రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ లాంటి ఉద్దండుల ప్రశంసలు పొందారు. సంగీత, సాహిత్య, చిత్రకళా సంస్థలలో కౌన్సిల్ సభ్యులుగా వ్యవహరించారు. ఎన్నో సంస్థలకు ఆర్థిక సలహాదారుగా, కేంద్ర ప్రభుత్వంలో, ప్రభుత్వ రంగ సంస్థలలో వివిధ పదవులు సమర్థవంతంగా నిర్వహించారు. 1972లో ఆర్థిక మంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శిగా, రక్షణ శాఖకు ఆర్థిక సలహాదారుగా సేవలందిస్తూ పదవీ విరమణ చేశారు.



పెన్షన్‌దారుల కోసం నకారా చేసిన న్యాయపోరాటం ఆయనకు విశేషమైన గుర్తింపు తెచ్చింది. పదవీ విరమణ తరువాత భారత సేవా సమాజం న్యూఢిల్లీ పెన్షనర్స్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పెన్షన్ చెల్లింపులలో ప్రభుత్వాల వివక్షతను గమనించారు. 1977 సంవత్సరానికి ముందు పదవీ విరమణ చేసిన వారికి చాలా తక్కువగా వచ్చే పెన్షన్లలో వివిధ కారణాల పేరుతో కోతలు విధించేవారు. ఆనాడు అత్యధికంగా రూ.675 మాత్రమే పెన్షన్ ఉండేది. ఆ పెన్షన్‌తో కుటుంబ జీవనం గడపడం కష్టతరమయ్యేది. కేంద్ర ప్రభుత్వ సరళీకృత పింఛన్ విధానం ద్వారా లభించే ఆర్థిక, ఇతర సౌలభ్యాలు 1979 మార్చి 31 నాటికి సర్వీసులో వున్నవారికి వర్తిస్తాయని, అంతకు పూర్వం పదవీ విరమణ చేసినవారికి వర్తించవని 1979 మే 25న కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇవి పెన్షన్‌దారులను కుంగదీసాయి. అరకొర పెన్షన్‌తో జీవించడం కన్నా మరణమే మేలు అనే మానసిక భావనకు పెన్షన్‌దారులు గురయ్యారు. స్వయంగా బాధితుడైన నకారా, మరికొంతమంది పెన్షన్ బాధితులతో కలసి సుప్రీంకోర్టులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద కేసు దాఖలు చేశారు.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై.వి చంద్రచూడ్‌తో పాటు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, వాటి పూర్వాపరాలను పరిశీలించి 1982 డిసెంబర్ 17న చారిత్రాత్మకమైన తీర్పును వెలువరించినది. అందులో– పింఛను అనేది యజమాని ఇష్టాయిష్టాలతో, దయతో ఇచ్చే దానం కాదు. అది పింఛనుదారుని హక్కు; గతంలో ఉద్యోగిగా అతడు చేసిన సేవలను గుర్తించి చెల్లించేదే పింఛన్; ఉద్యోగి పదవీ విరమణ అనంతరం వృద్ధాప్య జీవితం సుఖసంతోషాలతో, గౌరవంతో సమాజంలో జీవించేందుకు చెల్లించేదిగా పింఛన్‌ను పరిగణించాలి; పింఛన్‌దారుడు స్వశక్తిపై ఆధారపడి జీవించడానికి కల్పించబడిన ఆర్థిక, న్యాయ పరంగా ప్రభుత్వం తీసుకోవలసిన చర్య పింఛన్; కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు ఒక తేదీని ఎంచుకొని దానికి ముందు గాని, తరువాత గాని రిటైర్ అయిన వారిని విభజించి చూడటాన్ని భారత రాజ్యాంగ ఆర్టికల్ 14కి విరుద్ధం. నిర్ణీత తేదీకి ముందు రిటైర్ అయిన వారికి కూడా, ఆ తేదీ తరువాత రిటైర్ అయిన వారితో సమానంగా పెన్షన్ సవరణ లాభాలు ఇవ్వాలి; పెన్షనర్స్ అందరినీ ఒక తరగతిగా పరిగణించి ఒకే ఫార్ములాతో పెన్షనరీ ప్రయోజనాలు వర్తింపజేయాలి. పక్షపాత ధోరణితో వ్యవహరించకూడదు అనే ముఖ్యాంశాలున్నాయి.

ఈ తీర్పును దృష్టిలో పెట్టుకొని 2014 ఏప్రిల్ 30న సుప్రీంకోర్టు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీఓ నెం 87 తేదీ 25–5–1998 ప్రకారం ఈ తేదీకి ముందు పదవీ విరమణ చేసిన వారికి ఒక రకంగా, తరువాత రిటైర్ అయిన వారికి ఒక రకంగా పెన్షన్ ఉండరాదని పెన్షనర్లకు అనుకూలంగా తీర్పు చెప్పింది. డి.యస్ నకారా చేసిన కృషి ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్షలాది పెన్షనర్ల జీవితాలకు ముసురుకున్న చీకట్లు తొలగిపోయాయి. భవిష్యత్‌పై విశ్వాసం ఏర్పడింది. నకారా 94 సంవత్సరాల పరిపూర్ణ జీవితం గడిపారు. ఉద్యోగ విరమణ తరువాత తన శేష జీవితాన్ని పెన్షనర్ల సేవలో గడిపారు. 2009 జూలై 29న ఆయన పెన్షనర్స్ పోరాట యోధునిగా తుది శ్వాస విడిచారు.

పెన్షనర్స్ డే (డిసెంబర్ 17) సందర్భంగా ఆ మహనీయుడు పెన్షనర్లకు సాధించి పెట్టిన రాజ్యాంగ బద్ధమైన పెన్షన్ హక్కును కాపాడుకోవడమే మనం ఆయనకు ఇచ్చే ఘన నివాళి.

– వెలిశోజు రామ మనోహర్
రాష్ట్ర ఉపాధ్యక్షులు,
రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం, తెలంగాణ

విగ్రహాల రాజకీయ వలలు!

'తెలంగాణా తల్లి' విగ్రహం మీద, అధికార పార్టీ వారూ– ప్రతిపక్ష పార్టీల వారూ చేస్తున్న ఆర్భాట కార్యక్రమాలు ఇన్నీ అన్నీ కావు. 'తెలంగాణా తల్లికి, మా పార్టీయే ముద్దు బిడ్డ!' అని ఒకరంటే, 'మీ పార్టీ కాదు, మా పార్టీయే!' అని మరొకరూ! ప్రకటనలూ, పాలాభిషేకాలూ, భారీ బహిరంగ సభలూ! 'మా విగ్రహం తెలంగాణా ఆత్మగౌరవానికీ, అస్తిత్వానికీ ప్రతీక' అని ఒక పార్టీ అంటే, 'మీ విగ్రహం తెలంగాణా ఆత్మగౌరవం మీదా, అస్తిత్వం మీదా, దాడి' అని ఇంకో పార్టీ! రెండు పార్టీల వారూ, 'తెలంగాణా తల్లి బిడ్డల'మనే చెప్పుకుంటారు. ఆ బిడ్డల్లో ఒక పార్టీ వారు, 'మా విగ్రహంలో రాజసం ఉట్టిపడుతూ వుంటే, మీ విగ్రహం తెలంగాణా తల్లిని దీనాతి దీనం చేస్తోంది' అని అంటూవుంటే, ఇంకో పార్టీ వారు, 'కాదు, మీ విగ్రహం పరలోక దేవతా విగ్రహం అయితే, మా విగ్రహం బహుజన కన్న తల్లి!' అని అంటున్నారు! ఈ రకంగా, పార్టీలవారి వాద వివాదాలు!

రెండు పార్టీలూ, తెలంగాణా ప్రాంతపు బిడ్డలే! అయినా ఇరు పక్షాల వారికీ, వారి తల్లి రూపురేఖలు వేరు వేరుగా అయిపోయాయి! కారణం, అవి రాజకీయ పార్టీలు! ఎలాంటి రాజకీయాలు? లాభాల్ని దండుకునే, 'శ్రమ దోపిడీ'ని సమర్థించే, పెట్టుబడిదారీ వర్గ రాజకీయాలు!

మరో చిత్రం, ఇటు తెలంగాణాకీ, అటు ఆంధ్రాకీ ఒకే భాష! అది తెలుగు! ఆంధ్రా వాళ్ళు 'మా తెలుగుతల్లికీ మల్లెపూదండా!' అంటారు. అక్కడ ఆంధ్రా వారికి, 'తెలుగు భాషే' తల్లి! ఇటు, తెలంగాణా వారు, 'జయ జయహే తెలంగాణ జననీ' అంటారు! ఇక్కడ, భాష పేరు కాదు, ప్రాంతం పేరు! ఆంధ్రా తల్లికి ఇప్పటికీ ఒక రూపమే. తెలంగాణా తల్లికి ఇప్పుడు రెండు రూపాలు! మొత్తం మీద ఒకే 'తెలుగు తల్లి'కి మూడు రూపాలు!

విగ్రహాల రాజకీయాల్ని చూస్తోంటే, చలం, 'హంకో మొహబ్బత్' అనే కథలో రాసిన మాటలు కొన్ని అస్పష్టంగా గుర్తొచ్చాయి. ఆ పుస్తకం తీసి ఒకసారి చూశాను. "భరత మాత! తెలుగు తల్లి! పాకిస్తాన్ మాత! ఎక్కడుంది భారత మాత! రష్యా పిత! అమెరికా అత్త! చైనా తాత! పెరూ మరదలు! ఏనాటికైనా నవ్వుకోరా జనం, మట్టిని పట్టుకుని గంతులేసిన కాలాన్ని చూసి! ఈ పద్యాలకూ, మాటలకూ ఏం గానీ, ఆ మట్టిని చూసి నీకు తల్లిలా అనిపించిందా?"... "లేవరా ఆంధ్రుడా! పడుకోవే ఆంధ్రీ! అనుకుంటో!" "మరి, తెలుగు జాతి?" "జాతి! జాతి! ఏం, మనుషులైనాక ఏదో ఒక భాష వుండదూ? ఎక్కడో ఓ చోట పుట్టరూ? ఏదో ఓ తిండి తినరూ? ఏదో మాతట!... ఏమిటా లేవరా ఆంధ్రుడా? ఎవరి మీదకిరా లేవడం? లేవమను, పక్కలు విరగ తంతారు. ఎవరి మీదకోయీ?" చలం నించీ కొన్ని మాటలే తీశాను. భాషా సంకుచిత తత్వాన్నీ, ప్రాంతీయ దురభిమానాన్నీ, జాతీయ దురహంకారాన్నీ, గొప్ప వ్యంగ్యంతో వర్ణించాడాయన!

ఇది, విగ్రహాల గురించి కాబట్టి, కొన్ని విషయాలు తెలుసుకోవాలి. ఒక ఫలానా మనిషి ప్రతి రూపాన్ని, ఒక చిత్రంగా గానీ, శిల్పంగా గానీ, విగ్రహంగా గానీ, మలిచే కళ, వేలాది సంవత్సరాల నించీ జరుగుతున్న కళే! ఆ ప్రయత్నంలో, ఆ మనిషి రూపం ఎలా ఏర్పడినా, అది, ఫలానా మనిషి కోసం ఏర్పడేదే! ఆ మనిషి నిజం మనిషి కావచ్చు, మనం చూడని మనిషి కావచ్చు. ఊహల్లోనో, సాహిత్యంలోనో చిత్రించిన ఫలానా మనిషి కావచ్చు! అయితే, 'తెలంగాణా తల్లి'గా తయారైన విగ్రహం, తెలంగాణాలో ఏ తల్లిది? తెలంగాణాలోనే కాదు, ఏ ప్రాంతంలో అయినా, సంపన్న తల్లులూ, నిరుపేద తల్లులూ, వుంటారు. వారిలో కూడా వేరు వేరు స్థాయిలు! ఆ నిజమైన స్థాయిల్లో, ఏ స్థాయి స్త్రీ రూపం 'తెలంగాణా తల్లి రూపం' అవుతుంది?

తల్లుల స్థాయిలు వేరు వేరై వుండగా, వారిలో ఏ తల్లి రూపం తెలంగాణా తల్లిగా అవుతుంది? ఒక విగ్రహాన్ని తయారుచేసి, ఇది 'తెలంగాణా తల్లి' అనడం సాధ్యమేనా? సాధ్యం కాదు. వేరు వేరు స్థాయిల స్త్రీలని, ఒకే స్థాయిలోకి మార్చడం అసత్యం! 'ఫలానా మనిషి' కోసం అయితే తప్ప, ఇతర అవసరాల అర్థంతో, ఏ కళా రూపమూ నడవదు. నడకే లేని చోట, చిత్రాలూ, శిల్పాలూ, విగ్రహాలూ, సత్యాల్ని మాయం చేస్తాయి! ఈ కారణంతో, 'తెలంగాణా తల్లి' అయినా, 'ఆంధ్ర మాత' అయినా, అసత్యం!

> కంటికి కనిపించినా, వాస్తవాల్ని అర్థం చేసుకోలేని, వర్గ చైతన్యం లేని జనాలను, 'జయ జయహే తెలంగాణ జననీ!', 'జై ఆంధ్ర మాతా!', 'బంగారు తెలంగాణా!', 'స్వర్ణాంధ్రప్రదేశ్!' వంటి నినాదాలతో, నిద్రపుచ్చి, వారిని శ్రమ దోపిడీకి అప్పజెప్పడమే కదా అస్తిత్వవాదులు చెయ్యగలిగే ఘనకార్యం! ఇప్పుడు జరగవలిసిందేమిటంటే, అస్తిత్వం పేరుతో, ఆత్మగౌరవం పేరుతో, నడిచే విగ్రహాల రాజకీయాలకి దూరంగా వుండాలి! 'శ్రమ దోపిడీ' వ్యతిరేకమైన చైతన్యాన్నీ, సమానత్వం గురించిన అవగాహననీ నేర్చుకోవాలి!



ఈ 'తెలుగు తల్లి' బిడ్డలు– తెలంగాణా వాళ్ళు గానీ, ఆంధ్రా వాళ్ళు గానీ, మాట్లాడే మాటలకి అర్థాలేమిటి? 'అస్తిత్వం' అంటారు! 'ఆత్మగౌరవం' అంటారు! 'అస్తిత్వం' అనే మాటకి 'ఉనికి' అనీ, 'గుర్తింపు' అనీ అర్థాలున్నాయి. భాషాపరంగా అయితే, 'తెలుగు వాళ్ళూ–తమిళ వాళ్ళూ'! అవే తేడాలే! ప్రాంతాలుగా అయితే, 'ఆంధ్రా వాళ్ళూ'–'తెలంగాణా వాళ్ళూ'! దేశాలుగా, 'భారతీయులూ' 'పాకిస్తానీయులూ'! 'కులాలు'గా చూస్తే, 'కింది కులాలూ'–'పై కులాలూ'! ఇలా! ఈ అస్తిత్వ భావనలన్నీ చాలా సంకుచితమైనవి. ఎందుకంటే, ఇవి 'శ్రమ దోపిడీ', 'అసమాన శ్రమ విభజన' అనే వాస్తవాల్ని, మరుగుపరుస్తాయి. ఈ వాస్తవ, మూల కారణాల వల్లనే, ప్రాంతీయ అసమానతలూ, కుల భేదాలూ, స్త్రీ–పురుష అసమానత్వమూ పుట్టుకొచ్చాయని గ్రహించడానికి, అస్తిత్వ భావనలు ఆటంకమవుతాయి.

ఇప్పుడు జరుగుతున్న విగ్రహాల రాజకీయాల సందర్భాన్నే చూద్దాం. తెలంగాణా తల్లి పిల్లలందరూ ఒకే స్థితిలో వున్నారా? అనేకులు శ్రమ చేసే వారిగానూ, అతి కొద్ది మంది ఏ శ్రమలూ చేయని వారిగానూ లేరూ? అనేక మంది జీతాల మీదా, కొద్దిమంది లాభాలూ, వడ్డీలూ, కౌళ్ళూ వంటి శ్రమ దోపిడీ ఆదాయాలమీదా బతికేవారుగానూ లేరూ? తెలంగాణా కోసం పోరాడామని చెప్పుకునే పార్టీ నాయకుల్ని గానీ, తెలంగాణాని ఇచ్చామని చెప్పుకునే పార్టీ నాయకుల్ని గానీ, సర్వే చేసి చూడండి! వీళ్ళ ఆస్తులూ, అంతస్తులూ, ఆదాయ మార్గాలూ, అన్నీ ఎలాంటివో తెలుస్తాయి! 'తెలంగాణా తల్లి' బిడ్డలైనా, 'ఆంధ్ర మాత' బిడ్డలైనా, 'ఉత్కల (ఒరిసా) జనని' బిడ్డలైనా, 'కన్నడ రాజ్యమాత' సంతానమైనా, 'తమిళ తాయి' పిల్లలైనా, 'మరాఠీ ఆయి' పిల్లలైనా, ఒకే అస్తిత్వంతో లేరు. ఏ దేశాన్ని తీసుకున్నా, ఏ ప్రాంతాన్ని తీసుకున్నా, ఏ కులాన్ని తీసుకున్నా, జనాభాలో అసంఖ్యాకులు ఏదో ఒక రకమైన శ్రమ చేసుకుంటూ బ్రతికే వారే! అల్ప సంఖ్యాకులు మాత్రమే సిరిసంపదలతో తులతూగేవారు! కంటికి కనిపించినా, వాస్తవాల్ని అర్థం చేసుకోలేని, వర్గ చైతన్యం లేని జనాలను, 'జయ జయహే తెలంగాణ జననీ!', 'జై ఆంధ్ర మాతా!', 'బంగారు తెలంగాణా!', 'స్వర్ణాంధ్రప్రదేశ్!' వంటి నినాదాలతో, నిద్రపుచ్చి, వారిని శ్రమ దోపిడీకి అప్పజెప్పడమే కదా అస్తిత్వవాదులు చెయ్యగలిగే ఘనకార్యం! ఈ ఘన కార్యాలకోసమే, వేల లీటర్ల పాలాభిషేకాలూ, బహిరంగ సభలూ!

ఈ అస్తిత్వవాదులు, విరివిగా వాడే ఇంకో మాట, 'ఆత్మగౌరవం'! బతుకుతెరువు కోసం అవసరమైన శ్రమ సాధనాలు లేని అసంఖ్యాక శ్రామిక జనాలు, ఆ సాధనాల్ని స్వంత ఆస్తిగా గల యజమానుల కింద జీతాల బానిసత్వంలో జీవిస్తూ వుంటే, అది ఆత్మగౌరవం అవుతుందా? 'పై కులాలూ' – 'కింది కులాలూ'గా చీలివున్న సమాజంలో, ఆత్మగౌరవంతో ఎవరు ఉండగలరు? ఇంటిపని ప్రధానంగా స్త్రీలకీ, బైటిపని ప్రధానంగా పురుషులకీ అనే అసమాన శ్రమ విభజన వున్న కుటుంబ జీవితాల్లో, స్త్రీలు ఎలాంటి ఆత్మగౌరవంతో వుండగలరు?

ఇప్పుడు జరగవలిసిందేమిటంటే, అస్తిత్వం పేరుతో, ఆత్మగౌరవం పేరుతో, నడిచే విగ్రహాల రాజకీయాలకి దూరంగా వుండాలి! 'శ్రమ దోపిడీ' వ్యతిరేకమైన చైతన్యాన్నీ, సమానత్వం గురించిన అవగాహననీ నేర్చుకోవాలి!

■ రంగనాయకమ్మ





హనుమకొండ వేయిస్తంభాల గుడిలో రుద్రేశ్వరుడికి మారేడు దళ అర్చన



స్వామి అమ్మవార్ల దృష్టి నేరుగా అన్నం రాశిపై పడేవిధంగా అర్థ మండపంలో ఏర్పాటు చేసిన కుంభం

మల్లన్న స్వామికి దృష్టి కుంభం

- ధను సంక్రమణం సందర్భంగా నిర్వహణ
- ఆరు రోజుల అనంతరం ఆర్జిత సేవలు ప్రారంభం

6



హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రానికొచ్చిన అభ్యర్థులు

ముగిసిన గ్రూపు-2 పరీక్షలు

- హనుమకొండ జిల్లాలో 48.61శాతం, వరంగల్‌లో 45.69శాతం అభ్యర్థుల హాజరు
- ఒక్క నిమిషం ఆలస్యంతో పరీక్షకు దూరమైన అభ్యర్థి

6

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

- వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పర్వం ఆరంభం
- జోరుగా తిరుప్పావై ప్రవచనాలు

8

భూమిలేని పేదలెందరో?



వ్యవసాయ కూలీలకు ఆర్థిక భరోసా అందజేతకు ప్రభుత్వం సన్నాహాలు

- ఏటా రూ.12వేలు ఇవ్వనున్న రాష్ట్ర సర్కారు
- తొలి విడతగా ఈనెల 28న రూ.6వేలు జమ చేయనున్నట్టు ప్రకటన
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 7.35లక్షల మందికి జాబ్‌కార్డులు
- భూమిలేని పేదలను గుర్తించేందుకు ఎలాంటి సర్వే చేయని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,89,787 మందికి రైతుభరోసా
- ఏటా వ్యవసాయ కూలీలు, రైతు భరోసాకు రూ.30వేల కోట్లు ఖర్చు



జిల్లా.. లబ్ధిపొందిన రైతులు	వరంగల్	హనుమకొండ	జనగామ	మహబూబాబాద్	భూపాలపల్లి	ములుగు	మొత్తం
	1,54,822	1,45,044	1,79,735	2,14,685	1,16,171	79,330	8,89,787

గత యాసంగిలో రైతు భరోసా లబ్ధిపొందిన ఉమ్మడి జిల్లా రైతులు..

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

భూమిలేని పేదలకు ప్రభుత్వం రూ.12వేల ఆర్థిక సాయానికి సన్నాహాలు చేస్తోంది. రెండు విడతల్లో పేదలకు ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే భూమిలేని పేదలను ప్రభుత్వం ఎలా గుర్తిస్తుందనేది ఉత్కంఠగా మారింది. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి అనేక సర్వేలు నిర్వహించినా భూమి లేని నిరుపేదల వ్యవసాయ కూలీల గురించి ప్రత్యేకంగా సర్వే ఎప్పుడూ నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో భూమిలేని పేదల గుర్తింపు ప్రక్రియపై పలు అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 7.35లక్షల గ్రామీణ ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. అయితే వీటి ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారా? లేక ప్రస్తుతం రైతుభరోసా తీసుకుంటున్న వారు కాకుండా.. మిగతా వారికి సాయాన్ని అందిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. వ్యవసాయ కూలీలకు ఇచ్చే సహయానికి అర్హులు ఎవరనేది ఆసక్తికరంగా మారింది.

కూలీలకు ఫస్ట్.. ఆ తరువాతే రైతుకు భరోసా

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రైతుభరోసాను ప్రకటించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరాకు యాసంగి, వానకాలం పంటలకు రెండు విడతల్లో రూ.10వేల ఆర్థిక సాయాన్ని రైతులకు అందించింది. అయితే తాము అధికారంలోకి వస్తే రైతుబంధు పథకం స్థానంలో రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ హమీ ఇచ్చింది. భరోసా ద్వారా రైతులకు ఎకరాకు రెండు విడతల్లో రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తామని హమీ ఇచ్చింది. అలాగే కౌలు రైతులకు కూడా ఇదే మొత్తాన్ని అందిస్తామని హమీ ఇచ్చింది. ఇక వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామని హమీ ఇచ్చింది. ఈ మేరకు గతేడాది డిసెంబరు 7న సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత యాసంగి పంటలకు సంబంధించి పాత పద్ధతిలోనే రైతులకు యాసంగి పంటకు ఎకరానికి రూ.5వేల చొప్పున సాయాన్ని అందించారు. అయితే వానాకాలం పంటలకు, ప్రస్తుతం ప్రారంభమైన రబీ పంటకు కాంగ్రెస్ ఇచ్చిన రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.15వేల చొప్పున ఇవ్వాల్సి ఉంది. అయితే భరోసా పథకాన్ని సంక్రాంతి నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. రైతు భరోసాకంటే ముందే వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హమీ మేరకు రూ.12వేల ఆర్థిక సాయాన్ని అందించాలని నిర్ణయించింది. రెండు విడతల్లో భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ.12వేల సాయాన్ని అందించనున్నారు. తొలి విడత రూ.6వేల సాయాన్ని

మిగతా 8వ పేజీలో...

గజ.. గజ..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్రమైన చలి

పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు.. వణుకుతున్న జనం



వాజేడులో చలిమంట కాగుతున్న యువకులు

ఉమ్మడి జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌డిగ్రీల్లో)


జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
ములుగు	28	11
వరంగల్	28	12
హనుమకొండ	27	12
భూపాల్‌పల్లి	28	12
జనగాం	28	13
మహబూబాబాద్	28	13

వరంగల్‌సిటీ / ములుగు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చలి పంజా విసురుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొద్ది రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గత మూడునాలుగు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో జనం వణుకుతున్నారు. వృద్ధులు, పిల్లలు, శ్వాసకోశ సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల సెల్సియస్ నమోదవగా.. రాత్రిపూట 12 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. ఇక ఉదయమైతే 9గంటల వరకు పొగమంచు కురుస్తోంది. పనులపై బయటకొచ్చే వారు, విద్యార్థులు, రైతులు స్వెట్టర్లు వేసుకుంటున్నారు. మరీ ముఖ్యంగా ములుగు ఏజెన్సీ వాసులు వణికిపోతున్నారు. నాలుగురోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగటిపూట గరిష్ఠంగా 26డిగ్రీలతో వాతావరణం పొడిగా ఉంటున్నా అర్ధరాత్రికి ఆ ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతూ 11 నుంచి 13డిగ్రీలు నమోదవుతోంది. గోదావరి పరివాహకంలోని ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో గోదావరి నదీతీరం, అభయారణ్యం ప్రభావంతోనే చలి తీవ్రంగా ఉంటోంది.

కాళోజీ కళాక్షేత్రానికి మరమ్మతులు

- గేటుకు తాళంవేసి పనులు చేస్తున్న నిర్మాణ సంస్థ

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన





కాళోజీ కళాక్షేత్రానికి మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

హనుమకొండ టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరుతో నిర్మించిన 'కాళోజీ కళాక్షేత్రానికి పగుళ్లు' అనే వార్త ఈ నెల 11న ఆంధ్రజ్యోతి మెయిన్ ఎడిషన్‌లో వచ్చిన విషయం తెలిసిందే. కాగా, ఈవిషయంపై కుడా అధికారులు పగుళ్లు కాదు అని ఖండించారు. సోమవారం కాళోజీ కళాక్షేత్రం గేటుకు తాళం వేసి పగుళ్లు ఏర్పడిన గోడలపై కళాక్షేత్రం నిర్మాణ సంస్థ ప్రతినిధులు సిబ్బందితో పగుళ్లకు మరమ్మతు పనులు చేపట్టారు. నవంబరు 19న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా కాళోజీ కళాక్షేత్రాన్ని అట్టహాసంగా ప్రారంభించి నెల రోజులు గడవకముందే కళాక్షేత్రానికి పగుళ్లు రావడంపై స్థానిక ప్రజలు కాంట్రాక్టర్, కుడా అధికారుల తీరుపై పలు విమర్శలు గుప్పించారు. రూ. 95 కోట్ల నిధులతో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రజలు చూడ డానికి అనుమతించడంలేదని విమర్శించారు. కుడా అధికారులు, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడమే గోడలకు పగుళ్లు ఏర్పడడానికి ప్రధాన కారణమని అందుకోసమే కళాక్షేత్రంలోకి ప్రజలను అనుమతించడంలేదని వివిధ ప్రజా సంఘాల నాయకులు, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు కళాక్షేత్రం నిర్మాణం చేపట్టిన కుడా ఇంజనీరింగ్ అధికా రులు కాంట్రాక్టర్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగులు

- పబ్జీ ద్వారా పరిచయమై డబ్బు కాజేసిన ఓ కేటుగాడు
- అప్పులపాలై తీవ్ర ఒత్తిడితో యువకుడి ఆత్మహత్య
- వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలో ఘటన

6

సత్వర పరిష్కారం చూపండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బల్దియా ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు సత్వర పరిష్కారం చూపాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్‌హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలపై స్పందించని అధికారులు, సిబ్బందిని ఇకపై సహించేది లేదని విధుల్లో అలసత్వం వహి స్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బల్దియాలోని కొన్ని శాఖల నుంచి తరుచుగా ఫిర్యాదులు వస్తున్నాయని టౌన్ ప్లానింగ్ అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఇటీవల నిర్వహించిన సమగ్ర కులగణన సర్వేలో సిబ్బంది పని తీరు సంతృప్తినిచ్చిందని అన్నారు. గ్రేటర్ వ రంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను

మిగతా 6వ పేజీలో...

నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదు

- పనితీరు మార్చుకోకపోతే చర్యలు
- సిబ్బంది తీరుపై నివేదిక ఇవ్వాలని ఆర్ఎంవోకు ఆదేశం
- సీకేఎం ఆస్పత్రి సందర్శనలో కలెక్టర్ హెచ్చరిక



నూతనంగా ఏర్పాటుచేసిన కొత్త మానిటర్లను ప్రారంభిస్తున్న కలెక్టర్

గిర్మాజిపేట, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదని వరంగల్ కలెక్టర్ సత్యశారద సీకేఎం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను హెచ్చరించారు. సోమవారం ఆమె ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఇటీవల ఆస్పత్రిలో జన్మించిన శిశువును ఎంజీఎంకు తరలించగా మృతి చెందడం, ఆస్పత్రిలో సెప్టిక్ ట్యాంక్‌లు నిండి డ్రైనేజీ పైప్‌లు లీకైన సంఘటనలు పత్రికల్లో రావడంతో ఆమె ఆస్పత్రిని తనిఖీ చేశారు. మొదట నేరుగా ఓపీ బ్లాక్‌కు వెళ్లి మహిళలతో మాట్లాడారు. ఓపీ బ్లాక్‌లో బాలింతలకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం నవజాతశిశు వార్డు, మదర్ వార్డులకు వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. అత్యవసర వైద్య పరికరాలు, వెంటిలేటర్లు లేకపోవడంతో శిశువులను ఎంజీఎంకు పంపుతున్నామని ఆర్ఎంఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి వివరించారు. అనంతరం ఫార్మసీకి వెళ్లి మందుల కొరతలేకుండా చూసుకోవాలని సూచించారు. బెడ్‌షీట్లు శుభ్రంచేసేందుకు అవసరమైన డెటాయిల్, బ్లీచింగ్ పౌడర్, కెమికల్స్ లేవని సిబ్బంది చెప్పడంతో ఎవో సాజిద్ అలీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెయినేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశిం చారు. శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ, కాంట్రాక్టర్ పనితీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ పర్యటిస్తున్న సమయంలో ఎలుకలు, కుక్కలు ఆస్పత్రి ఆవరణలో సంచరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆస్పత్రిలో థర్డ్‌పార్టీ కాంట్రాక్ట్ కింద పనిచేస్తున్న 86 మంది సిబ్బంది పనితీరుపై నివేదిక ఇవ్వాలని ఆర్ఎంవోను ఆదేశించారు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ మిషన్‌ను వెంటనే ఏర్పాటుచేయాలన్నారు. ల్యాబ్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, 2వ ఆర్ఎంవో డాక్టర్ సత్యజిత్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు నూతనంగా ఏర్పాటుచేసిన 2 మానిటర్లను కలెక్టర్ సత్యశారద ప్రారంభించారు.



గురుకుల పాఠశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ ?

తోటి విద్యార్థితో అసభ్యకర ప్రవర్తన

దామెర, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాల సముద్రం) లోని విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి, ఆరో తరగతి చదువుతున్న విద్యార్థితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఘర్షణ చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆదివారం రాత్రి ఆరో తరగతికి చెందిన విద్యార్థి చొక్కా, నిక్కరు గుండీలను తొమ్మిదో తరగతి విద్యార్థి విప్పమనడంతో ఘర్షణ జరిగినట్లు తెలిసింది. రాత్రి జరిగిన విషయాన్ని సదరు విద్యార్థి సోమవారం పాఠశాలలోని ఇంచార్జి ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురాగా, తొమ్మిదో తరగతి విద్యార్థిని ఇంచార్జి ప్రిన్సిపాల్ పిలిపించి మందలించి వదిలేసినట్లు తెలిసింది. అంతే కాకుండా పాఠశాలలో వివిధ తరగతుల్లోని కొందరు విద్యార్థులు బృందాలుగా ఏర్పడి రాత్రి సమయంలో తోటి విద్యా ర్థులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం.

రైలు ఢీకొని ఉద్యోగి మృతి



రమేష్ (ఫైల్)

సంగెం, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): సంగెం మండలం ఎల్గూరు రైల్వే స్టేషన్ లో రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతిచెం దాడు. అదే స్టేషన్‌లో పంచ్‌మెన్(జెండా ఊపే)గా పనిచేస్తున్న రాచ మల్ల రమేష్(46) సోమ వారం సాయంత్రం ఒకటో ప్లాట్ ఫాం నుంచి రెండో ప్లాట్‌ఫాంనకు వెళుతుండగా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామానికి చెందిన రమేష్ ప్రస్తుతం సంగెం మండలం గాంధీనగర్‌లో భార్య రజితతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతడి తండ్రి కొమురయ్య రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూనే మృతిచెందాడని, ఆయన సోదరుడు శ్రీనివాస్ సైతం యేడాది క్రితం మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన గ్రూపు-2 పరీక్షలు

- హనుమకొండ జిల్లాలో 48.61 శాతం అభ్యర్థులు హాజరు
- వరంగల్ జిల్లాలో 45.69 శాతం అభ్యర్థులు హాజరు
- ఒక్క నిమిషం ఆలస్యంతో పరీక్షకు దూరమైన అభ్యర్థి



హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాయడానికి వెళుతున్న అభ్యర్థులు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూపు-2 పరీక్షలు సోమవారం ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా గ్రూపు-2 అభ్యర్థుల కోసం అధికారులు 82 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండవ రోజు 33006 మంది అభ్యర్థులకు గాను ఉదయం పరీక్షకు 16044 మంది అభ్యర్థులు హాజరవ్వగా 16962మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం పర్సంటేజీ 48.61 శాతం నమోదైంది. మధ్యాహ్నం పరీక్షకు 16026 మంది అభ్యర్థులు హాజరు కాగా 16980 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పర్సంటేజీ 48.55 శాతం నమోదైంది. హనుమకొండ భీమారంలోని ఎస్వీఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి ముల్కనూరుకు చెందిన ఉదయ్‌కిరణ్ ఒక్క నిమిషం ఆలస్యంగా రాగా అధికారులు పరీక్షకు రాయడానికి అనుమతించలేదు. దీంతో ఉదయ్‌కిరణ్ దిక్కుతోచని స్థితిలో ఇంటిబాట పట్టాడు. రెండు సంవత్సరాలు కష్టపడి గ్రూపు-2 పరీక్షకు సిద్ధం కాగా ఒక్క నిమషం ఆలస్యం కావడంతో పరీక్ష రాయలేకపోయాయని వాపోయాడు. గ్రూప్-2 పరీక్ష కోసం వరంగల్ జిల్లా వ్యాప్తంగా 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 11,310 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 5167 మంది హాజరు అయ్యారు. 45.69 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు పేర్కొన్నారు.

మల్లన్న స్వామికి ఘనంగా దృష్టి కుంభం

- ధను సంక్రమణం సందర్భంగా నిర్వహణ
- ఆర్జిత సేవల అనంతరం స్వామివారి దర్శనం



దృష్టి కుంభం పూర్తయ్యాక అన్నం రాశిని దర్శించుకుంటున్న ఈవో నాగేశ్వర్‌రావు, ఎస్సై శ్రీనివాస్, అర్చకులు, భక్తులు

ఐనవోలు, డిసెంబరు 16(ఆంధ్ర జ్యోతి) : జాతర ఉత్సవాలకు ముందు ఐనవోలు మల్లికార్జునస్వామికి నిర్వహించే దృష్టి కుంభాన్ని సోమవారం వేద పారాయాణల మధ్య ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఆరు రోజుల పాటు సాగిన సుధావలి వర్ణలేపనం కార్యక్రమం ఆదివారం రాత్రి పూర్తయింది. దృష్టి దోషాలు జరుగకుండా చేసే ఈ కార్యక్రమంలో స్వామి, అమ్మవార్లకు రంగులు అద్ది నేత్రోన్మీలన (నేత్రాలకు మైనం)పెట్టారు. సూర్యోదయానికి ముందు కుంభహారతితో మూడు సార్లు ఆలయం చుట్టూ ప్రదక్షణ చేస్తూ గుమ్మడికాయలు, నిమ్మకాయలను కత్తితో కొడుతూ వేద మంత్రాలు పఠించారు. గర్భగుడికి ఎదురుగా అర్థ మండపంలో మూడు క్వింటాళ్ల అన్నాన్ని రాశి(కుంభం)గా పోసి కుంకుమ హారతులను వెలిగించారు. అన్నం రాశికి ఎదురుగా దర్పణం(అద్దం) రాశికి అవతల తూర్పువైపు మేకపిల్లను నిలిపారు. స్వామి అమ్మవార్ల దృష్టి నేరుగా అన్నం రాశి, మేకపిల్లపై పడేవిధంగా నేత్రాలకు పెట్టిన మైనాన్ని వెనుకాల నుంచి తొలగించి సూర్యోదయానికి ముందు దృష్టికుంభం తంతును పూర్తిచేశారు. గణపతి పూజ, పుణ్యహావాచనం చేసి సంప్రోక్షణ జరిపారు. పంచామృతాలతో ఏకదశ రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం,(అభిషేకం) తీర్థప్రసాద వినియోగము జరిపారు. దీంతో ఆరు రోజుల పాటు నిలిచిన ఆర్జిత సేవలు యథావిధిగా ప్రారంభమయ్యాయి. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. దృష్టికుంభాన్ని నెల రోజుల ముందు ధను సంక్రమణ రోజున నిర్వహించారు. దృష్టికుంభం పూర్తవడంతో అర్చకులు ఉద్యోగులు మండపంలో సంతోషంగా నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు దంపతులు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తం శర్మ, విక్రాంత్‌జోషి, అర్చకులు నందనం మధుశర్మ, భానుప్రసాద్, నరేష్ శర్మ, ఉప్పుల శ్రీనివాస్, మడికొండ దేవేందర్, పోశయ్య, ఎస్సై పస్తం శ్రీనివాస్, ఉద్యోగులు అద్దంకి కిరణ్, ఆర్.సంజీవరావు, జి. ప్రేమ్‌కుమార్, సిబ్బంది శ్రీకాంత్, కన్నయ్య, అభిషేక్, రాజులు, మాజీ ఎంపటీసీ బొల్లేపల్లి మధు, ఒగ్గు పూజారులు, భక్తులు పాల్గొని దర్శించుకున్నారు.

చెన్నారావుపేట ఎంపీవో సస్పెన్షన్

చెన్నారావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజు సస్పెన్షన్‌కు గురయ్యారు, ఇటీవల ఎంపీడీవో పట్ల ప్రవర్తించిన తీరు, అసభ్యకరంగా మాట్లాడటం, పంచాయతీ కార్యదర్శులను ఇబ్బందులు పెట్టిన విషయంలో వచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో వాస్తవమేనని తెలడంతో జిల్లా కలెక్టర్ సత్యశ్వారద సస్పెషన్‌ను విధించారు. సోమవారం ఈ మేరకు ఎంపీవోను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీవాణి తెలిపారు.

ప్రముఖ ఒగ్గు కళాకారుడు మృతి



ఒగ్గు కళాకారుడు ఐలయ్య (ఫైల్)

బచ్చన్నపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కట్కూరుకు చెందిన ప్రముఖ ఒగ్గు కళాకారుడు చెట్టి ఐలయ్య (75) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. నాలుగు దశాబ్దాలుగా ఒగ్గు కథలను అవలీలగా చెబుతూ ప్రాచుర్యం పొందాడు. హైదరాబాద్‌లో జరిగిన అనేక ఉత్సవాలు, పండుగల్లో ఒగ్గు కథలు చెప్పి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. పాత్రలను గానంతో రక్తికట్టించేవారు. ఐలయ్య మృతికి చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత వెంకటాచారి, మాజీ ఎంపీపీ బావండ్ల కృష్ణంరాజు, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు పుట్ట నర్సింహులు, నేతలు మునిని రాజుగౌడ్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు మునిని శ్రీశైలంగౌడ్ పలువురు ఒగ్గు కళాకారులు, గ్రామ ప్రజలు సంతాపం తెలిపారు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.



వస్త్రాలను తిలకిస్తున్న వినియోగదారులు

హరిత కాకతీయ హోటల్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్ పో

బాలసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నక్కల గుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివారం నేషనల్ సిల్క్ ఎక్స్ పో ప్రారంభమైంది. ఈ ప్రదర్శన ఈనెల 19 వర కు కొనసాగుందని నిర్వాహకుడు నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాలోని నిష్ణాతులైన చేనేత కళాకారులు ఉత్పత్తి చేసిన కాటన్, సిల్క్, డిజైనర్ వేర్, ఫ్యాషన్ జూవెలరీ, ఎథ్నిక్‌వేర్, కుర్తి, హోం లినెన్, మరెన్నో ఈ ప్రదర్శనలో ఉన్నాయని చెప్పారు. ఈ నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రధానంగా వివాహ, సంక్రాంతికి ప్రత్యేకమన్నారు. ప్రతీ రోజు ప్రదర్శన ఉదయం 11గంటలనుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కొనుగోళ్లపై 50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

19న హనుమకొండకు ఏకసభ్య కమిషన్ రాక

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఈ నెల 19వ తేదీన హనుమకొండకు రానున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ సత్యశారదా దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై అధ్యయనం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో బహిరంగ విచారణ నిమిత్తం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బహిరంగ విచారణ కార్యక్రమం ఉంటుందన్నారు. నాయకులు అధిక సంఖ్యలో బహిరంగ విచారణకు హాజరై తమ వినతులు ఇవ్వాలని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు ఫుడ్ సేఫ్టీ అధికారుల రాక..

ఐదుగురు అధికారులు, 12 మంది ఉద్యోగుల కేటాయింపు

బాలసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అరకొర అధికారులు, సిబ్బంది కొరతతో ఇన్నాళ్లుగా అసలు ఇక్కడ ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనేది ఉందా..? ఉంటే తినుబండారాలపై తనిఖీలు చేసిన దాఖలాలు ఎక్కడా..? అనే ప్రశ్నలు తరచూ ప్రజల్లో రేకెత్తేవి. కొద్ది నెలల క్రితం వరంగల్ మహా నగరంలో ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన హైదరాబాద్ నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్ అధికారులు పలు హోటళ్లపై జరిపిన దాడుల్లో విస్మయం కలిగించే విధంగా కుళ్లిన మాంసం, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, నిషేధిత రంగులు కలపడం లాంటి ప్రజలు తినకూడని, ఆరోగ్యానికి హాని కలిగించే అంశాలు ఎన్నో వెలుగు చూశాయి. ఆహార కల్తీ, నాసిరకం పదార్థాల వినియోగం, విషపూరిత రంగుల నియంత్రణ పర్యవేక్షణ ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు రాష్ట్రంలో నూతనంగా 24మంది ఫుడ్ సేఫ్టీ అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వగా అందులో ఐదుగురు అధికారులను ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించింది. ఇద్దరిని వరంగల్ జిల్లాకు, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాలకు ఒక్కొక్కరి చొప్పున పోస్టింగ్ ఇచ్చారు. అంతేగాక ఒక్కొక్క జిల్లాకు ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ఒక శాంపిల్ కలెక్షన్ ఉద్యోగి చొప్పున 12 మంది ఉద్యోగులను పోస్టింగ్ ఇచ్చారు. నియామకం అయిన అధికారులు, ఉద్యోగులు రేపో మాపో విధుల్లో చేరనున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



భీమరాజు (ఫైల్)

గిర్మాజీపేట, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు ప్రాంతానికి చెందిన వల్లేపు భీమరాజు(33) ఓ కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి కొత్తవాడలో అద్దెకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి జరిగిన కుటుంబ గొడవల్లో భార్య, ఇద్దరు కూతుర్లను కొట్టి ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. సోమవారం తెల్లవారుజామున తను వరంగల్-కాజీపేట రైల్వేస్టేషన్‌ల మధ్య శాయంపేట సమీపంలో రైలు కిందపడి చనిపోయాడు. ఎంజీఎంలో పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని తండ్రి ఐలయ్యకు అప్పగించారు. హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాయుధ పోరాట యోధుడు.. దర్గ్యానాయక్ కన్నుమూత

107ఏళ్ల వయస్సులో అనారోగ్యంతో మృతి

- జనగామ జిల్లాలో విషాదం.. నేడు అంత్యక్రియలు
- హాజరుకానున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని
- నాడు విస్నూర్ దొర ఆగడాలకు ఎదురొడ్డిన దర్గ్యానాయక్



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు ధర్యానాయక్ (ఫైల్)



దర్యానాయక్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రమేష్

దేవరుప్పుల, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): దేశ్‌ముఖ్ ఆగడాలకు ఎదురొడ్డి పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోతు దర్యానాయక్ (107) సోమవారం సాయంత్రం కన్నుమూశారు. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల మండలం ధర్మాపురంలోని జాటోతుతండాకు చెందిన నాయక్ రెండేళ్లగా అనారోగ్యం (వృద్ధాప్యం)తో బాధపడుతున్నాడు. దర్యానాయక్ భార్య గతంలోనే చనిపోగా, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు చంద్రభాను నాయక్, చిన్నకుమారుడు పర్శునా యక్ ఉన్నారు. స్థానికంగానే ఉంటూ వ్యవసాయం చేసు కుంటూ జీవిస్తున్నారు. కాగా కుమార్తె తారాబాయి ఉన్నా రు. ప్రస్తుతం గ్రామం లో ఉంటున్న దర్యా నాయక్ ఆలనాపాలన కూతురు తారాబాయి చూసుకుంటోంది. ఇక దర్యానాయక్ అంత్యక్రియలు మంగ ళవారం జాటోతు తండాలో జరగ నున్నాయి. అంత్యక్రియలకు సీని యర్ పాత్రికేయులు పాశం యాద గిరి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మి నేని వీరభద్రం, మాజీ మంత్రి ఎర్ర బెల్లి దయాకర్‌రావు, సీపీఐ జిల్లా కా ర్యదర్శి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆదిసాయన్న, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా తిరు పతిరెడ్డి హాజరు కానున్నారు.

తుపాకీ చేతబట్టి.. దేశ్‌ముఖ్‌ను ఎదిరించి..

దేశ్‌ముఖ్ రాపాక రాంచెంద్రారెడ్డి మితిమీరిపోయిన అరాచకాలను దర్యానాయక్ ఎదురొడ్డి తిప్పికొట్టాడు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తుపాకీ చేతబట్టి అలుపెరగని పోరాటం చేశారు. మహిళల మాన, ప్రాణాలను కాపాడటం కోసం కదవెండికి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు నల్లా నర్సింహులు గ్రామ రక్షణ దళాలు ఏర్పాటు చేయగా అందులో సభ్యుడిగా చేశారు. దేశ్‌ముఖ్ గుండాలను తరిమికొడుతూ వారికి సింహస్వప్నంలా మారాడు. గ్రామంలోని దేశ్‌ముఖ్ గుండాల దాడిలో పదిమంది సజీవ దహనం చేశారు.

దర్యానా యక్ అన్న రాసూనాయక్ మొండ్రాయి గ్రామంలో ఎద్దులబండి చక్రాలకు కట్టేసి చిత్రహింసలు పెట్టి చంపారు. సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీపీఐ, సీపీఎం, బీఆర్‌ఎస్ నాయకులు జీడి ఎల్లయ్య, బిల్లా తిరుపతిరెడ్డి, సింగారపు రమేష్, పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, తీగల దయాకర్, బస్వ మల్లేశం, చింత రవి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

సత్వర పరిష్కారం చూపండి

(5వ పేజీ తరువాయి)

పరిష్కరించేందుకు ప్రతీ వారం నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరై సమస్యలు చెప్పుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 63 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, సెక్రెటరీ అలివేలుతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

- గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ వంగపహాడ్ శ్మశానవాటికలో తాగడానికి మంచి నీరు లేదని, దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఎనుమాముల రోడ్డు నెంబర్ -4 సాయిగణేశ్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్‌గొర్రెకుంటలో రోడ్డు మరమ్మతు పనులు చేస్తుండగా మిషన్ భగీరథ పైపులైను పగిలిపో యింది. చాలా రోజులుగా రోడ్డుపైనే నీరు ప్రవహిస్తూ అటుగా ప్రయాణించే ప్రజలకు ఇబ్బందిగా మారుతుందని గరీబ్ నగర్ వాసులు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ 53వ డివిజన్ సమ్మయ్యనగర్‌లో కొందరు రోడ్లను ఆక్రమించి ప్రహారి నిర్మించడంతో పాటు ప్రధాన రోడ్డును ఆక్రమించి కట్టడాలు జరుపుతున్నా కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండలోని 50వ డివిజన్ న్యూబస్టాండ్ సమీపంలోని విద్యుత్‌నగర్‌లో చాలా కాలంగా కుక్కల సమస్య ఉందని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. కొత్తబస్ స్టేషన్ ప్రాంతంలో మహిళలు, పిల్లలు బయటకు వెళ్లాలంటే బయపడిపోతున్నారని తెలిపారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగులు





మృతిచెందిన మరుపట్ల హనూక్

వర్ధన్నపేట రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగ్.. ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. పబ్జీ గేమ్ ద్వారా పరిచయమైన ఓ యువకుడు.. ఆన్‌లైన్ బెట్టింగుల జూదంలోకి దించాడు. అతడి మాటలు నమ్మి ఓ యాప్ ద్వారా రూ.లక్షల్లో బెట్టింగ్ పెట్టిన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలానికి చెందిన ఓ యువకుడు అప్పులపాలై మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం తెల్లవారు జామున జరిగిన ఈ ఘటన ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిల్చింది. బాధిత కుటుంబం, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేట మండలం బండౌతపురం గ్రామానికి చెందిన మరుపట్ల సోమయ్య-యాకమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు ఆశీర్వాదం కరోనా సమయంలో మృతిచెందగా.. చిన్న కుమారుడు మరు పట్ల హనూక్ (26)గ్రామంలోని ఓ పెట్రోల్ పంపులో పనిచేస్తున్నాడు. కూలీ నాలీ చేసుకుని జీవించే ఆ కుటుంబంలో ఆన్‌లైన్ బెట్టింగ్ తీరని విషాదాన్ని నింపింది. పెద్దకుమారుడు చనిపోయిన బాధ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆ తల్లిదండ్రులకు గుం డెకోత విగిల్చింది. కొన్ని నెలలుగా హనూక్ ఆన్‌లైన్‌లోని ఓ యాప్‌లో బెట్టింగ్ పెట్టడం ప్రారంభించాడు. పెట్టిన డబ్బుకు రెట్టింపు వస్తుండటంతో మరింత ఆశతో రూ.లక్షల్లో బెట్టిం గులు పెట్టడం ప్రారంభించాడు. ఇలా సుమారు రూ.6లక్షల వరకు అప్పులు కావడంతో వాటిని తీర్చలేక తీవ్ర ఒత్తిడికి గురైన హనూక్ సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. దీంతో మూడేళ్ల వ్యవధిలో ఇద్దరు కుమారులను కోల్పోయిన ఆ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

పబ్జీ ద్వారా పరిచయమై...

ఏపీలోని వైజాగ్‌కు చెందిన ఓ యువకుడికి మరుపట్ల హనూక్ పబ్జీ గేమ్ ద్వారా పరిచయమైనట్టుగా మృతుని స్నేహితులు చెపుతున్నారు. హనూక్ ఖాళీ సమయాల్లో పబ్జీ గేమ్ ఆడుతుండే వాడని, అందులో పరిచయమైన ఓ వ్యక్తితో గేమ్ ఆడేవాడని, అలా పరిచయమైన ఆ వ్యక్తితో చాలా సన్నిహితంగా మాట్లాడేవాడని చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఏపీకి చెందిన ఆ వ్యక్తి హనూక్‌ను ఆన్‌లైన్ బెట్టింగ్ వైపు మళ్లించాడని, డబ్బులు చాలా సంపాదించ వచ్చని చెప్పడంతో ఆశపడిన హనూక్ డబ్బులు పెట్టడం ప్రారంభించాడని, ఇలా యాప్‌లోనే కాకుం డా వైజాగ్‌కు చెందిన వ్యక్తికి కూడా ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపి బెట్టింగులు పెట్టించేవాడని చెబుతున్నారు. ఇలా డబ్బులు ఎక్కువ మొత్తంలో తీసుకున్న ఏపీకి చెందిన వ్యక్తి చివరకు హనూక్‌కు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం ప్రారంభించాడని, దీంతో ఓసారి హనూక్ వైజాగ్ వెళ్లి తన డబ్బులు తనకు ఇవ్వాలని గొడవ పెట్టుకోవడంతో కొంత నగదు ఇచ్చినట్టు తెలుస్తోంది. వీరిద్దరి మధ్య లావాదేవీలతో పాటు ఇతర కారణాలు కూడా ఆత్మహత్యకు కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఆదివారం కూడా హనూక్ ఆన్‌లైన్ ద్వారా వైజాగ్ వ్యక్తికి రూ.90 వేలు పంపినట్టు అతడి స్నేహితులు చెబుతున్నారు. అయితే హనూక్ ఆత్మహత్య విషయం తమ దృష్టికి వచ్చిందని, ఎలాంటి రాతపూర్వక ఫిర్యాదు అందలేని వర్ధన్నపేట పోలీసులు చెబుతున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2500	2080
పల్లికాయ (సూక)	3500	3000
పల్లికాయ (పచ్చిది)	5250	4500
కందులు	-	-
పెసళ్లు	-	-
పత్తి	7010	5800
పసుపు (కాడి)	-	-
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి కొత్తది	15516	12000
తేజ ఏసీ	16000	14000
వండర్‌హాట్ ఏసీ	-	-
యూఎస్ 341ఏసీ	13500	11000
యూఎస్ 341కొత్తది	13000	12500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

జనవరి వరకు ధాన్యం కొనుగోలు

- బోనస్‌తో రైతులకు ప్రోత్సాహం
- సివిల్ సప్లయిూస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్



ముఖాముఖి

హనుమకొండ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియ జనవరి వరకు కొనసాగుతుందని, ఈ సారి ఎలాంటి అవాంతరాలు లేకుండాఈ ప్రక్రియ కొనసాగుతోం దని సివిల్ సప్లయిూస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఉప్పునూతల మహేందర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి : ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎలా జరుగుతోంది? బోనస్ విషయంలో రైతుల స్పందనెలా ఉంది?

మహేందర్ : ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవడంతో ధా న్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరుగుతోంది. జనవరి వరకు ప్రక్రియ కొనసాగుతుంది. ప్రభుత్వం కల్పించిన రూ. 500 బోనస్ రైతులను ఎంతో ప్రోత్సహించింది.

ఆంధ్రజ్యోతి : డబ్బుల జమలో ఆలస్యం ఏమైనా ఉందా?

మహేందర్ : జాప్యానికి తావు లేకుండా రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమవుతున్నాయి. కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి : కొనుగోలు ప్రక్రియకు మీరు చేపట్టిన ముందస్తు చర్యలు?

మహేందర్ : నవంబరు నుంచి ధాన్యం కొనుగోలు చేపట్టిన క్రమంలో అక్టోబరు నుంచే ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకున్నాం. సమీక్షలు, రైతు వేదికల ద్వారా ఏఈవో లు రైతులతో సమావేశాలు నిర్వహించాం. ప్రతీ అంశంపై అవగాహన కల్పించాం. కేంద్రాల వద్ద రైతులకు కావాల్సిన వసతులు కల్పించాం. నిర్వహించారు. ఈ సారి కేంద్రాల వద్ద ప్యాడీ క్లీనర్స్ ఏర్పాటు చేశాం. ప్రతీ కేంద్రం వద్ద ధాన్యం నాణ్యతను పరిశీలించేందుకు ఏఈవోను నియమించాం. ఇక గన్నీ బ్యాగుల సమస్యలు కూడా తలెత్తకుండా ప్రతీ కేంద్రానికి ముందే 5 నుంచి 10 వేల వరకు సంచులు ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి : సీఎంఆర్ కేసుల క్రమంలో మిల్లులకు కేటాయింపు ఎలా?

మహేందర్ : జిల్లాలో మొత్తం 45 మిల్లులకు సీఎంఆర్ కింద ధాన్యం కేటాయింపు జరిగింది. ఈ సారి ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంకు గ్యారంటీ తీసుకొని ఇచ్చాం. మొత్తం ధాన్యం కొనుగోలు లక్ష్యం 1,50,000 మెట్రిక్ టన్నులు. ప్రస్తుతం 73 మెట్రిక్ టన్నలకు పైగా ధాన్యం కొనుగో లు జరిగింది. జనవరి వరకు కొనుగోలు ఉంటుంది.



సంద్ర మధుతో కేక్ కట్ చేయిస్తున్న రావు పద్మ, తదితర నాయకులు

ప్రతీ కార్యకర్తను కాపాడుకుంటాం

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

రాంనగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు జన్మదినం సందర్భంగా సోమవారం హంటర్‌రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చిన ఆమె.. మధుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి.. కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలను సంతోష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనువాస్, శ్రీకాంత్, సీనియర్ నాయకులు అరణ్యరెడ్డి, తిరుపతిరెడ్డి, సంపత్‌రెడ్డి, శ్రీకాంత్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంవీఐలుగా బండి శ్రావ్య, కీర్తి ఉదయ్



కీర్తి ఉదయ్ / బండి శ్రావ్య

వరంగల్ క్రైం, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ డీటీవో అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)లుగా బండి శ్రావ్య, కీర్తి ఉదయ్‌లు సోమవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (డీటీసీ) పుప్పాల శ్రీనువాస్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా విధుల్లో చేరిన ఇద్దరి ఏఎంవీఐలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో విధులు కేటాయించినట్లుగా డీటీసీ శ్రీనివాస్ తెలిపారు.

రేపు జాబ్‌మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఉపాధి కార్యాలయంలో బుధవారం ప్రైవేట్ సెక్టార్‌లో ట్రైనింగ్, ప్లేస్‌మెంట్‌కు జాబ్ మేళా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి ఉమారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ, బీటెక్, ఫార్మ, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ చేసి 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు గల ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 18వ తేదీన ఉదయం 10.30 గంటలకు ములుగురోడ్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7093168464 సెల్ నెంబరులో సంప్రదించాలని సూచించారు.

హామీ ఇచ్చే వరకు దీక్ష విరమించబోం

హన్మకొండ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు దీక్షలు విరమించేది లేదని సర్వశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం స్పష్టం చేసింది. హనుమకొండ ఏకశిలా పార్కు వద్ద గత వారం రోజులుగా చేస్తున్న దీక్షలను పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి సోమవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఎస్‌ఎ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్ దీక్షలకు మద్దతు తెలిపి పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఎస్‌ఎ ఉద్యోగులకు వేతనాలు పెంచకపోవటం వల్ల వెట్టిచాకిరికి గురువుతున్నారన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి ఎస్‌ఎ కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. ఎస్‌ఎ ఉద్యోగుల జాక్ చైర్మన్ దొనికెల శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం తమ సంఘ ప్రతినిధులను ఆహ్వానించి సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి మానవీయ కోణంలో పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డికి, ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి
కలెక్టరేట్ ఎదుట నాయకుల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాపై పోరాడాలని ఎంసీపీఐ (యు)జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి పిలుపునిచ్చారు. భారత మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ (ఐక్య), అఖిల భారత కార్మిక సంఘాల కేంద్ర, రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం ఎంసీపీఐ(యు)నాయకులు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ముందుగా సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు కార్మిక వ్యతిరేఖ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా వచ్చారు.

ఈ సందర్భంగా హంసారెడ్డి, ఏఐసీటీయూ జిల్లా కన్వీనర్ మొగిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ప్రజలను, రైతులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు విద్య, వైద్యం, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని లేదంటే రాబోయే రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు మాస్ సావిత్రి అధ్యక్షతన జరిగిన ధర్నాలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, నీల రవీందర్, కత్ర రాజిరెడ్డి, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షులు మంద భద్రయ్య, ఏఐసీటీయూ జిల్లా నాయకులు సంపత్, మొగిలి, పార్టీ సభ్యులు జ్యోతి, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంసీపీఐ(యు) నాయకులు

నిత్యం అందుబాటులో ఉండాలి

సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నిజాయితీతో పనిచేయాలని సీపీ అంబర్ కిషోర్ ఝా నల్లబెల్లి ఎస్సై గోవర్ధన్‌కు సూచిం చారు. ఇటీవలే ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై వి. గోవర్ధన్ సోమవారం సీపీని ఎస్సై మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి, వడ్డెపల్లి బండ్ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని బల్ది యా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం అధికారులతో కలిసి భద్రకాళి, వడ్డెపల్లి బండ్ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులపై అక్కడి అధికా రులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు శ్రీనివాస్, సంతోష్‌బాబు, డీఈ రవికిరణ్, స్మార్ట్‌సిటి సిబ్బంది పాల్గొన్నారు.

కాకతీ కదనభేరి పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ మెడికల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకతీ కదనభేరి పోస్ట ర్‌ను సోమవారం సీకేఎం ఆస్పత్రి, టీబీ ఆస్పత్రులలో టీఎస్‌సీపీఎస్‌యూ రాష్ట్ర సమన్వయ కర్త డాక్టర్ కొలిపాక వెంకటస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న ఏకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 22న వరంగల్ జిల్లా కేంద్రంలోని ఇస్లామియా గ్రౌండ్‌లో కాకతీ కదనభేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏకృత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, ఉద్యోగులకు సామాజిక భద్రత లేని పెన్షన్ విధానాన్ని వీడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్ సౌమ్యా, డాక్టర్ దీక్షిత్, ఉమారాణి, శ్రావ్య, పృథ్వీ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెంకటస్వామి

సత్ప్రవర్తనతో మంచి భవిష్యత్తు

ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు

హసన్‌పర్తి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్ప్రవర్తన కలిగి ఉంటేనే రౌడీషీటర్లకు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు అన్నారు. సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఏసీపీ తిరుమల్ సూచనలతో మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో సోమవారం రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలిసితెలియక చేసిన చిన్న చిన్న తప్పిదాలతో ఎంతో మంది జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారని అన్నారు. దీంతో కుటుంబాలు వీధిన పడి వారి పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని తెలిపారు. రౌడీషీటర్లు తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని సత్ప్రవర్తనతోనే జీవించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు దేవేందర్, శీలం రవి, సిద్దయ్య పోలీసు సిబ్బంది, వివిధ గ్రామాల రౌడీషీటర్లు పాల్గొన్నారు.

ఆకృతి అవెన్యూ అపార్ట్‌మెంట్ నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా తిరువరంగం ప్రభాకర్ నియామకం



టీ ప్రభాకర్

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న ఆకృతి అవెన్యూ అపార్ట్‌మెంట్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అపార్ట్‌మెంట్ నూతన అధ్యక్షుడిగా తిరువరంగం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా యుగేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా జగదీశ్వర్‌రెడ్డి, సంపత్‌రావు, కోశాధికారిగా శ్యాంసుందర్, సంయుక్త కార్యదర్శిగా శ్రీధర్, కార్యవర్గ సభ్యులుగా మధుసూదన్, శ్రీనివాస్, యాకయ్య, రవీందర్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కిషన్‌రావులు నియమి తులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్లాట్ ఓనర్స్‌కు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. అలాగే ప్లాట్ ఓనర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు.

కరుణాకర్‌కు బార్ ఘన నివాళి

వరంగల్ లీగల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ న్యాయవాది బొడ్డు కరుణాకర్ మృతికి హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ల ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన న్యాయవాది కరుణాకర్ 35 సంవత్సరాలుగా న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ధర్మసాగర్ ప్రాంతానికి చెందిన ఆయనకు ఒక కుమార్తె, భార్య ఉన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ హాల్‌లో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శులు ముదసిర్ అహ్మద్, లాదె రమేష్, బార్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ సిరికొండ సంజీవరావు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. అంతకు ముందు వరంగల్ జిల్లా జడ్జి నిర్మలగీతాంబ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు హాల్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అదనపు జిల్లా, సీనియర్, జూనియర్ జడ్జిలు పాల్గొన్నారు.

అప్రెంటిషిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఒకేషనల్ విద్యార్థులు గత మూడు సంవత్సరాలల్లో పారా మెడికల్ కోర్సులు (ఎంఎల్‌టీ), (ఎంపీహెచ్‌డబ్ల్యూ- స్త్రీలు) పూర్తి చేసుకున్న విద్యార్థులు అప్రెంటీస్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎ.గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని మిషన్ హాస్పిటల్, పీహెచ్‌సీ పరకాలలో మాత్రమే దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంజీఎం, సీకేఎం హాస్పిటల్‌లో దరఖాస్తు కోసం దరఖాస్తు చేసుకునే వారు వరంగల్ జిల్లా నోడల్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.



బోల్తా పడిన లారీ

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

ముగ్గురికి గాయాలు

మడికొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మొక్కలకు నీళ్లపోస్తున్న ట్రాక్టర్‌ను బొగ్గులోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొని ముగ్గురు వ్యక్తులకు గాయాలైన ఘటన కాజీపేట మండలం టేకులగూడెం రింగ్‌రోడ్డుపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ వైపు నుంచి ములుగు రోడ్ వైపుకు బొగ్గులోడ్‌తో వెళ్తున్న లారీ టేకులగూడెం గ్రామం వద్ద ఔటర్ రింగ్‌రోడ్డుపై డివైడర్ మధ్యలో ఉన్న చెట్లకు నీళ్లు పోస్తున్న వాటర్ ట్యాంకర్(ట్రాక్టర్) ను వెనుక నుంచి ఢీకొని రోడ్డుప్రక్కన బోల్తా పడింది. ప్రమాదంలో విజయవాడ, నందిగామకు చెందిన లారీ డ్రైవర్ వినయ్‌కు తీవ్ర గాయాలు కాగా, పంథినికి చెందిన టాక్టర్ డ్రైవర్ దేవేందర్‌కు, అదే గ్రామానికి చెందిన వాటర్‌మెన్ రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, పోలీసులు గాయపడిన వారిని 108లో ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్‌ఎస్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ ఎంపికలు సోమవారం ముగిశాయి. ఈ ఎంపిక పోటీల ముగింపు కార్యక్రమానికి అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి హాజరై మాట్లాడారు.

అండర్-16, 18, 20 బాలబాలికల, మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో నిర్వహించిన హనుమకొండ జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఎంపికలో 100 మంది అథ్లెట్లు పాల్గొనడం జరిగిందన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుంట్ల మండల కేం ద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్ శ్రీమన్నారాయణ, పీడీలు కృష్ణమూర్తి, రజనీకాంత్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ వేతనం, కోడిగుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట 48 గంటల ధర్నాకు కూర్చున్నారు. కలెక్టరేట్ మెయిన్ గేటుకు అడ్డంగా కూర్చుని ధర్నా చేస్తుండటంతో సుబేదారి పోలీసులు మధ్యాహ్న భోజన కార్మికులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ నడిగొండ రజిత మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పు చేసి ప్రభుత్వా నికి ఎదురు పెట్టుబడి పెట్టి పిల్లలకు వంట చేసి పెడుతుండటంతో కార్మికులు అప్పులపాలవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పం దించి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సాయంత్రం కార్మికులను పోలీసులు వదిలి పెట్టారు. ధర్నాలో కార్మి కుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి. సమ్మక్క, సరిత, శాంత, పర్వీన్, కవిత, ప్రేమలత, సంధ్య, లక్ష్మీ, సక్కుబాయి, రాధ, శ్రీలత, రేణుక, కొమురమ్మ, కవిత, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

సమాజానికి బౌద్ధమే దిక్సూచి

బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పరంధాములు

వడ్డెపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజానికి బౌద్ధమే దిక్సూచి అని బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు జి. పరంధాములు అన్నారు. సోమవారం హనుమకొండలోని బీఎస్ఐ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. సుదర్శనం అధ్యక్షతన నిర్వహించిన వరంగల్ ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వర్తమాన సమాజానికి బుద్ధుడి బోధనలు అనుసరణీయమని పేర్కొన్నారు. బౌద్ధాన్ని విశ్వవ్యాప్తం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీఎస్ఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మల్ల అంబేద్కర్, డాక్టర్ కాయిత వెంకటి, సీహెచ్. కొమ్మాలు, బి.సారయ్యలు పాల్గొన్నారు.

బీఎస్ఐ జిల్లా కమిటీ ఎన్నిక

బీఎస్ఐ హనుమకొండ జిల్లా కమిటీకి రాష్ట్ర అధ్యక్షుడు జి. పరంధాములు నియామక పత్రాలను అందజేశారు. హనుమకొం డ జిల్లా అధ్యక్షుడిగా పి. కృష్ణస్వామి, ఉపాధ్యక్షులుగా కె.లక్ష్మీతులసి, పద్మ, కార్యదర్శిగా పి. సాంబయ్య, కోశాధికారిగా జె. కిషన్‌లను నియమించారు.

ఎన్నికల్లో రవీందర్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాక్టో అభ్యర్థి పూల రవీందర్ గెలుపు ఖాయమని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సోమవారం పూల రవీందర్‌తో కలిసి విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూల రవీందర్ ఉపాధ్యాయ పక్షపాతి, సమస్యలపై స్పష్టమైన అవగాహన కలిగిన వ్యక్తి అన్నారు. ఎమ్మెల్సీగా చేసిన కాలంలో ఎన్నో డిమాండ్ల పరిష్కారం చేసిన నిజమైన నాయకుడని, ఉపాధ్యాయుల మద్దతుతో మరోసారి ఎమ్మెల్సీ కావడం ఖాయమన్నారు. పూల రవీందర్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దుకే మొదటి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య, హనుమకొండ జిల్లాప్రధాన కార్యదర్శి వి.రాంబాబు, రాధాకృష్ణ, బాబురావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కేదాసి మోహన్‌కు అంబేద్కర్ అవార్డు

బాలసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు -2024 సంవత్సరానికి గాను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్‌కు లభించింది. ఈ నెల 15న దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ ఆడిటోరియంలో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ సమావేశంలో బీఎస్పీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా మోహన్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ ఈ అవార్డుకు తనను ఎంపిక చేసినందుకు బీఎస్పీ జాతీయ అధ్యక్షుడు, ఎంపిక కమిటీ సభ్యులు గుర్రాల శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కాజీపేట రైల్వే ఎస్సైగా నాగరాజు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై నాగరాజు

కాజీపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే ఎస్సైగా తోట నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతకు ముందు ఖమ్మం జిల్లాలో లా అండ్ ఆర్డర్ ఎస్సైగా పనిచేసి కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఉన్నత ఆలోచనలే భవిష్యత్‌కు పునాది

హనుమకొండ సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్

హసన్‌పర్తి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంస్కారవంతమైన విద్యతోనే సమసమాజ నిర్మాణం సాధ్యమని హనుమకొండ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కజాంపురం దామోదర్ అన్నారు. మండలంలోని చింతగట్టు క్యాంపు కస్తూర్బా గాంధీ విద్యాలయం హసన్‌పర్తిలో సోమవారం ఏర్పాటు చేసిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకు తామే నిర్మాతలని వారి ఉన్నతమైన ఆలోచనలతోనే భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. పేదవర్గాల నుంచి వచ్చిన వారందరూ క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో కాలాన్ని సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ జనార్దన్, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, సంస్థ సభ్యులు మార్క రవిందర్‌గౌడ్, తాడూరు లక్ష్మీనారాయణ, మలహల్‌రావు, అధ్యాపక సిబ్బంది టి.హెలెన్, బి.మమత, డి.అరుణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

వరంగల్ మెడికల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ పీహెచ్‌సీని సోమవారం హనుమకొండ డీఎంహెచ్‌వో ఎ.అప్పయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలోని ల్యాబ్, ఫార్మసీ, థియేటర్, వార్డు రూము, ఓపీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలకు ముస్తాబు చేస్తున్న జేఎన్‌ఎస్ క్రీడా మైదానం



క్రీడా పండుగకు వేళాయే..

- నేటి నుంచి 19 వరకు జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు
- జేఎన్‌ఎస్ క్రీడా మైదానం ముస్తాబు

క్రీడాకారులకు అన్ని సౌకర్యాలను సమకూర్చాం..

గుగులోత్ అశోక్‌కుమార్, హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో

జేఎన్‌ఎస్‌లో 17 నుంచి 19 వరకు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంతో పాటు ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు అన్ని విధాల సౌకర్యాలను సిద్ధం చేశాం. ఇప్పటికే గ్రామ, మండల స్థాయిల్లో జిల్లా వ్యాప్తంగా పలు విధాల పోటీలు నిర్వహించి అక్కడ మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కబనర్చిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరిగింది. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలకు ఎంపిక చేయడం జరిగింది. మూడు రోజుల పాటుగా పండుగ వాతావరణంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగింది. క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నాం.



అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 16: (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో క్రీడలను ప్రోత్సహించడంతో పాటు గ్రామాల్లోని ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికి తీసీ ఒలంపిక్స్ స్థాయికి తీసుకపోవడమే లక్ష్యంగా సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ 2024 జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు హనుమకొండ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ నెల 17 నుంచి 19 వరకు 20 క్రీడాంశాలతో పాటు 16 క్రీడల్లో ఎంపిక పోటీలను నిర్వహించబోతున్నారు. మూడంచెలుగా పోటీలను విభజించి తొలుత గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో ఇప్పటికే పోటీలు నిర్వహించి జిల్లా స్థాయిలో పాల్గొనేందుకు క్రీడాకా రులను ఎంపిక చేశారు. 35 క్రీండాంశాలలో పోటీలు నిర్వహస్తారు.

వనప్రేమికుడు.. సమ్మయ్య

మొక్కలు నాటడం, సంరక్షణే ఆయన ధ్యేయం

- గోపాలమిత్రగా విధులు.. 25ఏళ్లుగా పర్యావరణ సేవలు
- 35వేలకు పైగా మొక్కలు నాటించి ప్రత్యేక గుర్తింపు


మాజీ మంత్రి సత్యవతి, నూతన వధు వరులతో మొక్కలు నాటిస్తూ (ఫైల్)


ద్విచక్ర వాహనంపై మొక్కతో సమ్మయ్య

ఆదర్శం

నెక్కొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వృక్ష సంపదే ఆయన ప్రాణం.. అందుకు గాను ఎలాంటి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమం జరిగిన అక్కడికి వచ్చే ముఖ్య అతిథులచే మొక్కలు నాటిస్తుతుంటారు వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామానికి చెందిన నల్గొండ సమ్మయ్య. ఓ వైపు గోపాలమిత్రగా విధులను నిర్వహిస్తూనే.. 25 ఏళ్లుగా వరంగల్ జిల్లాలో పర్యావరణ పరిక్షణకు కృషి చేస్తూ వనప్రేమికుడిగా గుర్తింపుపొందారు. ఇప్పటి వరకు 35వేలకు పైగా మొక్కలు నాటించిన ఆయన వాటి సంరక్షణకు కూడా చర్యలు తీసుకునేలా కృషి చేస్తుంటారు. తొలుత నర్సంపేట డివిజన్‌లో.. తరువాత వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటడం ప్రారంభించిన సమ్మయ్య పలు సందర్భాల్లో హైదరాబ్యాద్‌లో జరిగిన కార్యక్రమాల్లోనూ పాల్గొని మొక్కలను నాటాడు. సకల జీవ రాశుల సంక్షేమానికి, కాలుష్య నివారణకు చెట్టు ముఖ్యమనే నినాదంతో ఆయన ఎక్కడ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలు జరిగినా ఆ ప్రాంతాలకు వెళ్లి ప్రముఖులతో మొక్కలు నాటించడం అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు పలువురు ప్రముఖుల నుంచి సత్కారాలు అందుకున్నారు.

పుట్టినరోజులు.. పెళ్లిరోజుల్లో..

ముఖ్యమైన రాజకీయ నేతల, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు మొదలు మండలస్థాయిలో ఉన్న ముఖ్యమైన వ్యక్తుల పుట్టిన రోజులు, పెళ్లి రోజులను గుర్తుంచుకొని ఆ రోజున వారితో మొక్కలు నాటిస్తుంటారు సమ్మయ్య. అలాగే జాతీయ నాయకుల వర్ధంతి, జయంతుల సందర్భంగా కూడా ఈ కార్యక్రమాలు చేపడుతుంటారు. నాటిన మొక్కలను ఎదిగే వరకు సంరక్షించేందుకు వాటి చుట్టు కంచెలను కూడా ఏర్పాటు చేస్తుంటారు. తనకు వెళ్లేందుకు కుదరకపోతే సదరు ప్రముఖులకు ఫోన్లు చేసి మొక్కలను నాటాలని, సంరక్షించాలని కోరుతుంటారు. సమ్మయ్య నర్సంపేట డివిజన్‌లో నివి విధ గ్రామాల్లో వృత్తి పరంగా గ్రామాలు తిరుగుతూ పశువులకు వైద్య సేవలను అంది స్తుండటమే కాకుండా గ్రామాల్లో నాటిన మొక్కలకు రక్షణ కల్పించి వాటిని వృక్షాలుగా ఎదిగే వరకూ శ్రవిస్తూటాడు.

పలు అవార్డులు అందుకున్న సమ్మయ్య

వన ప్రేమికుడిగా గుర్తింపు పొందిన సమ్మయ్య గ్రీన్ ఇండియా చాలెంజ్, జీవ వైవిధ్య జాతీయ మహానంది అవార్డు, జై భీమ్ ఫౌండేషన్ పురస్కార్, సోషల్ వర్కర్ ప్రశంసా పత్రం అందుకున్నారు.

ప్రభుత్వం సహకరిస్తే లక్షల్లో మొక్కలు నాటుతా..



మొక్కలు నాటడమే లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ దాదాపు 35వేల మొక్కలు నాటగా, వందల సంఖ్యలో మహావృక్షాలుగా ఎదిగాయి. అయితే 2025 వరకూ 60వేల మొక్కలు నాటుతాను. ప్రభుత్వం తన సేవలను గుర్తించి ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందిస్తే లక్షల మొక్కలు నాటుతాను.

\- నల్గొండ సమ్మయ్య



సమ్మయ్యను నెక్కొండ పోలీసు స్టేషన్‌లో సన్మానిస్తున్న ఏసీపీ తిరుమల్ (ఫైల్)


నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో మొక్కలు నాటిస్తున్న సమ్మయ్య (ఫైల్)

జలేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

రెడ్డికాలనీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మార్గశిర ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం హనుమకొండ కాకాజీ కాలనీలోని జలేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


పెద్ద కోవెలలో తిరుప్పావై పాశురాలు చదువుతున్న మహిళలు

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

- వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పర్వం ఆరంభం
- జోరుగా తిరుప్పావై ప్రవచనాలు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వైష్ణవ ఆలయాల్లో సోమవారం ఉదయం నుంచి ధనుర్మాస వేడుకలు ప్రారం భమైయ్యాయి. అండాల్ తల్లి అయిన గోదాదేవిని స్తుతిస్తూ గానం చేస్తున్న తిరుప్పావై పాశురాలతో ఆలయాల్లో తెల్లవారు జామునుంచే ఆధ్యాత్మిక శోభ ప్రారంభమైంది. సూర్యోదయానికి ముందే భక్తులు ముఖ్యంగా మహిళలు ఆలయాలకు చేరుకొని ధనుర్మాస వ్రతసేవల్లో పాల్గొంటూ రోజుకొక్కటి చొప్పున తిరుప్పావై పాశురాలను అను సంధానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో హనుమ కొండ రెడ్డికాలనీలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో కలకుంట్ల శ్రీనివాసాచార్య తిరుప్పావై ప్రవచనాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ జరిగిన తిరుప్పావై ప్రారంభ వేడుకల్లో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు, సంస్కృత పండితుడు శఠగోపాచార్య, వనం లక్ష్మీకాంతా రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శఠగోపాచార్య మా ట్లాడుతూ పరమ పవిత్రమైన గోదా చరితను శ్రీ వ్రతం పేరిట భక్తి శ్రద్ధలతో నెల రోజులపాటు వ్రతాన్ని ఆచరిస్తే సకల సుఖాలు కలు గుతాయని కోరిన కోరికలు తీరుతాయని శఠగోపాచార్య వ్యాఖ్యానిం చారు. గోదాదేవి ఐదువేల ఏళ్ల కింద తాను ఆచరించి లోకానికి అందించిన 30 పాశురాలే నెల రోజుల తిరుప్పావై పద్యాలని ఆయన చెప్పారు. హనుమకొండ రాగన్నదర్వాజలోని శ్రీ గోదా రంగనాయక ఆలయంలో వైభవంగా ధనుర్మాస వేడుకలు ప్రారంభమైయ్యాయి. ఆల య అర్చకులు కలకోట రాఘవచార్య, నర్సింహాచార్య ఆధ్వర్యంలోజరిగిన ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ చిన్నకోవెలలో ప్రధాన అర్చకులు చెరుకుపల్లి శ్రీనివాసాచార్య, ఏకశిలా పార్కు అభయాంజనేయస్వామి ఆలయంలో డింగరి శ్రీనివాసాచార్య, రెవెన్యూ రామాలయంలో శ్రీకాం తాచార్య, విఎదిల నగర్ బాలసముద్రం కోదండ రామాలయంలో తిరుమలచార్య, ఏటూ జడ్ వెంకటేశ్వరాలయంలో దేశికన్ స్వామి, దోనగుట్ట లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో పరాంకుశం గిరిధర్‌కృష్ణ, ఎన్‌జీవోస్ కాలనీలో వాసుదేవచార్య, తిరుప్పావై పాశురాలను భక్తులచే అనుసంధానం చేయించారు.


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వేయిస్తంభాల ఆలయంలో

ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో మార్గశిర మాసంలో ధనుర్మాస వేడుకలు శివప్రీతికర సోమవారం ఇక్కడ లాంఛనంగా ప్రారంభించారు. శాస్త్రానుసారం శివకేశవులను ప్రీతికరమైన మాసం ధనుర్మాసమని ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. ఈ సందర్భంగా ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని పరమశివునికి లక్ష మారేడుదళాలతో ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో వెంటకయ్య పర్యవేక్షించారు.

లక్ష్మీప్రియకు జాతీయ అవార్డు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో అభినయ నృత్యభారతి ఈ నెల 13 నుంచి మూడు రోజులపాటు నిర్వహించిన 29వ జాతీయ నృత్య పోటీల్లో హనుమకొండకు చెందిన పెండ్యాల లక్ష్మీప్రియ జాతీయస్థాయిలో ప్రథమ బహుమతితోపాటు నృత్య కౌముది, బెస్ట్ యూత్ క్లాసికల్ అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా ఆమె గురువు బోంపెల్లి సుధీర్‌రావు, లక్ష్మీప్రియను ప్రత్యేకంగా అభినందించారు. ఈమెతోపాటు సుధీర్‌రావు మరో శిష్యురాలు ఆరాధరెడ్డి కూడా జూనియర్ విభాగంలో నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి సాధించడం విశేషం.


నృత్య విజేతలను అభినందిస్తున్న నాట్యాచారుడు సుధీర్‌రావు

భూమిలేని పేదలెందరో?

(5వ పేజీ తరువాయి)

ఈ నెల 28వ తేదీన అందిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో వ్యవసాయ కూలీల్లో హర్షం వ్యక్తమవుతోంది.

రూ.12వేల సాయానికి అర్హులెవరు?

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల హామీల్లో వ్యవసాయ కూలీలకు రూ.12వేల ఆర్థిక సాయం ఉంది. దీన్ని ప్రస్తుతం అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో వ్యవసాయ కూలీలకు ఆర్థికసాయంపై ప్రభుత్వం ప్రకటన కూడా చేయనుంది. అయితే భూమిలేని పేదలను గుర్తించేందుకు ప్రభుత్వం దేనిని ప్రామాణికంగా తీసుకుంటుందనేది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కూలీలను గుర్తించేందుకు ఏ ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వే నిర్వహించలేదు. 2014లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఇప్పటి వరకు బయటకు రాలేదు. ఆ రిపోర్టులు ఎక్కడ ఉన్నాయో కూడా ఎవరికి తెలియదు. ఇక ఇటీవల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో చాలా మంది వాస్తవ వివరాలతో నివేదికలు ఇవ్వలేదనే చర్చ జరుగుతోంది. ఈ రెండు సర్వేల్లో కూడా ప్రత్యేకంగా వ్యవసాయ కూలీలను గుర్తించే కాలం లేదు. ఇక ఉపాధి హామీ జాబ్‌కార్డులను ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉందా అనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 7.35లక్షల ఉపాధి హామీ జాబ్‌కార్డులున్నాయి. అయితే ఈ కార్డు ఉన్నవారిలో చాలా మందికి ఎంతో కొంత భూమి కూడా ఉంది. ప్రభుత్వం గుంట భూమి ఉన్న కూడా రైతు భరోసా ఇస్తుంది. ఈ పరిస్థితుల్లో జాబ్‌కార్డు ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయటం సాధ్యం కాదనే టాక్ వినబడుతుంది. దీంతో రూ.12వేల ఆర్థిక సాయానికి అర్హులు ఎవరనేది ఆసక్తికరంగా మారింది. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులకు చివరి సారిగా 2023-24యాసంగిలో రైతు భరోసా డబ్బులు జమయ్యాయి. జాబ్‌కార్డుదారులకంటే రైతు భరోసా తీసుకుంటున్న రైతులే ఎక్కువగా ఉన్నారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 4లక్షల నుంచి 5లక్షల మంది భూమిలేని పేదలుండే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రైతు సర్కారు గ్యారంటీ..

ప్రభుత్వం భూమిలేని పేదలకు రూ.12వేల సాయాన్ని అందించేందుకు కసరత్తు చేస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సుమారు రూ.600కోట్లు కేటాయించాల్సి ఉంటుందని అంచనా. ఉమ్మడి జిల్లాలో 4లక్షల నుంచి 5లక్షల వరకు వ్యవసాయ కూలీలు ఉండగా, ఒక్కొక్కరికి రూ.12వేల చొప్పున రూ.480కోట్ల నుంచి రూ.600కోట్ల వరకు ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా రెండు విడతల్లో 2,08,077 రైతు ఖాతాలకు సంబంధించి రూ.1,506.50కోట్ల రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేసింది. అలాగే 2023-24లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులకు గత యాసంగిలో రైతుభరోసా సాయం కింద రూ.907.98కోట్ల అందించింది. రైతుభరోసాను సంక్రాంతి నుంచి రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంచుతుండటంతో ఈ సాయం రూ.15వేల కోట్లకు పెరగనుంది. ప్రతీ ఏటా రైతు భరోసా, భూమిలేని పేదలకు ఇచ్చే సాయం కలిపి సుమారు రూ.30వేల కోట్ల వరకు రైతులకు ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే వ్యవసాయ కూలీలకు అందించే సాయం మాత్రం రుణమాఫీ తరహాలో కాకుండా అర్హులైన ప్రతీ పేదకు ప్రభుత్వం అందించే రూ.12వేల ఆర్థిక సాయం అందాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీంతో అర్హుల ఎంపిక కూడా రాజకీయ విమర్శలు లేకుండా పారదర్శకంగా ఉండాలని, అర్హుల్లో ఒక్కరికి కూడా అన్యాయం జరుగకుండా ఎంపిక ప్రక్రియ ఉండాలని ప్రభుత్వం భావిస్తుందని సమాచారం.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

50 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు

ఘనంగా కేఎంసీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వరంగల్ మెడికల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వీరంతా కాకతీయ వైద్య కళాశాలలో 1974వ సంవత్సరంలో వైద్యవిద్యనభ్యసించిన వారు. ప్రస్తుతం ప్రస్తుతం వారంతా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అనేక మంది వైద్య రంగంలో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. తాము ఇక్కడ చదువుకుని 50ఏళ్లయిన నేపథ్యంలో ఒక్కచోట కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కాలేజీ క్యాంప్‌లోని ఎన్‌ఆర్‌ఐ హాలులో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వరంగల్‌తోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు హాజరయ్యారు. నాడు తాము చదువుకున్న క్లాస్ రూములు, ల్యాబ్‌లను, చెంబీలు, కుర్చీలను చూసి నాటి అనుభూతులను నెమరువేసు కున్నారు. మున్ముందు పూర్వ విద్యార్థులకుగా తాము కళాశాల అభివృద్ధికి సహకరించాలని నిర్ణయించుకున్నారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ పోల నటరాజ్, డాక్టర్ కె.తిరుపతిరెడ్డి, డాక్టర్ ఎ.రవీంద్ర, డాక్టర్ కె.ప్రదీప్‌రెడ్డి ఏర్పాట్లు చేయగా ఈ కార్యక్రమంలో అప్పటి గురువులు డాక్టర్ పి.నరసింహారెడ్డి, డాక్టర్ శేఖర్‌రెడ్డి, డాక్టర్ బుచ్చిరెడ్డి, డాక్టర్ క్రాంతి రావు, డాక్టర్ దామోదర్ కౌశిక్, డాక్టర్ శశికుమార్, డాక్టర్ ఏకనాథం పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

- రంగశాయిపేటలో శబరిమలైని తలపించేలా పడిపూజ
- భక్తులతో కిక్కిరిసిన బీరన్న ఆలయం..


రంగశాయిపేటలో అయ్యప్ప పడిపూజ దృశ్యాలు

శంభునిపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ అయ్యప్ప నామస్మరణతో రంగశాయిపేట మార్మోగింది. రంగశాయిపేట, శంభునిపేట అయ్యప్ప సేవా పరపతి సంఘం ఆధ్వర్యంలో రంగశాయిపేటలో గల ప్రసిద్ధ బీరన్న ఆలయంలో సోమవారం అయ్యప్ప మహాపడి పూజ వైభవంగా నిర్వహించారు. ముందుగా రామాలయం నుంచి గురుస్వామి కంచ మల్లయ్య అయ్యప్ప విగ్రహాన్ని ఎత్తుకొని కురుమ కులస్థుల డోలువాయిద్యాలతో శోభాయాత్రగా బీరన్న ఆలయానికి చేరుకున్నారు. గురుస్వామి వెలిదె ప్రదీప్ శాస్త్రి చేతుల మీదుగా అభిషేకాలు నిర్వహించారు. 18 మెట్లపై ఆసీనులైన జ్యోతి స్వరూపిడికి పడులు వెలుగిస్తూ హారతి ఇచ్చారు. నారికేళ గురుస్వామి కళాకారులు కొల్లూరి యోగానంద్ తన పాటలతో బీరన్న ఆలయ ప్రాంగణాన్ని ఉర్రూతలూగించారు. శబరిమలైని తలపించేలా నిర్వహించిన ఈ పడి పూలో సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి, కర్నె రవీందర్, గురుస్వాములు కొల్లూరి యోగానంద్‌తో పాటు బజ్జూరి వీరేశం, కత్తి ఎల్లగౌడ్, అనుమాండ్ల రమేష్, గుండ్రాతి కుమార్, పాల రంజిత్, శేర్ల అనిల్ కుమార్, కొండ్రెడ్డి నవీన్ రెడ్డి, కుంట శ్రీధర్, అడుప వేణు, కంచ మల్లయ్య, శెంకేశి శ్రీనివాస మూర్తి, బజ్జూరి ప్రభాకర్, సుధాకర్, దయాకర్, దామెరకొండ కర్ణాకర్, కత్తెరపల్లి వేణు, బొల్లెపల్లి సుదర్శన్, రాజశేఖర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


డోలు వాయిద్యాలతో అయ్యప్ప స్వామిని తీసుకువస్తున్న కురుమ కళాకారులు

కలెక్టర్ సారు.. ఆటలాడారు



సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడోత్సవాల్లో భాగంగా సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ప్రారంభ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా జ్యోతి ప్రజ్వలన చేసి, జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులతో మమేకమై.. వారితో కలిసి వాలీబాల్, షటిల్, క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనడమే మొదటి విజయమని, విద్యకు ప్రాధాన్యమిస్తూనే క్రీడల్లో రాణించాలని సూచించారు. విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని, మండల, గ్రామ స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి వచ్చిన క్రీడాకారులు అదే ఉత్సాహంతో రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, యువజన మరియు క్రీడల జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

\- జనగామ రూరల్ ఆంధ్రజ్యోతి



గౌరారం వాగులో పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

తాడ్వాయి అడవుల్లోకి పెద్దపులి

భద్రాద్రి జిల్లా వైపు నుంచి మళ్లీ రాక

తాడ్వాయి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ములుగు-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు అడవుల్లో పెద్దపులి సంచారం భయభ్రాంతులకు గురిచేస్తోంది. మూడు రోజుల క్రితం తాడ్వాయి మండలం పంబాపూర్ అడవుల నుంచి పక్కనే ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం రఘునాథపాలెం అడవిలోకి ప్రవేశించిన పులి రెండు రోజులు అక్కడే సంచరించింది. సోమవారం మళ్లీ మండలంలోని కాటన్నర్సాపూర్ అడవుల్లోకి వచ్చినట్టు నిర్ధారణైంది. ఇక్కడి గౌరారం వాగులో పులి పాద ముద్రలను గుర్తించినట్టు అటవీ శాఖ రేంజ్ అధికారి సత్తయ్య తెలిపారు. మగపులి తోడు కోసం ఛత్తీస్‌గడ్ అడవుల నుంచి ఓ ఆడపులి వచ్చిందని చెబుతున్న అధికారులు దాని కదలికలను ట్రాక్ చేస్తున్నారు.

మంగపేట, కరకగూడెం, గుండాల, తాడ్వాయి అడవులు కలిసి ఉండగా ఐదు రోజులుగా ఇక్కడిక్కడే సంచరిస్తుండటంతో సమీప గ్రామాలు, ఆదివాసీ గూడాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ ఉత్పత్తుల సేకరణ, పశువుల మేత కోసం అడవుల్లోకి ప్రజలను వెళ్లకుండా నియంత్రిస్తున్న అధికారులు పులి సంచార సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు.



ఎవరైనా అకస్మాత్తుగా కుప్పకూలిపోతే గుండెపోటుగా భావించి, హుటాహుటిన ఆస్పత్రికి తరలిస్తూ ఉంటాం. అయితే గుండెలో తలెత్తే కొన్ని ఇబ్బందులకు తక్షణ చికిత్స అవసరమవుతుంది. అలాంటిదే.. సడెన్ కార్డియాక్ అరెస్ట్. హఠాత్తుగా గుండె ఆగిపోయే ఈ అత్యవసర స్థితి, సడెన్ కార్డియాక్ డెత్‌కు దారి తీయకుండా ఉండకుండా తక్షణమే ఎలా స్పందించాలో, ఆ సమయంలో సిపిఆర్ ఎలా కీలకంగా మారుతుందో వైద్యులు వివరిస్తున్నారు.

ఎఇడి అత్యవసరం

“అపార్ట్‌మెంట్లలో, ఇతరత్రా నివాస సముదాయాల్లో ఎఇడిలను అందుబాటులో ఉంచుకోవాలి. 80 వేల నుంచి లక్ష రూపాయల ధర పలికే ఎఇడిలతో అంతకంటే ఎంతో విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చు. కాబట్టి ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల మాదిరిగానే ఎఇడిలకు కూడా నివాస సముదాయాల్లో స్థానం కల్పిస్తే, అత్యవసర సందర్భాల్లో ప్రాణ రక్షణకు ఇవి తోడ్పడతాయి. వీటిని అందుబాటులో ఉంచుకోవడంతో పాటు వాటి వాడకం నేర్చుకుని, బ్యాటరీలను సరి చూసుకుంటూ జాగ్రత్తగా నిర్వహించుకుంటూ ఉండాలి.”

తక్షణ చికిత్స

గుండెకు గండం లేకుండా...

అప్పటివరకూ చలాకీగా, ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు టక్కున కుప్పకూలిపోయి చనిపోతున్న సందర్భాలను చూస్తున్నాం. ఏం జరిగిందో అర్థం చేసుకుని, ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు పోతున్న సందర్భాలు కూడా కోకొల్లలు. ఇలా కుప్పకూలిపోడానికి గుండెపోటు కారణమై ఉంటుందనే అవగాహన మనందరికీ ఉంటోంది. కానీ గుండెపోటుతో పాటు, హఠాత్తుగా గుండె ఆగిపోయే సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు గురైనప్పుడు కూడా ఇలాగే కుప్పకూలిపోతూ ఉంటారు. ఇలాంటప్పుడు క్షణాల వ్యవధిలో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఏమాత్రం తాత్సారం చేయకుండా, తక్షణమే సిపిఆర్‌తో గుండె కొట్టుకునేలా చేసి, ఆ తర్వాతే ఆస్పత్రికి తరలించవలసి ఉంటుంది.

సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు గుండె జబ్బులు ప్రధాన కారణం. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో అవరోధాల వల్ల, గుండె కండరం జబ్బు పడడం వల్ల.. ఇలా గుండె, సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు గురి అవడానికి ఎన్నో కారణాలుంటాయి. గుండెపోటుకు గురైన ప్రతి సందర్భంలో గుండె ఆగిపోయే పరిస్థితి తలెత్తకపోవచ్చు. ఛాతీ నొప్పి, ఆయాసం లాంటి లక్షణాలతో గుండెపోటుకు గురైతే ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకునే సమయం ఉంటుంది. కానీ తీవ్రమైన గుండెపోటుకు గురైన సందర్భాల్లో సడెన్ కార్డియాక్ అరెస్ట్ అనే ప్రమాదకరమైన పరిస్థితి తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ పరిస్థితి అకస్మాత్తుగా తలెత్తుతూ ఉంటుంది. స్నేహితులతో సరదాగా కాలక్షేపం చేస్తున్న సందర్భంలో లేదా పార్కులో నడుస్తున్న సమయంలో.. ఇలా ఎప్పుడైనా, ఎక్కడైనా ఈ పరిస్థితి తలెత్తవచ్చు. ఇలాంటప్పుడు కొన్ని నిమిషాల్లోపే గుండెను కొట్టుకునేలా చేయకపోతే, రక్తస్రావం జరగక మెదడు దెబ్బతింటుంది. కాబట్టి తక్షణమే స్పందించాలి. అంబులెన్స్ వచ్చేవరకూ, ప్రాణాలు పోకుండా సదరు వ్యక్తిని కాపాడుకోవాలంటే, వెంటనే సిపిఆర్ మొదలుపెట్టి గుండె కొట్టుకునేలా చేయాలి.



సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తిని బ్రతికించే అవకాశాలు 10 శాతం కంటే తక్కువ. ఈ సమస్యకు గురైన వ్యక్తికి చికిత్సను అందించడం కోసం, అంబులెన్స్ వచ్చేవరకూ ఆలస్యం చేయడం ప్రమాదకరం. సడెన్ కార్డియాక్ అరెస్టులు సడెన్ కార్డియాక్ డెత్స్‌గా పరిణవిస్తున్న సందర్భాలు మన దేశంతో పాటు, అత్యంత వేగంగా అంబులెన్స్ సేవలు అందే విదేశాల్లోనూ పెరిగిపోతున్నాయి. ఇందుకు కారణం తక్షణ సిపిఆర్ అందకపోవడమే! కాబట్టి సడెన్ కార్డియాక్ అరెస్ట్‌ను కచ్చితంగా నిర్ధారించుకోవడంతో పాటు, సత్వరమే సిపిఆర్ మొదలుపెట్టడం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. సాధారణ కారణాల వల్ల స్పృహ కోల్పోయిన వ్యక్తిలో శ్వాస ఆడుతూ ఉంటుంది, నాడి కొట్టుకుంటూ ఉంటుంది. కానీ సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వాళ్లలో ఈ రెండు లక్షణాలూ ఉండవు. కాబట్టి శ్వాసను నిర్ధారించుకోవడం కోసం ముక్కు దగ్గర వేలిని ఉంచి పరీక్షించాలి. నాడిని నిర్ధారించుకోవడం కోసం మణికట్టుకు బదులుగా మెడ దగ్గర పరీక్షించాలి.

ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్

కార్డియో పల్మనరీ రిససిటేషన్ అనే ఈ ప్రక్రియ గురించి మనందరికీ ఎంతో కొంత అవగాహన ఉంటోంది. అరచేతులు కలిపి ఛాతీ దగ్గర నొక్కే ఈ ప్రక్రియతో ఆగిన గుండె కొట్టుకోవడం మొదలుపెట్టే అవకాశాలుంటాయి. కాబట్టి వీలైనంత త్వరగా సిపిఆర్ మొదలుపెట్టాలి.

ఇలా స్పందించాలి

గుండె పోటు లేదా కార్డియాక్ అరెస్ట్‌తో కుప్పకూలిపోయినప్పుడు చుట్టూ ఉన్న వాళ్లు రకరకాలుగా స్పందిస్తూ ఉంటారు. కొందరు లేపి కూర్చోబెట్టే ప్రయత్నం చేస్తారు. ఇంకొందరు బలవంతంగా నీళ్లు తాగించే ప్రయత్నం చేస్తారు. కానీ ఇలాంటి సందర్భాల్లో చుట్టుపక్కల వాళ్లు ఎలా స్పందించాలంటే...

- మెడ దగ్గర పల్స్, ముక్కు దగ్గర శ్వాసలను పరీక్షించాలి
- చదునైన ఉపరితలం మీద పడుకోబెట్టి సిపిఆర్ మొదలుపెట్టాలి
- సిపిఆర్ చేస్తూనే అంబులెన్స్‌కు కబురు పెట్టాలి
- అవసరాన్ని బట్టి ఎఇడి ఉపయోగించాలి
- నీళ్లు తాగించే ప్రయత్నం చేయకూడదు
- శరీరాన్ని ఎక్కువగా కదిలించకూడదు.

అయితే సిపిఆర్ చేయడమెలాగో తెలిసినా, దాన్ని సక్రమంగా చేయడమెలాగో తెలిసి ఉండాలి. అందుకోసం ప్రస్తుతం ఆస్పత్రుల్లో 'హార్ట్ సేవర్స్' పేరుతో సిపిఆర్ శిక్షణా కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్ (ఎఇడి) అనే పరికరం వాడకం కూడా తెలుసుకుని ఉండాలి. ఈ పరికరం హృదయ స్పందన ఆధారంగా గుండె పరిస్థితిని అంచనా వేసి, సక్రమంగా స్పందించేలా ఎలక్ట్రిక్ షాక్‌ను విడుదల చేస్తుంది. సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తులకు సిపిఆర్ అందిస్తూనే, ఎఇడి పరికరాన్ని కూడా ఉపయోగించగలిగితే ఫలితం మరింత మెరుగ్గా ఉంటుంది. కాబట్టి అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్, సినిమా హాళ్లు.. ఇలా వీలున్న ప్రతి చోటా ఈ పరికరాన్ని అందుబాటులో ఉంచాలి. అగ్నిప్రమాదాల కోసం ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్ అందుబాటులో ఉంచుకున్న విధంగానే, ఎఇడి పరికరాలను కూడా అందుబాటులో ఉంచుకోగలిగితే సడెన్ కార్డియాక్ డెత్స్‌కు అడ్డుకట్ట వేయొచ్చు.

బైస్టాండర్ సిపిఆర్, పబ్లిక్ ఎఇడి ప్రోగ్రాం

సడెన్ కార్డియాక్ అరెస్ట్ ఎప్పుడైనా, ఎవరికైనా జగరవచ్చు. కాబట్టి ప్రతి ఒక్కరూ సిపిఆర్, ఎఇడిల పట్ల అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం. వీటి పట్ల అవగా



హన పెంచడం కోసం నెదర్లాండ్స్, డెన్‌మార్క్ మొదలైన దేశాల్లో బైస్టాండర్ సిపిఆర్, పబ్లిక్ ఎఇడి ప్రోగ్రాంలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. సిపిఆర్ చేయాలంటే ఎవరికైనా ఎంతోకొంత భయం ఉంటుంది. నేను సరిగా చేయగలుగుతానో లేదో, పొరపాటు జరిగితే అవతలి వ్యక్తి ప్రాణాలు పోతాయేమో అనే భయంతో సిపిఆర్ చేయడానికి వెనకాడే వాళ్లూ ఉంటారు. ఇలాంటి భయాలను పోగొట్టడం కోసం విదేశాల్లో రక్షణ చట్టాలు కూడా అమల్లో ఉన్నాయి. ఇలా అత్యవసర పరిస్థితిలో సిపిఆర్ చేసే వ్యక్తులు, ఎదుటి వ్యక్తికి సహాయపడాలనే సదుద్దేశంతోనే ఆ ప్రయత్నానికి పూనుకుంటారు కాబట్టి, ఒకవేళ ఫలితం ప్రతికూలంగా మారినా, సదరు వ్యక్తులకు విదేశాల్లో చట్టపరమైన రక్షణ దక్కుతూ ఉంటుంది. అయితే మన దేశంలో ఇలాంటి చట్టాలు లేవు కాబట్టి సిపిఆర్ చేసే విధానం గురించి మెరుగైన శిక్షణ తీసుకోవడం అవసరం. శిక్షణ తీసుకుంటే, ఛాతీ మీద చేతులను ఎక్కడ, ఏ విధంగా ఉంచి, ఎంత తీవ్రతతో ఒత్తిడిని కలిగించాలి అన్నది తెలుస్తుంది. పలు ఆస్పత్రులు, ఆరోగ్య సంస్థలు సిపిఆర్ ట్రైనింగ్ కోర్సును అందిస్తున్నాయి. ఎవరైనా ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకుని, శిక్షణ తీసుకుని, సర్టిఫికెట్ పొందవచ్చు.

డాక్టర్ కుమార్ నారాయణన్
సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్
అండ్ ఎలక్ట్రోఫిజియాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



అవగాహన

ఒత్తిడి చిత్తు

మానసిక ఒత్తిడి పలు రకాల రుగ్మతల రూపంలో శరీరాన్ని చిత్తు చేస్తుంది. కాబట్టి ఒత్తిడి మీద ఓ కన్నేసి ఉంచి, ఎప్పటికప్పుడు వదిలించుకుంటూ ఉండాలి.

- **శారీరక రుగ్మతలు:** ఒత్తిడి వల్ల రుగ్మతలు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. మరీ ముఖ్యంగా వంశపారంపర్యంగా సంక్రమించే మధుమేహం, హృద్రోగాలు లాంటి రుగ్మతలు మరికొంత ముందుగానే మొదలవుతాయని శాస్త్రీయంగా రుజువైంది. ఒత్తిడి మూలంగా తలెత్తే రక్తపోటు, రక్తపోటు మూలంగా గుండె పోటు, గుండె విఫలమవడం, గుండె కండరాలు దెబ్బతినడం, స్ట్రెస్ కార్డియోమయోపతీ...ఇలా ఒత్తిడి ప్రభావం పరోక్షంగా గుండె మీద పడుతుంది. రక్తపోటు మూలంగా మూత్రపిండాలు కూడా దెబ్బతింటాయి.
- **ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి:** ఒత్తిడితో కూడిన జీవనశైలితో జీవించేవారు అన్నిటికంటే ముందు ఒత్తిడిని తగ్గించే విధానాలు అనుసరించాలి. వాటితో పాటు 35 ఏళ్లు దాటిన ప్రతి వ్యక్తీ, ఏడాదికోసారి తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకోసం సాధారణ వైద్యులను సంప్రతించినా సరిపోతుంది. రక్తపోటు, మధుమేహం, గుండె పనితీరు తెలిపే పరీక్షలతో ముందుగానే రాబోయే రుగ్మతలను కనిపెట్టవచ్చు. మరీ ముఖ్యంగా వంశపారంపర్యంగా మధుమేహం, రక్తపోటు, హృద్రోగాలు సంక్రమించే వీలున్న వ్యక్తులు మరింత అప్రమత్తంగా ఉండాలి.



అపోహ వాస్తవం

హార్మోన్ సమస్య వాళ్లకేనా?

అపోహ: హార్మోన్ల సమస్యలు మధ్యవయసులోనే మొదలవుతాయి! విగతా వయసుల్లో తలెత్తే అవకాశమే లేదు.

వాస్తవం: ఇది నిజం కాదు. పుట్టిన పసికందులతో సహా ఏ వయసు వాళ్లలోనైనా హార్మోన్లలో హెచ్చుతగ్గులు తలెత్తవచ్చు.

ఆరోగ్య సూత్రాలు

ఇలా ఆరోగ్యం బ్రహ్మాండం

కొన్ని సులువైన నియమాలను అనుసరిస్తూ నిండైన ఆరోగ్యాన్ని పొందే వీలుంది. అదెలాగంటే...

- మూడు పూటలా సుష్టుగా భోంచేయకుండా, తక్కువ పరిమాణాల్లో ఎక్కువసార్లు తినాలి
- ఆకుపచ్చని కూరగాయలు, ముదురు రంగు పళ్లు తినాలి
- యవ్వనంగా కనిపించడం కోసం సౌందర్య సాధనాల మీద ఆధారపడకుండా, ఆ ఫలితం ఆహారం ద్వారా పొందే ప్రయత్నం చేయాలి
- వ్యాయామం కష్టపడి కాకుండా ఇష్టపడి చేయాలి. డాన్స్, ఒంటిని శ్రమ పెట్టే ఆటలు కూడా వ్యాయామాలే!
- ఆహారంలో తెల్లని పదార్థాలను తగ్గించి, గోధుమలతో తయారైన పాస్తా, బ్రెడ్, బ్రౌన్ రైస్ వాడకం పెంచాలి
- ఉదయం అల్పాహారం మానకూడదు. నిద్ర లేచిన రెండు గంటల్లోపే బ్రేక్‌ఫాస్ట్ ముగించాలి. దాన్లో ప్రొటీన్లు, పిండి పదార్థాలు తప్పక ఉండేలా చూసుకోవాలి
- బరువులు ఎత్తే వ్యాయామాలతో కండలు పెరుగుతాయి అనేది అపోహ! కాబట్టి ఎముకల సాంద్రత, పటుత్వాలను పెంచే వెయిట్ ట్రైనింగ్ నిస్సంకోచంగా చేయవచ్చు.
- ఎంతో అరుదుగా తప్ప జంక్ ఫుడ్ జోలికి వెళ్లకూడదు
- చిన్న దూరాలకు వాహనాలు వాడడం మానేయాలి. లిఫ్ట్‌కు బదులుగా మెట్లు వాడాలి.



పోషకాహారం

శక్తినిచ్చే లడ్డు

కొన్ని సార్లు భోజనానికీ, భోజనానికీ మధ్యలో నీరసంగా అనిపిస్తుంది. అలాంటప్పుడు తక్షణ శక్తినిచ్చే పదార్థాలు తినాలి. ఆ కోవకు చెందిన అల్పాహారాల్లో బలవర్ధకమైన 'ఆప్రికాట్ లడ్డు' ఒకటి. శక్తినిచ్చే ఈ లడ్డు ఎలా తయారు చేయాలంటే...

కావలసిన పదార్థాలు: ఎండు ఆప్రికాట్స్- అర కప్పు
ఎండు ద్రాక్ష - అర కప్పు, బాదం - పావు కప్పు
వాల్‌నట్స్ - పావు కప్పు
పచ్చికొబ్బరి కోరు - 3 టేబుల్ స్పూన్లు
వెనిల్లా ఎసెన్స్ - కొన్ని చుక్కలు
అవిసె గింజల పొడి - 1 టేబుల్ స్పూను
దాల్చినచెక్క పొడి - 1 టేబుల్ స్పూను

తయారీ విధానం: వెనిల్లా ఎసెన్స్ మినహా మిగతా పదార్థాలన్నీ మెత్తగా దంచి, కలుపుకోవాలి.

- తర్వాత వెనిల్లా ఎసెన్స్ వేసి కలపాలి.
- పై పదార్థాలన్నీ తీపిగానే ఉంటాయి కాబట్టి, అదనంగా చక్కెర కలపాల్సిన అవసరం లేదు. ఒకవేళ తీపి ఎక్కువ కావాలనిపిస్తే రెండు టీస్పూన్ల తేనె కలుపుకోవచ్చు.
- చివర్లో లడ్డుగా చుట్టి ఎండు కొబ్బరి కోరులో దొర్లించాలి.
- వీటిని గాలి చొరబడని డబ్బాలో ఉంచి, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచితే కొన్ని వారాల వరకూ పాడవకుండా ఉంటాయి.



ఆరోగ్యమే మహా భాగ్యం

మలబద్ధకం వదలాలంటే?

ఉదయాన్నే కాలకృత్యాలు తీరకపోతే రోజంతా ఇబ్బందిగానే ఉంటుంది. అయితే కొన్నిసార్లు మన ఆహారశైలి కారణంగా మలబద్ధకం తలెత్తి, తిరిగి రెండో రోజుకి సర్దుకుంటూ ఉంటుంది. కానీ ఇదే ఇబ్బంది పదే పదే తలెత్తుతున్నా, రోజుల తరబడి వేధిస్తున్నా సుఖ విరోచనం జరిగేందుకు తోడ్పడే పదార్థాలను తీసుకోవాలి.

- **కలబంద:** కలబందలో ఉండే 'ఆంథ్రాక్వినోన్స్' అనే సమ్మేళనాలు పెద్ద పేగుల్లో నీరు ఊరేలా చేసి, మ్యూకస్‌ను ఉత్పత్తి చేసి, పేగుల కదలికలను పెంచుతాయి. దాంతో తేలికగా విరోచనం జరిగి మలబద్ధకం వదులుతుంది. కాబట్టి అర కప్పు కలబంద గుజ్జు పరగడుపునే తీసుకుంటే ఫలితం ఉంటుంది.
- **సబ్జా:** నీళ్లతో కలిస్తే సబ్జా జిగురులా తయారవుతుంది. ఆ తత్వం కారణంగా సబ్జా పేగుల్లో తేలికగా కదిలి మలబద్ధకాన్ని వదిలిస్తుంది. రాత్రంతా నీళ్లలో నానబెట్టిన సబ్జా విత్తనాలను పరగడుపునే తాగితే విరోచనం తేలికగా జరుగుతుంది.
- **అవిసెలు:** వీటిలో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. మలబద్ధకం ఉన్నవారు వంటకాల్లో అవిసె గింజలు పొడి చేసుకుని కలుపుకుని తింటే, తగినంత పీచు శరీరానికి అందుతుంది. ఇది మలంతో కలిసి పేగుల్లో తేలికగా జారేందుకు సహాయపడుతుంది.
- **ఆకు కూరలు:** ఆకు కూరల్లో ఉండే మెగ్నీషియమ్‌కు మలాన్ని మెత్తబరిచే గుణం ఉంటుంది. అంతేకాదు. పేగుల్లో నీరు ఊరేలా చేయగల శక్తి మెగ్నీషియమ్‌కు ఉంటుంది. ఈ గుణాల వల్ల ఆకు కూరలు తింటే విరోచనం తేలికగా జరుగుతుంది.
- **తాజా పళ్లు:** కొందరికి తాజా పళ్లు సుఖ విరోచనానికి సహాయపడతాయి. ఆకలి తీరటంతోపాటు మలబద్ధకం తలెత్తకుండా ఉండాలంటే రోజుకి కనీసం 3 రకాల పళ్లు తినాలి. రాత్రి నిద్రకు ముందు మగ్గిన అరటి పండు తిన్నా ఉదయాన్నే సుఖ విరోచనం అవుతుంది.



కుదురుగా... కులాసాగా

గంటల తరబడి శరీరాన్ని ఒకే భంగిమకు పరిమితం చేస్తే, అవయవాల్లో అసౌకర్యాలు, ఇబ్బందులూ తప్పవు. అయితే కొంత అవగాహనతో మెలుగుతూ, అప్రమత్తంగా ఉండగలిగితే జీవనశైలికి సంబంధించిన ఇలాంటి సమస్యలను అదుపులో పెట్టొచ్చు.

మెలితిప్పే మణికట్టు

అరచేయి మొద్దుబారుతూ, సూదులు గుచ్చుతున్నట్టుగా ఉండి, వేళ్లు బలహీనపడితే...'కార్పల్ టన్నల్ సిండ్రోమ్' కావచ్చు. మణికట్టు కంటే చేతిని తక్కువ ఎత్తులో ఉంచి చేసే పనులు (మౌస్, కీబోర్డు వాడకం) వల్ల వచ్చే సమస్య ఇది. భుజం నుంచి ముంజేతి వరకూ సాగి, మణికట్టు గుండా అర చేతిలోకి వెళ్లే 'మీడియన్' అనే నరం ఒత్తిడికి లోనయినప్పుడు ఈ సమస్య తలెత్తుతుంది.

- విరుగుడు ఇలా: పురుషులతో పోలిస్తే మహిళల్లో మణికట్టులో నరాలు వెళ్లే ద్వారం ఇరుకుగా ఉంటుంది. కాబట్టి కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ స్త్రీలలో మూడు రెట్లు ఎక్కువ. చేతుల కదలికల వల్ల తలెత్తిన ఇబ్బంది కాబట్టి మణికట్టు మీద ఒత్తిడిని తగ్గించటం ఒక్కటే ఈ సమస్యకు విరుగుడు. ఇందుకోసం...
- కంప్యూటర్ ముందు పని చేసేవాళ్లు ప్రతి రెండు గంటలకు కనీసం 10 నిమిషాలపాటు చేతులకు విశ్రాంతి నిస్తూ ఉండాలి.
- విశ్రాంతి సమయంలో చేతులు, వేళ్లను బలపరిచే వ్యాయామాలు చేయాలి.
- కంప్యూటర్ స్క్రీన్, హెచ్చుతగ్గులు లేకుండా కళ్లకు సూటిగా ఉండాలి.
- మోచేయి, మణికట్టు ఒకే ఎత్తులో ఉండేలా చూసుకోవాలి.

వెన్నులో పోట్లు

గంటలతరబడి కుర్చీలో కూర్చుని పని చేసేవాళ్లకొచ్చే అత్యంత సాధారణ సమస్య ఇది. కుర్చీలో జారగిలబడి కూర్చున్నా, కుర్చీకి వీపు ఆనించకుండా ముందుకు వంగి కూర్చున్నా వెన్నుపాము ఉండాల్సిన భంగిమలో ఉండదు. దాంతో వెన్నులోని లిగమెంట్లు, కండరాలు ఒత్తిడికి గురై నొప్పులు మొదలవుతాయి.

విరుగుడు ఇలా!

- వెన్ను నొప్పి వేధిస్తుంటే వెంటనే లేచి నడవాలి. కదలకుండా రెండు గంటలకు మించి కూర్చోకూడదు. ఈ జాగ్రత్తలతోపాటు...
- కుర్చీ వీపుకు సమానమైన ఎత్తులో ఉండేలా చూసుకోవాలి.
- కుర్చీకి, వెన్నుకి మధ్య గ్యాప్ ఉంటే కుషనింగ్ కోసం 'లంబార్ పిల్లో' అనే దిండు ఉంచుకోవాలి.
- తొడలు నేలకు సమాంతరంగా, పాదాలు నేల మీద పూర్తిగా ఆనేలా కూర్చోవాలి.
- ఒకవేళ ఎత్తులో కూర్చోవలసివస్తే కాళ్లను గాల్లో వేలాడేలా ఉంచకుండా, ఫుట్ స్టూలు వాడాలి.
- కుర్చీ హ్యాండ్ రెస్ట్‌లు ఒకే ఎత్తులో ఉండేలా చూసుకోవాలి.
- వెన్ను కండరాలు బలపడటం కోసం పొత్తికడుపు వ్యాయామాలు, క్రంచెస్ చేయాలి.



మెడ, భుజాల నొప్పులు

ఈ నొప్పులకు కారణం కూర్చున్న ప్రదేశానికి కంప్యూటర్ మానిటర్, కీబోర్డు అవసరానికి మించి దూరంగా ఉండటమే! ఆ దూరాన్ని తగ్గించటం కోసం మనకు తెలియకుండానే మెడను ముందుకు చాపుతాం! దాంతో భుజాలు ముందుకు వంగుతాయి. ఫలితంగా ఆ ప్రదేశాల్లోని కండరాలు, కణజాలాల మీద ఒత్తిడి పెరిగి, మెడ, భుజాల నొప్పులు మొదలవుతాయి.

విరుగుడు ఇలా!

- తరచుగా మెడ, భుజాల స్ట్రెచింగ్ వ్యాయామాలు చేస్తూ ఉండాలి.
- మెడ పట్టేస్తే, చుబుకాన్ని ఛాతీకి ఆనించి వదిలే 'చిన్ టక్' వ్యాయామం చేయాలి.
- కూర్చుని పని చేసేవాళ్లు వెన్ను నిటారుగా ఉండేలా చూసుకోవాలి.
- మెడను అవసరానికి మించి ముందుకు చాపకూడదు.
- మెడ, భుజాల నొప్పులు వదలటం కోసం తల తిప్పకుండా పక్కకు, భుజం వైపు వంచి 20 అంకెలు లెక్కపెట్టి తిరిగి యథాస్థానానికి రావాలి. ఇలా రెండో వైపూ చేయాలి.
- కంప్యూటర్ కుర్చీకి ఎదురుగా ఉండేలా చూసుకోవాలి.
- తరచూ ఫోన్ మాట్లాడేవాళ్లు మెడ, భుజం మధ్యలో ఫోన్ ఉంచుకుని మాట్లాడే అలవాటు మానుకోవాలి.

కళ్ల మంటలు

కంప్యూటర్ మానిటర్ అవసరానికి మించి దూరంగా ఉంటే, అక్షరాలు స్పష్టంగా కనిపించక కళ్లను చికిలిస్తాం! ఒకవేళ మరీ దగ్గరగా ఉన్నా, మానిటర్ వెలువరించే వెలుగుకు కళ్లు చిన్నవి చేస్తాం! ఈ రెండూ కళ్లను ఇబ్బంది పెట్టేవే! గంటల తరబడి కంప్యూటర్ స్క్రీన్ మీద చూపు నిలపటం వల్ల కళ్లు అలసటకు గురవుతాయి. పైగా ఏకాగ్రతతో పని చేస్తున్నప్పుడు కళ్లను తక్కువగా ఆర్పుతూ ఉంటాం. దాంతో కళ్లు పొడిబారి, నీళ్లు కారతాయి.

విరుగుడు ఇలా!:

- కంప్యూటర్ ముందు పని చేసేవాళ్లు ప్రతి అరగంటకూ కళ్లకు విశ్రాంతినివ్వాలి.
- దూరంగా ఉన్న కిటికీ లేదా క్యాలెండర్‌ను 20 సెకండ్లపాటు చూసి, తిరిగి మానిటర్ మీదకు దృష్టి మరల్చాలి. ఇలా చేయటం వల్ల కళ్లకు విశ్రాంతి దొరుకుతుంది.
- డెస్క్‌లో నుంచి పెన్ను తీసి రాయటం, లేదా పక్కనున్న ఉద్యోగితో రెండు కబుర్లు చెప్పటం...ఇలా కంప్యూటర్ నుంచి కొంతసేపైనా దృష్టిని మరల్చే పనులు చేయాలి.
- కుర్చీకి కంప్యూటర్ మానిటర్ కనీసం 20 నుంచి 40 అంగుళాల దూరంలో ఉండేలా చూసుకోవాలి.
- కంప్యూటర్ మానిటర్ పై అంచు కళ్లకు సమాంతరమైన ఎత్తులో ఉండేలా చూసుకోవాలి.
- వెలుగు తగ్గించటం కోసం మానిటర్‌కు ఫిల్టర్ షీట్ అంటించుకోవాలి.
- మనం ధరించే కళ్లజోళ్లు చదవటానికి, దూరానికి సంబంధించినవై ఉంటాయి. కానీ కంప్యూటర్‌తో ఈ రెండు పనులూ ఒకే సమయంలో చేస్తాం. కాబట్టి కంప్యూటర్ వాడకానికి సంబంధించిన కళ్లజోళ్లు ప్రత్యేకంగా ఎంచుకుని, వాటిని ఆఫీసు డెస్క్‌లోనే ఉంచే ఏర్పాటు చేసుకోవాలి.

కన్నవారికి నిజం తెలిసేలోపు చచ్చిపోవాలని..

- పాలమూరు జిల్లాలో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య
- బ్యాక్‌లాగ్స్‌ఉన్నా పాస్ అయ్యానంటూకన్నవారితో అబద్ధం
- విదేశాలకు పంపేందుకు తల్లిదండ్రుల ఏర్పాట్లు
- నిజం తెలిస్తే ఏం జరుగుతుందోనని బలవన్మరణం

రాజాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కన్నవారికి ఎప్పటికప్పుడు అబద్ధం చెబుతూ వచ్చాడు కానీ, వారికి నిజం తెలిసే సమయం దగ్గరపడుతుండటంతో కంగారుపడిపోయాడు. నిజం తెలిసిపోతే తన పరిస్థితి ఏమిటనే భయంతో తీవ్ర ఆందోళన చెందాడు. చివరికి డిప్రెషన్‌లోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలో ఈ విషాదం జరిగింది. స్థానికులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రాజాపూర్‌లోని మీ సేవ కేంద్రం నిర్వాహకుడు సున్నపు రాధాకృష్ణ కుమారుడు సుభాష్(22) హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో బీటెక్ నాల్గవ సంవత్సరం చదువుతున్నాడు. సుభాష్ ఏటా అన్ని పరీక్షలలోనూ పాస్ అయ్యానంటూ తల్లిదండ్రులకు చెబుతూ వస్తున్నాడు. కుమారుడు బ్రహ్మాండంగా చదువుతున్నాడనే భావనలో ఉన్న తల్లిదండ్రులు అతడిని ఎంటెక్ కోసం విదేశాలకు పంపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది తెలిసిన సుభాష్.. తానైతే పరీక్షల విషయంలో అబద్ధం చెప్పానని... ఒకవేళ తల్లిదండ్రులకు తాను ఫెయిల్ అయ్యానట్లు, బ్యాక్‌లాగ్స్ ఉన్నట్లు తెలిస్తే ఏమంటారోనని కొన్నాళ్లుగా ఆందోళన చెందుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బయట నుంచి వచ్చిన తల్లిదండ్రులు, కుమారుడు ఉరితాడుకు వేలాడుతున్న స్థితిలో విగతజీవిగా కనిపించడంతో భోరున విలపించారు. అయితే ఈ ఘటన గురించి తమకెలాంటి సమాచారం లేదని రాజాపూర్ ఎస్సై రవి వెల్లడించారు.

గల్ఫ్‌లో రోడ్డు ప్రమాదం..
9 మంది కార్మికుల మృతి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నిత్యావసర సరుకులు కొనుక్కొని ఎడారిలోని తమ క్యాంపునకు బస్సులో వెళ్తుండగా జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో 9 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా మరో 73 మంది గాయపడ్డారు. మృతులలో ఇద్దరు తెలంగాణ ప్రవాసీయులు అని సమాచారం. వారిలో ఒకరు ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన షేర్ ఎర్రన్నతో పాటు మరో తెలంగాణకు చెందిన వ్యక్తి ఉన్నట్లు సమాచారం. వివిధ జిల్లాలకు చెందిన మరో అయిదుగురు తెలుగు ప్రవాసీయులు గాయపడినట్లు తెలుస్తోంది. అధికారికంగా మృతులు, క్షతగాత్రుల వివరాల్ని పోలీసులు వెల్లడించలేదు. ఈ దుర్ఘటన వారాంతపు సెలవు దినమైన ఆదివారం రాత్రి అజ్మాన్ ఖోర్ ఫఖాన్ మార్గం మధ్యలో జరగ్గా పోలీసులు సోమవారం సాయంత్రం దీనికి సంబంధించి అధికారిక ప్రకటన చేశారు. బ్రేకులు ఫెయిలవడంతో బస్సు డ్రైవర్ అదుపు తప్పి ప్రమాదం జరిగినట్లు వెల్లడించారు. మృతులందరు అజ్మాన్‌లో ఒక ప్రముఖ నిర్మాణ సంస్థలో పని చేస్తున్నారు. నెలకు ఒకసారి వీరు ఎడారి క్యాంపు నుంచి నగరానికి వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకొని తిరిగి వెళ్తారు. దుబాయిలోని భారతీయ కాన్సులేటు గానీ షార్జా పోలీసులు గానీ మృతుల వివరాలు వెల్లడించలేదు.

విదేశీ పెట్టుబడులలో తెలంగాణకు ఏడో స్థానం

న్యూఢిల్లీ, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో తెలంగాణ ఏడో స్థానంలో ఉందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. సోమవారం, లోక్‌సభలో టీడీపీ ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కృష్ణప్రసాద్ తెన్నేటి, పుట్టా మహేష్‌కుమార్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, ఢిల్లీ, తమిళనాడు, హరియాణా తర్వాత తెలంగాణకు అధిక విదేశీ పెట్టుబడులు వచ్చాయని ఆయన తెలిపారు. 2019 అక్టోబరు నుంచి 2024 సెప్టెంబరు వరకు తెలంగాణలో 9,314 మిలియన్ డాలర్లు ఎఫ్‌డీఐ ఈక్విటీ ప్రవహించగా ఏపీలో ఇదే కాలానికి 1,085.59 మిలియన్ డాలర్ల పెట్టుబడులు లభించాయని తెలిపారు.

గ్రూపు-2 ప్రశ్నలపై వివాదం!

సంబంధం లేని సమైక్య పాలకుల గురించి అడిగారంటూ విమర్శలు

- తెలంగాణ తల్లి పాత విగ్రహంపై ప్రశ్న
- నక్సల్స్-ఎన్‌కౌంటర్లపై 10 ప్రశ్నలు
- ప్రశ్నలు ఏపీపీఎస్సీ కోసమా?: హరీశ్
- ఉద్యమ చరిత్ర లేకుండా చేయాలన్న కుటిలయత్నమేనని మండిపాటు..
- ముగిసిన పరీక్షలు.. 45.57% హాజరు
- నాగర్‌కర్నూల్‌లో పురిటి నొప్పులతోనే పరీక్ష రాసిన అభ్యర్థి.. ఆపై ఆస్పత్రికి
- పరీక్షకు అనుమతించలేదని పాల్వంచలో దుస్తులు విప్పి అభ్యర్థి నిరసన

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు పాలనా వ్యవస్థపై విజన్-2020 డాక్యుమెంట్‌ను తయారు చేసిన అంతర్జాతీయ సంస్థ ఏది..? రాయపాటి సాంబశివరావు, లగడపాటి రాజగోపాల్, టి.సుబ్బరామిరెడ్డి, కావూరి సాంబశివరావుల కంపెనీలు ఏమిటో గుర్తించండి..? ఇవి గ్రూప్-2 పరీక్షలో అడిగిన రెండు ప్రశ్నలు.. ఇలా సమైక్య పాలకులను గుర్తు చేసే పలు ప్రశ్నలను అడగడం వివాదాన్ని రేపింది. ముఖ్యంగా సంబంధం లేని ప్రశ్నలను అడిగారంటూ విమర్శలు వస్తున్నాయి. చంద్రబాబు, ఎన్టీఆర్ పాలన వంటి అంశాలపై అడిగిన ప్రశ్నలు చర్చకు దారితీశాయి. రాష్ట్రంలో ఆదివారం మొదలైన గ్రూపు-2 పరీక్షలు.. సోమవారం నాటితో ప్రశాంతంగా ముగిశాయి. రెండు రోజుల పాటు మొత్తం నాలుగు పేపర్లకు సంబంధించిన పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు మొత్తం 45.57 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. గ్రూపు-2 పోస్టులకు మొత్తం 5,51,855 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 2,51,486 మంది పరీక్షలు రాశారు. ఎకానమీలో రాష్ట్ర, కేంద్ర బడ్జెట్‌లపై, వివిధ పథకాలపై ప్రశ్నలను ఇచ్చారు. రెవెన్యూ లోటు, వివిధ జిల్లాల ర్యాంకులపై ప్రశ్నలను అడిగారు. అలాగే.. వివిధ సర్వేలు, పలు పంటలు, జనాభా లెక్కలపై కూడా ప్రశ్నలను ఇచ్చారు. రైతు బంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు, మహాలక్ష్మి వంటి పథకాలపై కూడా ప్రశ్నలను ఇచ్చారు. అభ్యర్థులకు అనేక అంశాల్లో పూర్తి అవగాహన ఉంటే తప్ప సమాధానాలు రాయలేని ప్రశ్నలు చాలా ఉన్నాయని పోటీ పరీక్షల నిపుణులు చెబుతున్నారు.

గద్దర్, విమలక్క గేయాలపై..

తెలంగాణ ఉద్యమ చరిత్రపై ముఖ్యంగా తొలి దశ, మలిదశ ఉద్యమాలు, వివిధ కమిటీలు, పలువురు ఉద్యమకారులు, సంస్థలు, పార్టీల గురించి పలు ప్రశ్నలు అడిగారు. గద్దర్, విమలక్క గేయాలపై, ప్రొఫెసర్ జయశంకర్‌లపై కూడా కొన్ని ప్రశ్నలు వచ్చాయి. తెలంగాణ తల్లి పాత రూపానికి సంబంధించి ఓ ప్రశ్నను అడిగారు. తెలంగాణ తల్లికి సంబంధించి ఏది సరికాదో గుర్తించండి అంటూ.. 'ఈమె గద్వాల, పోచంపల్లి చీరలను పోలిన చీరలో ఉంది. తెలంగాణ తల్లి విగ్రహ కిరీటం, వడ్డాణంలో కోహినూరు, జాకబ్ వజ్రాలను కూర్చినారు. ఈమె ఒక చేతిలో బోనం పట్టుకుంది. ఈమె పాదాల మెట్టెలు కరీంనగర్ ఫిలిగ్రీ వెండితో తయారు చేశారు' అంటూ ఆప్షన్లను ఇచ్చారు. 'చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అదిలాబాద్ జిల్లాను దత్తతకు తీసుకుని అక్కడ నీటి పారుదల ప్రాజెక్టులను అభివృద్ధి చేశారు.. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి సుమారు 190 టీఎంసీల నీటిని ప్రకాశం జిల్లాకు తరలించే ప్రయత్నం చేశారు' అని ప్రశ్నలను ఇచ్చి ఇందులో ఏవి సరైనవో గుర్తించండని అడిగారు. ఎన్టీయార్ హయాంలోని పలు విషయాలపై ప్రశ్నలను అడిగారు. '1983 ఎన్నికల్లో నక్సలైట్లు నిజమైన దేశభక్తులు, నక్సలైట్ల ఎజెండానే నా ఎజెండా అనే నినాదంతో ఎన్టీఆర్ ప్రచారం చేశాడు. తెలుగు తల్లి అనే భావమును ప్రచారం చేయడం, ట్యాంక్‌బండ్‌పై ఆంధ్రుల విగ్రహాలను ఏర్పాటు చేసి, ఎన్టీఆర్ తెలంగాణ సమాజ, సాంస్కృతిక పునాదులపై దాడి చేశాడు' అనేవి ఇచ్చి ఇందులో ఏవి సరైనవి అని అడిగారు. ఇటు మావోయిస్టులపై కూడా పలు ప్రశ్నలను ఇచ్చారు. నక్సలైట్ల ఉద్యమానికి సంబంధించి 'ఇప్పటి నుంచి నాట్యం లేదు, పాట లేదు, ఉపన్యాసం లేదు అని ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎవరని' అడిగారు. అలాగే.. ఎన్‌కౌంటర్లు, కిడ్నాప్‌లు ఇలా సుమారు 10 ప్రశ్నలను అడిగారు.



పరీక్ష అనంతరం ఆస్పత్రిలో అభ్యర్థి రేవతి

మీరు తెస్తామన్న మార్పు ఇదేనా..?: హరీశ్

గ్రూప్-2 పరీక్షల్లో కొన్ని ప్రశ్నలు చూస్తుంటే.. ఆ పరీక్ష ఏపీపీఎస్సీ కోసమా? అన్న అనుమానం కలుగుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ ఉద్యమచరిత్ర స్థానంలో సమైక్యపాలకుల చరిత్రను చేర్చడమేనా.. కాంగ్రెస్ సర్కారు తెస్తామన్న మార్పు అంటూ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. 'ప్రత్యేక తెలంగాణకు మద్దతు ఇస్తున్నట్లు 2009లో తెలుగు దేశం పార్టీ ప్రణబ్ ముఖర్జీ కమిటీకి తెలిపింది. సరైందా? కాదా?.. రాయపాటి సాంబశివరావు, లగడపాటి రాజగోపాల్, టి.సుబ్బరామిరెడ్డి, కావూరి సాంబశివరావు కంపెనీలు ఏమిటో గుర్తించండి? చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని అక్కడ నీటి పారుదల ప్రాజెక్టులను అభివృద్ధి చేసింది నిజమా కాదా?' అనే ప్రశ్నలు ఉండటం అభ్యంతరకరమన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమం ఉనికి లేకుండా చేస్తున్న కుట్రలో టీజీపీఎస్సీని కూడా భాగస్వామ్యం చేయడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. 'తెలంగాణ ఉద్యమ చరిత్రను లేకుండా చేయాలన్న నీ కుటిల యత్నాలను యావత్ తెలంగాణ సమాజం గుర్తించింది. తగిన బుద్ధి చెబుతుంది' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. కాగా.. మేడ్చల్ జిల్లా కీసరలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల హాస్టల్లో ఎలుకలు కొరకడంతో.. ఐదుగురు విద్యార్థినులు ఆసుపత్రి పాలు కావడం దారుణమని మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల బాట కార్యక్రమం చేపట్టి 24 గంటలు గడవక ముందే వారి డొల్లతనం బయటపడిందని విమర్శించారు. ప్రచారం పేరిట ఒక్కరోజు తమాషా చేయడం కాదని.. గురుకులాల్లో పాము కాట్లు, ఎలుక కాట్లు, కుక్క కాట్లు లేకుండా చూడాలని సూచించారు.

పురిటినొప్పులతోనే పరీక్ష రాసిన గర్భిణి..

నాగర్‌కర్నూల్ టౌన్/పాల్వంచ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షల సందర్భంగా పురిటి నొప్పుల బాధను అనుభవిస్తూ ఓ గర్భిణి పరీక్ష రాయగా.. మరో అభ్యర్థికి ఛాతీ నొప్పి రావడంతో చికిత్స చేయించుకోని పరీక్ష రాశాడు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో నిండు గర్భిణి అయిన రేవతి పరీక్ష రాసేందుకు రాగా.. మధ్యలో పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో అధికారులు అప్రమత్తమై ఆమె కోసం పరీక్షా కేంద్రం వద్ద 108 అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రసవం కోసం వైద్యులను సిద్ధం చేసి ఉంచారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ దృష్టికి కూడా తీసుకెళ్లడంతో ఆమె కోసం పరీక్ష కేంద్రం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశారు. పరీక్షలు పూర్తయిన వెంటనే ఆమెను డెలివరీ కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కిన్నెరసాని రోడ్డులోని గౌతమి స్కూల్ కేంద్రంలో కొమరవరపు రవికుమార్ మధ్యాహ్నం పరీక్ష రాస్తుండగా ఛాతీ నొప్పితో అస్వస్థతకు గురయ్యాడు. దీంతో పరీక్ష నిర్వాహకులు ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడి అతడిని అంబులెన్స్‌లో పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు రవిని పరీక్షించి చికిత్స అందించారు. కాసేపటికి కోలుకున్న అతడిని పరీక్షా కేంద్రానికి తరలించగా పరీక్ష రాశాడు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ప్రభుత్వ కళాశాలలో ఎల్.నగేశ్ అనే అభ్యర్థికి పరీక్ష రాస్తుండగానే ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించారు. భద్రాద్రి జిల్లాలోని పాల్వంచలో ఓ అభ్యర్థి హల్‌చల్ చేశాడు. పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన అతడిని అధికారులు పరీక్షకు అనుమతించకపోవడంతో అక్కడే దుస్తులు విప్పి నిరసన తెలిపాడు. పాల్వంచలోని నెహ్రూనగర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాల సెంటర్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. అక్కడే విధుల్లో ఉన్న అశ్వారావుపేట పోలీసులు అతడిని హెచ్చరించడంతో చివరకు వెళ్లిపోయాడు.

రానివ్వొద్దని హెచ్చరించినా..

- బెనిఫిట్ షోకి సెలబ్రిటీల రాకపై సంధ్య థియేటర్ వారికి పోలీసుల సూచన
- అనుమతి కోసం రాసిన లేఖ వెనుకే హెచ్చరిక..పట్టించుకోని యాజమాన్యం
- ఆలస్యంగా వెలుగులోకి పోలీసుల లేఖ

హైదరాబాద్ సిటీ/చిక్కడపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షోకి ఎలాంటి సెలబ్రిటీలనూ అనుమతించొద్దని.. వారు వస్తే అభిమానులను, జనాన్ని నియంత్రించడం కష్టమవుతుందని పేర్కొంటూ చిక్కడపల్లి పోలీసులు సంధ్య థియేటర్ యాజమాన్యానికి రాసిన లేఖ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బెనిఫిట్ షోకి అనుమతి కోరుతూ థియేటర్ యాజమాన్యం ఇచ్చిన వినతిపత్రం వెనుకనే పోలీసులు ఈ హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. వారు రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది! పోలీసుల హెచ్చరికను థియేటర్ యాజమాన్యం పెడచెవిన పెట్టడం వల్లే అక్కడ తొక్కిసలాట జరిగి.. ఒక మహిళ ప్రాణం పోయిందనే ఆగ్రహం వ్యక్తమవుతోంది. కాగా.. ఈ లేఖ ఆధారంగానే నాంపల్లి న్యాయస్థానంలో ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపించడంతో 9వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అల్లు అర్జున్‌కు 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిసింది. ఈ కేసులో అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన చిక్కడపల్లి పోలీసులు.. ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసిన అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. తొక్కిసలాట జరగడానికి అల్లు అర్జున్ కారణం కాదని, ప్రీమియర్ షోకు వస్తున్నట్లు పోలీసులకు ముందుగానే థియేటర్ యాజమాన్యానికి సమాచారం ఇచ్చారని, అయినా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సరైన భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం వల్లే తొక్కిసలాట జరిగిందని ఆయన తరఫు లాయర్లు వాదించారు. అయితే.. పోలీసులు రాసిన లేఖ ఆధారంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) వారి వాదనలను తిప్పికొట్టినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల ప్రకారం.. థియేటర్ యాజమాన్యం సమాచారం ఇచ్చిన వెంటనే పోలీసులు స్పందించారని, ప్రీమియర్ షోకు రావొద్దంటూ హీరో, హీరోయిన్లకు, నిర్మాతకు, యూనిట్‌కు సమాచారం ఇవ్వాల్సిందిగా సూచించారని పీపీ కోర్టుకు తెలిపారు. అది రద్దీ ప్రాంతం కావడం.. రెండు థియేటర్లు (సంధ్య 70ఎంఎం, సంధ్య 35 ఎంఎం) పక్క పక్కనే ఉండడం.. రోడ్డుమీద రెస్టారెంట్లు ఉండటం వల్ల అభిమానులను నియంత్రించడం కష్టమవుతుందని హెచ్చరించారని ఆయన వివరించారు. ఈమేరకు చిక్కడపల్లి పోలీసులు రాసిన లేఖను న్యాయమూర్తికి అందజేశారు. ముందే హెచ్చరించినా థియేటర్ యాజమాన్యం, సినిమా హీరో అల్లుఅర్జున్ బాధ్యతారహితంగా వ్యవహరించారని తెలిపారు. పీపీ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి అల్లు అర్జున్‌కు 14 రోజులు రిమాండు విధించారు. హైకోర్టులో సైతం ఇవే వాదనలు వినిపించినా.. మధ్యంతర బెయిల్ మంజూరు కావడంతో అల్లు అర్జున్ విడుదలయ్యారు.

నవ్య | చిత్రజ్యోతి

ఇళయరాజాకు అవమానం?



తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరులోని ఆండాళ్ ఆలయంలో సంగీత దర్శకుడు ఇళయరాజాకు అవమానం జరిగినట్టు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలు వైరల్ అయ్యాయి. అయితే అవి నిజం కావని ఆలయ అధికారులు, శడగోప రామానుజ జీయర్ స్వామి స్పష్టం చేశారు. ఆలయంలో మార్గశిర మాస వేడుకల్లో భాగంగా దివ్య పాశుర సంగీత కచ్చేరి, భరత నాట్య కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఇందులో శ్రీవిల్లిపుత్తూరు శడగోప రామానుజ జీయర్, త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ ముఖ్య అతిథులుగా హాజరుకాగా, ప్రత్యేక అతిథిగా ఇళయరాజా పాల్గొన్నారు. ఆండాళ్ సన్నిధి, నందవనం, పెరియ పెరుమాళ్ సన్నిధిలను రామానుజ జీయర్, త్రిదండి చిన్న శ్రీమన్నారాయణలతో కలసి ఇళయరాజా దర్శనం చేసుకున్నారు. ఈ ముగ్గురు వసంత మండపం దాటి అర్థమండపం ద్వారం వద్ద నిలుచున్నారు. దీన్ని గమనించిన పూజారులు వసంత మండపంలో నిల్చొని అమ్మవారిని దర్శనం చేసుకోవాలని చెప్పడంతో ఇళయరాజా అలాగే చేశారు.

ఆత్మగౌరవాన్ని వదులుకోను: ఇళయరాజా

శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయంలో తనకు అవమానం జరిగినట్టు సాగుతున్న ప్రచారంపై ఇళయరాజా స్పందించారు 'నేను ఎప్పుడైనా.. ఎక్కడైనా ఆత్మగౌరవాన్ని వదులుకునే వ్యక్తిని కాదు. వదంతుల్ని నమ్మవద్దు' అని పేర్కొన్నారు.


చెన్నై (ఆంధ్రజ్యోతి)

వైవిధ్యమైన పాత్రలో...



నటనకు ఆస్కారమున్న పాత్రలు పోషించి మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు లావణ్య త్రిపాఠి. ఆమె ప్రధాన పాత్రలో నటించే చిత్రం 'సతీ లీలావతి'. 'ఎస్.ఎమ్.ఎస్' ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వంలో ఎమ్. నాగమోహన్ బాబు, టీ.రాజేశ్ సంయుక్తంగా నిర్మించనున్నారు. లావణ్య త్రిపాఠి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఇందులో ఆమె పోషించే పాత్ర ఎంతో వైవిధ్యంగా ఉండబోతోందని.. ఒక ఆసక్తికర కథాంశంతో సినిమా తెరకెక్కుతోందని మేకర్స్ పేర్కొన్నారు. ఈ సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. వరుణ్‌తేజ్‌తో పెళ్లి తర్వాత లావణ్య నటించే చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: సతీశ్ సూర్య, సినిమాటోగ్రఫీ: బినేంద్ర మీనన్, సంగీతం: మిక్కీ.జే. మేయర్.

ప్రభాస్ కాలికి గాయం



ప్రభాస్‌కు ఓ సినిమా షూటింగ్‌లో కాలికి స్వల్ప గాయమైంది. దీంతో షూటింగులకి విరామమిచ్చిన ప్రభాస్.. వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన నటించిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం వచ్చే ఏడాది జనవరి 3న జపాన్‌లో విడుదలవుతున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ప్రభాస్ జపాన్ వెళ్లాల్సి ఉంది. కాలికి గాయమవ్వడంతో జపాన్‌కు రాలేనంటూ.. అక్కడి అభిమానుల కోసం ప్రభాస్ ఓ పోస్టు పెట్టారు. "నాపై మీరు చూపిస్తున్న ప్రేమకి కృతజ్ఞతలు. మీ అందర్నీ చూడాలని ఎంతోకాలంగా ఎదురు చూస్తున్నాను. షూటింగ్‌లో గాయమవ్వడంతో జపాన్‌కు రాలేకపోతున్నాను. నన్ను క్షమించండి. మీ అందర్నీ త్వరలోనే కలుసుకోవాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. కాగా, ప్రభాస్ గాయం వల్ల 'రాజాసాబ్' సినిమా విడుదల ఆలస్యం అవుతుందని సోషల్‌మీడియాలో అభిమానులు ఆందోళన పడుతున్నారు. దీనిపై ప్రభాస్ టీమ్ స్పందించింది. "ప్రభాస్ గాయం స్వల్పమైందే. 'రాజాసాబ్' టాకీ పార్ట్ పూర్తైంది. సినిమా అనుకున్న సమయానికే వస్తుంది. 'ఫౌజీ' షూటింగ్‌కు మాత్రమే ఆయన విరామమిచ్చారు. త్వరలోనే ఆయన షూటింగ్‌లో పాల్గొంటారు" అని పేర్కొంది.

సంక్రాంతి తర్వాత ...



మహేశ్‌బాబు, రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకొనే చిత్రం షూటింగ్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని ఎదురు చూస్తున్న అభిమానులకు ఓ గుడ్ న్యూస్. శ్రీ దుర్గా ఆర్ట్స్ బేనరుపై డాక్టర్ కె.ఎల్.నారాయణ నిర్మించే ఈ చిత్రం షూటింగ్ వచ్చే నెల చివరి వారంలో ప్రారంభం కానుంది. మహేశ్ డేట్స్ కేటాయించడంతో షూటింగ్ ఏర్పాట్లలో రాజమౌళి టీమ్ బిజీగా ఉంది. ఈ సినిమా కోసం హైదరాబాద్‌లో కొన్ని భారీ సెట్స్ వేశారు. తొలి షెడ్యూల్ వాటిల్లోనే జరుగుతుందని సమాచారం. అలాగే సినిమాలో కీలకమైన ఫారెస్ట్ సీన్స్‌ను ఆఫ్రికాలోని కెన్యా అడవుల్లో చిత్రీకరించడానికి రాజమౌళి ప్లాన్ చేస్తున్నారు. సినిమా షూటింగ్ ప్రారంభించే ముందు ప్రెస్‌మీట్ పెట్టి కథ, ఇతర వివరాలు వెల్లడించడం రాజమౌళికి అలవాటు. అలాగే ఈ సినిమా గురించి కూడా ఓ ప్రెస్‌మీట్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నారు. చిత్రంలో హీరోయిన్, ఇతర తారాగణం ఎవరు.. అనే వివరాలను కూడా ఆ ప్రెస్‌మీట్‌లోనే వెల్లడిస్తారు రాజమౌళి. దాదాపు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా రూపుదిద్దుకోనుంది. మహేశ్ ఇంతవరకూ పోషించని విభిన్న పాత్రను ఇందులో చేస్తున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా తెరకెక్కనుందనే ప్రచారం జరుగుతోంది.

మోహన్‌బాబుకు నోటీసులు...
గన్స్ సరెండర్



మంచు మోహన్ బాబు, ఆయన చిన్న కొడుకు మనోజ్ మధ్య జరిగిన ఇంటి గొడవలు, మీడియా జర్నలిస్టులపై దాడి ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు మూడు కేసులు నమోదు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. ఇప్పటికే మోహన్‌బాబుకు నోటీసులు జారీ చేసినట్లు సీపీ వెల్లడించారు. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరుకావడానికి ఈ నెల 24 వరకు సమయం ఇచ్చామన్నారు.

మోహన్‌బాబుకు లైసెన్స్‌డ్ గన్లు రెండు ఉన్నాయి. హైదరాబాద్‌లో ఒకటి, చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం ఎ. రంగంపేటలోని శ్రీవిద్యానికేతన్ స్కూల్‌లోని ఇంట్లో మరో గన్ ఉంది. వీటిని సంబంధిత పోలీసు స్టేషన్లలో మోహన్‌బాబు సిబ్బంది అందజేశారు.

హైదరాబాద్ సిటీ, చంద్రగిరి (ఆంధ్రజ్యోతి)

ప్రేమికుల కోసం లైలా



విశ్వక్ సేన్, ఆకాంక్ష శర్మ జంటగా నటిస్తున్న రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'లైలా'. రామ్‌నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో విశ్వక్ 'లైలా' అనే అమ్మాయి లుక్‌లో కనిపించి అందర్నీ సర్‌ప్రైజ్ చేశారు. తాజాగా, ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజు సందర్భంగా ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకి అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ప్రసాద్, సంగీతం: లియోన్ జేమ్స్.

ప్రపంచాన్ని టాలీవుడ్ వణికిస్తోంది



ఉపేంద్ర

స్వీయ దర్శకత్వంలో ఉపేంద్ర నటించిన చిత్రం 'యుఐ'. జి.మనోహరన్, కేపీ శ్రీకాంత్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. తెలుగులో గీతా ఆర్ట్స్ ద్వారా ఈనెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. దర్శకుడు బుచ్చిబాబు సాన, నిర్మాత ఎస్‌కేఎన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ 'టాలీవుడ్ ఇండియానే కాదు.. ప్రపంచాన్నే వణికిస్తుంది. రూ.1000 కోట్లు, రూ.2000 కోట్లు వసూళ్లతో బ్లాక్ బస్టర్ హిట్స్ కొడుతున్నారు. అయినప్పటికీ ఒక చిన్న టాలెంట్‌ని చూసి గొప్పగా ఆదరిస్తున్నారు ఇక్కడి ప్రేక్షకులు. దానికి నేనే నిదర్శనం. మా టీమ్ 'యుఐ' చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించింది. ఇది రెగ్యులర్ ఫిల్మ్‌లా ఉండదు. సరికొత్త సినిమా అనుభూతిని కలిగిస్తుంది. ఈ చిత్రం ఒక ఊహా ప్రపంచంలా ఉంటుంది. సినిమా ఓపెనింగ్ సీన్ నుంచే షాక్ అవుతారు. మీరు మైథలాజికల్ కల్కి చూశారు. ఇందులో సైకలాజికల్ కల్కి చూస్తారు' అని అన్నారు. డైరెక్టర్ బుచ్చిబాబు సాన మాట్లాడుతూ 'ఎన్నో సినిమాలతో ప్రయోగాలు చేశారు ఉపేంద్ర. ఈ సినిమాలో కూడా అలాంటి మ్యాజిక్ ఏదో ఉంటుందని భావిస్తున్నా' అన్నారు. ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్ మాట్లాడుతూ 'సౌత్ ఇండియాలో మాకు తెలిసిన కల్ట్ సినిమా, కల్ట్ హీరో, కల్ట్ పర్సనాలిటీ ఉపేంద్ర' అని అన్నారు. కార్యక్రమంలో నిర్మాత అంబికా రామచంద్రారావు, హీరోయిన్ రేష్మ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ చంద్రు మనోహరన్, కో ప్రొడ్యూసర్ నవీన్ మనోహరన్ తదితరులు మాట్లాడారు.

ఉత్కంఠ భరిత చిత్రం



రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నెల కిశోర్ టైటిల్ రోల్‌లో నటించిన సినిమా 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. లాస్యారెడ్డి సమర్పణలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని డిసెంబరు 25న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఉత్కంఠను రేకెత్తించే ఈ మూవీలో మేరీ అనే యువతి హత్య సంచలనంగా మారుతుంది. పోలీసులు కేసును ఛేదించలేక ప్రైవేట్ డిటెక్టివ్‌ను నియమిస్తారు. బీచ్‌లో జరిగే వరుస హత్యల చుట్టూ కథ తిరుగుతుంది. ప్రేమ జంటతో సహా ఏడుగురు అనుమానితులను గుర్తిస్తాడు డిటెక్టివ్. వెన్నెల కిశోర్ శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ క్యారెక్టర్‌కు జీవం పోశాడు. రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల ప్రేమ జంటగా నటించారు.

ఏడాదిగా ఎదురు చూశా

- హరిత గోగినేని



డా. హరిత గోగినేని దర్శకత్వంలో వేదిక లీడ్‌రోల్‌లో నటించిన చిత్రం 'ఫియర్'. డా.వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మాతలు. సుజాత రెడ్డి కో ప్రొడ్యూసర్. ఈనెల 14న రిలీజైన సినిమా ప్రేక్షకాదరణను పొందుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో చిత్ర దర్శకురాలు హరిత గోగినేని మాట్లాడుతూ 'ఈ రోజు కోసం ఏడాదిగా ఎదురు చూస్తున్నాను. ఇది సైకలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ. చాలా మంది హారర్ అనుకుంటున్నారు. కాదు కానీ హారర్ ఎలిమెంట్స్ ఉంటాయి. 39 ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 70కి పైగా అవార్డులు వచ్చాయి. సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు.

అందమైన ప్రేమ కథకు ఆదరణ



పిఎల్ విఘ్నేశ్ దర్శకత్వంలో సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా తెరకెక్కిన చిత్రం 'ప్రణయ గోదారి'. ఇటీవలే విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో దర్శకుడు విఘ్నేశ్ మాట్లాడుతూ 'సినిమా చూసిన ప్రతీ ఒక్కరూ మా టీమ్‌ను అభినందించారు' అన్నారు. హీరోయిన్ ప్రియాంక ప్రసాద్ మాట్లాడుతూ 'నా పాత్రకు మంచి రెస్పాన్స్ వస్తోంది' అని తెలిపారు. 'చాలా రోజుల తర్వాత అందమైన ప్రేమ కథా చిత్రాన్ని చూశామంటున్నారు' అని నటుడు సునీల్ రావినూతల తెలిపారు.

బిజినెస్

అంబానీ, అదానీ ఆస్తులకు బీటలు

100 బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి ఔట్



న్యూఢిల్లీ : దేశంలోనే అత్యంత సంపన్నులైన ముకేశ్ అంబానీ, గౌతం అదానీల సంపద పరుగుకు బ్రేక్ పడింది. ఈ ఏడాది జూన్‌లో 24,310 కోట్ల డాలర్లుగా (సుమారు రూ.20,63,675 కోట్లు) ఉన్న వీరిరువురి సంపద ఈ నెల 13వ తేదీ నాటికి 17,880 కోట్ల డాలర్లకు (సుమారు రూ.15,17,833 కోట్లు) పడిపోయింది. దీంతో వీరిద్దరికి ఈ సంవత్సరం బ్లూమ్‌బర్గ్ 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో చోటు దొరకలేదు. ఈ ఏడాది జూన్ నుంచి ఈ నెల 13వ తేదీ మధ్య వీరిద్దరి సంపద రూ.5.45 లక్షల కోట్లు ఆవిరైపోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సంపద 12,080 కోట్ల డాలర్ల నుంచి 9,670 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8.21 లక్షల కోట్లు), అదానీ సంపద 12,230 కోట్ల డాలర్ల నుంచి 8,210 కోట్ల డాలర్లకు (సుమారు రూ.6.96 లక్షల కోట్లు) పడిపోయింది. ఆర్‌ఐఎల్ ఎనర్జీ, రిటైల్ వ్యాపారాల వృద్ధిరేటు తగ్గడం, అప్పులు పెరిగి పోవడం అంబానీ ఆస్తులను దెబ్బతీసింది. అదానీ గ్రీన్ ఎనర్జీ రాజకీయనేతలు, అధికారులకు లంచాలు మేపిందన్న ఆరోపణలతో అమెరికాలో గౌతం అదానీపై కేసులు నమోదు కావడం ఆయన ఆస్తులు క్షీణించడానికి కారణమని బ్లూమ్‌బర్గ్ తెలిపింది.

20 మంది మరింత పైకి: అయితే ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 20 మంది సంపన్న భారతీయుల సంపద మాత్రం 6,730 కోట్ల డాలర్లు (5.71 లక్షల కోట్లు) పెరిగినట్టు బ్లూమ్‌బర్గ్ తెలిపింది. మళ్లీ ఇందులో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ అధినేత శివ నాడార్ సంపద 1,080 కోట్ల డాలర్లు (సుమారు రూ.91,681 కోట్లు), ఓపీ జిందాల్ గ్రూపు గౌరవ చైర్‌పర్సన్ సావిత్రి జిందాల్ ఆస్తులు 1,010 కోట్ల డాలర్లు (సుమారు రూ.85,738 కోట్లు) పెరిగాయి.

ఐపీఓ మార్కెట్ కళకళ



ఈ నెలలో ఇప్పటికే 11 ఇష్యూలు
నెలాఖరుకల్లా మరో 2-3 ఆఫర్లు!

న్యూఢిల్లీ: ఈ నెల ప్రైమరీ మార్కెట్ పబ్లిక్ ఆఫరింగ్‌లతో (ఐపీఓ) కళకళలాడుతోంది. ఇప్పటికే నాలుగు కంపెనీల ఐపీఓలు పూర్తి కాగా.. ఇంటర్నేషనల్ జెమ్మోలాజికల్ ఇష్యూ మంగళవారంతో ముగియనుంది. తాజాగా మరో 6 కంపెనీలు తమ ప్రణాళికలను ప్రకటించాయి. దాంతో సంఖ్య 11కు చేరనుంది. నెలాఖరు నాటికి మరో 2-3 కంపెనీలు కూడా ఐపీఓ పూర్తి చేసుకునే అవకాశాలున్నాయి. దాంతో ఈ ఏడాదిలో అత్యధిక కంపెనీలు ఐపీఓకు వచ్చిన నెలగా డిసెంబరు నిలిచిపోనుంది. ఈ సెప్టెంబరులో 12 కంపెనీలు ఐపీఓకి వచ్చాయి. కాగా, అక్టోబరులో 6 కంపెనీలే ఇష్యూకు వచ్చినప్పటికీ, అత్యధికంగా రూ.38,689 కోట్లు సమీకరించాయి. సోమవారం ప్రణాళికలు ప్రకటించిన కంపెనీల్లో డీఏఎం క్యాపిటల్ అడ్వైజర్, కాంకర్డ్ ఎన్విరో సిస్టమ్స్, ట్రాన్స్‌రైల్ లైటింగ్, సనాతన్ టెక్స్‌టైల్స్, మమత మెషినరీ ఐపీఓలు ఈనెల 19న ప్రారంభమై 23న ముగియనున్నాయి. డీఏఎం క్యాపిటల్ రూ.840 కోట్ల ఐపీఓ ధరల శ్రేణిని రూ.269-283గా నిర్ణయించింది. కాంకర్డ్ ఐపీఓ ప్రైస్ బ్యాండ్ రూ.665-701గా ఉంది. ట్రాన్స్‌రైల్ లైటింగ్ రూ.839 కోట్ల ఇష్యూ ధరల శ్రేణి రూ.410-432గా ఉంది. సనాతన్ టెక్స్‌టైల్స్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.305-321గా నిర్ణయించింది. రూ.179 కోట్ల మమత మెషినరీ ఐపీఓ ధరల శ్రేణి రూ.230-243గా ఉంది. కాగా, అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు కలిగిన వెంటివ్ హాస్పిటాలిటీ రూ.1,600 కోట్ల ఐపీఓ ఈనెల 20న ప్రారంభమై 24న ముగియనుంది.

- ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి డీఆర్‌హెచ్‌పీ దాఖలు చేసింది. ఐపీఓ ద్వారా సంస్థ రూ.750 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయనుంది.

వాణిజ్య లోటు రికార్డు గరిష్ఠం



- నవంబరులో రూ.3.21 లక్షల కోట్లకు..
- ఎగుమతుల క్షీణత, దూసుకుపోయిన దిగుమతులే కారణం
- పసిడి దిగుమతుల్లోనూ కొత్త రికార్డు

న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం మరోసారి నిరాశావహమైన పనితీరు ప్రదర్శించింది. అక్టోబరు నెలలో రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్న ఈ రంగం నవంబరులో మరోసారి తిరోగమనం బాట పట్టింది. కేంద్ర వాణిజ్య శాఖ సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం..నవంబరు నెలలో ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 4.85 శాతం తగ్గి 3,211 కోట్ల డాలర్లకు (రూ.2,72,646 కోట్లు) పడిపోయాయి. అదే సమయంలో దిగుమతులు 27 శాతం పెరిగి రికార్డు స్థాయి 6,995 కోట్ల డాలర్లకు (రూ.5,93,945 కోట్లు) చేరుకున్నాయి. ఫలితంగా వాణిజ్య లోటు ఆల్ టైం గరిష్ఠ స్థాయి 3,784 కోట్ల డాలర్లకు (రూ.3.21 లక్షల కోట్లు) పెరిగింది.

ఏప్రిల్-నవంబరు కాలానికి..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-నవంబరు కాలానికి ఎగుమతులు 2.17 శాతం వృద్ధితో 28,431 కోట్ల డాలర్లకు (రూ.24.14 లక్షల కోట్లు), దిగుమతులు 8.35 శాతం పెరుగుదలతో 48,673 కోట్ల డాలర్లకు (రూ.41.33 లక్షల కోట్లు) చేరాయి. వాణిజ్య లోటు 20,242 కోట్ల డాలర్లుగా నమోదైంది.

బంగారం దిగుమతులు నాలుగింతలు

గత నెలలో పసిడి దిగుమతులు నాలుగింతలై (331%) రికార్డు గరిష్ఠ స్థాయి 1,486 కోట్ల డాలర్లకు (రూ.1.26 లక్షల కోట్లు) చేరాయి. పండగలు, పెళ్లిళ్ల సీజన్ డిమాండ్ నేపథ్యంలో బులియన్ స్టాకిస్టులు బంగారాన్ని భారీగా దిగుమతి చేసుకోవడం ఇందుకు కారణం. 2023 నవంబరులో గోల్డ్ దిగుమతులు కేవలం 344 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. కాగా, ఈ ఏప్రిల్-నవంబరు కాలానికి బంగారం దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 49 శాతం వృద్ధితో 4,900 కోట్ల డాలర్లకు (రూ.4.16 లక్షల కోట్లు) చేరాయి.



చమురు ధరల్లో హెచ్చుతగ్గుల వల్లే ఎగుమతుల క్షీణత

ముడిచమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు మన ఎగుమతులపై ప్రభావం చూపాయని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భరత్వాల్ అన్నారు. గత నెలలో పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 50 శాతం తగ్గి 371 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయని ఆయన వెల్లడించారు. అంతేకాదు, గడిచిన 8 నెలల కాలానికి పెట్రో ఉత్పత్తుల ఎగుమతులు 19 శాతం తగ్గి 4,460 కోట్ల డాలర్లకు పడిపోయాయని ఆయన తెలిపారు. చమురేతర ఉత్పత్తుల ఎగుమతులు మాత్రం మంచి వృద్ధిని నమోదు చేయగలిగాయన్నారు. సేవల ఎగుమతులతో కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఎగుమతులు 80,000 కోట్ల డాలర్లకు చేరవచ్చన్నారు. గత నెలలో సేవల ఎగుమతులు 3,567 కోట్ల డాలర్ల (రూ.3.03 లక్షల కోట్లు) స్థాయిలో జరిగి ఉండవచ్చని అంచనా. 2023 నవంబరులో సేవల ఎగుమతులు 2,811 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

మ్యూచువల్ ఫండ్స్ ఆస్తులు రూ.67.81 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) విభాగంలో అప్‌ట్రెండ్ కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరి 1న రూ.52.44 లక్షల కోట్లుగా ఉన్న ఓపెన్ ఎంఎఫ్ పథకాల నిర్వహణలోని ఆస్తులు గత నెలాఖరు నాటికి 29 శాతం పెరిగి రూ.67.81 లక్షల కోట్లకు చేరాయి. ఇదే సమయంలో ఈక్విటీ పథకాల నిర్వహణలోని ఆస్తులు రూ.22.5 లక్షల కోట్ల నుంచి రూ.30.35 లక్షల కోట్లకు, మల్టీక్యాప్ ఫండ్స్ నిర్వహణలోని ఆస్తులు రూ.1.94 లక్షల కోట్ల నుంచి 38 శాతం వృద్ధి రేటుతో రూ.2.68 లక్షల కోట్లకు చేరాయి. ఇండెక్స్ ఫండ్స్, ఈటీఎఫ్, గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ కూడా 28 శాతం వృద్ధితో రూ.8.83 లక్షల కోట్ల నుంచి రూ.11.29 లక్షల కోట్లకు చేరింది. హైబ్రిడ్, డెట్, లిక్విడ్ ఫండ్స్ నిర్వహణలోని ఆస్తుల విలువ సైతం భారీగా పెరిగింది. అధిక రాబడులతో ఇన్వెస్టర్లు ప్రస్తుతం బ్యాంకు డిపాజిట్లపై కంటే ఈక్విటీ, మల్టీకాప్ ఫండ్స్‌పై ఆసక్తి చూపడం ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,850 ▼	71,350 ▼	1,00,000 ▼
విజయవాడ	79,500 ▲	72,700 ▲	92,000 ▼
విశాఖపట్నం	77,330 ▲	70,980 ▲	91,230 ▲
రాజమండ్రి	77,890 ▲	71,400 ▲	92,000 ▼
ప్రొద్దుటూరు	78,300 ▲	72,510 ▲	92,100 ▲
ముంబై	76,910 ▼	70,450 ▼	89,515 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	630
వరంగల్	622	గోదావరి	630
చిత్తూరు	603	విశాఖపట్నం	620
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	101	విజయవాడ	104
వరంగల్	101	గుంటూరు	107
కరీంనగర్	101	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	95
కర్నూలు	101	నెల్లూరు	95
విశాఖపట్నం	108	అనంతపురం	95
గోదావరి	104		

ఫెడ్ సమీక్షకు ముందు అప్రమత్తత

సెన్సెక్స్ 385 పాయింట్లు పతనం

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఒకదశలో 581 పాయింట్లకు పైగా క్షీణించినప్పటికీ, చివర్లో 384.55 పాయింట్ల నష్టంతో 81,748.57 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 100.05 పాయింట్లు కోల్పోయి 24,668.25 వద్దకు జారుకుంది. అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ ఈ వారంలో వడ్డీరేట్ల తగ్గింపుపై తన నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు ముందు జాగ్రత్తగా అమ్మకాలకు పాల్పడ్డారు. రూపాయి క్షీణతతో పాటు నిరాశాజనక చైనా ఆర్థిక గణాంకాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మరింత కుంగదీశాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 24 నష్టపోయాయి.

- భారత కరెన్సీ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 11 పైసలు క్షీణించి రూ.84.91 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, అమెరికా బాండ్ల రిటర్నుల రేటు పెరగడం ఇందుకు కారణం.
- ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,150 తగ్గి రూ.78,350కి జారుకుంది. కిలో వెండి రూ.300 తగ్గుదలతో రూ.92,500గా నమోదైంది.

ఏపీ, తెలంగాణలో 'ఆక్సిలో ఫిన్‌సర్వ్' విస్తరణ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విదేశాల్లో ఉన్నత విద్య కోసం రుణాలు అందించే 'ఆక్సిలో ఫిన్‌సర్వ్ (ప్రైవేట్) లిమిటెడ్ కంపెనీ రెండు తెలుగు రాష్ట్రాల్లో తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా వచ్చే ఆరు నెలల్లో విజయవాడ, విశాఖపట్నం, నిజామాబాద్‌లలో కొత్త టచ్ పాయింట్లు ఏర్పాటు చేస్తోంది. కంపెనీ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ లోన్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ శ్వేత గురు ఈ విషయం చెప్పారు. హైదరాబాద్ బ్రాంచ్ ఆఫీసు నుంచి ఈ టచ్ పాయింట్లను నిర్వహిస్తామన్నారు. త్వరలో గుంటూరు, వరంగల్, తిరుపతి, కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లోనూ టచ్ పాయింట్లు ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికి రూ.930 కోట్ల విద్యా రుణాలివ్వగా అందులో తెలుగు రాష్ట్రాల వాటా రూ.350 కోట్ల వరకు ఉందన్నారు. ఈ రాష్ట్రాల్లో గత మూడేళ్లుగా తమ విద్యా రుణాల పోర్టుఫోలియో ఏటా 50 శాతం చొప్పున పెరుగుతోందన్నారు. వివిధ అంశాల ఆధారంగా ఒక్కో విద్యార్థికి రూ.25 లక్షల నుంచి రూ.65 లక్షల వరకు, ప్రత్యేక కోర్సులకు రూ.75 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. రుణంపై 10.7 శాతం నుంచి 13.5 శాతం వరకు వడ్డీ ఉంటుందని తెలిపారు.

3 నెలల కనిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: టోకు ద్రవ్యోల్బణ సూచీ నవంబరులో మూడు నెలల కనిష్ఠ స్థాయి 1.89 శాతానికి జారుకుంది. ఆహార ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం ఇందుకు దోహదపడింది. ఈ అక్టోబరులో టోకు ద్రవ్యోల్బణం 2.36 శాతంగా నమోదైంది. కాగా, గత ఏడాది నవంబరులో సూచీ 0.39 శాతానికి పరిమితమైంది.

అటు వర్షం.. ఇటు వికెట్లు

భారత్ తొలి ఇన్నింగ్స్ 51/4

కుప్పకూలిన టాపార్డర్

ఆసీస్ మొదటి ఇన్నింగ్స్ 445 ● బుమ్రాకు ఆరు వికెట్లు



కోహ్లి అవుట్.. ఇలా



బ్రిస్బేన్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టును వరుణుడు వదలడం లేదు. సోమవారం మూడో రోజు ఆటలో ఆటగాళ్లు పదేపదే మైదానంలోకి రావడం.. పెవిలియన్‌కు వెళ్లడంతోనే సరిపోయింది. కేవలం 33 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం కాగా.. ఇందులో భారత్ ఆడింది 17 ఓవర్లు. కానీ ఈ కాస్త సమయంలోనే మనోళ్లవి టపటపా నాలుగు వికెట్లు పడిపోయాయి. ఆస్ట్రేలియా బ్యాటర్లు శతకాలతో చెలరేగిన చోట భారత బ్యాటర్లు నానా తంటాలుపడిన తీరు అందరినీ నిరాశపరిచింది. పదేపదే అవే తప్పులు చేస్తూ ఆసీస్ బౌలర్లకు అప్పనంగా వికెట్లను సమర్పించుకోవడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 51/4 స్కోరుతో నిలిచింది. రాహుల్ (33 బ్యాటింగ్) ఒక్కడే ఓపిగ్గా క్రీజులో నిలిచి పరుగులు రాబడుతున్నాడు. అతడికి జతగా రోహిత్ పరుగులేమీ చేయకుండా ఉన్నాడు. స్టార్క్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఓ విధంగా భారత్‌ను వర్షమే కాపాడుతోంది. లేకుంటే ఈపాటికి ఫాలోఆన్ ఆడే దుస్థితి దాపురించేదేమో. అంతకు ముందు ఆసీస్ తమ ఓవర్‌నైట్ స్కోరుకు మరో 40 పరుగులు జోడించి 445 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది. క్యారీ (70) హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. బుమ్రాకు ఆరు, సిరాజ్‌కు రెండు వికెట్లు దక్కాయి.

రెండో బంతి నుంచే...: ఆసీస్ ఇన్నింగ్స్ ముగిశాక వెంటనే వర్షం కురవడంతో అరగంట ఆలస్యంగా భారత్ తొలి ఇన్నింగ్స్ ఆరంభించింది. కానీ ఆ తర్వాత కూడా అటు వరుణుడి రాకతో పాటు ఇటు క్రీజులో వికెట్ల పతనం కూడా సాగింది. తొలి బంతినే ఫోర్‌గా మలిచిన ఓపెనర్ యశస్వీని రెండో బంతికే స్టార్క్ అవుట్ చేశాడు. షార్ట్ మిడ్ వికెట్‌లో మార్ష్‌కు క్యాచ్ ఇచ్చిన తను షాక్‌తో వెనుదిరిగాడు. స్టార్క్ తర్వాతి ఓవర్‌లోనూ ఇదే సీన్ రిపీట్ అయ్యింది. ఈసారి గిల్ (1)ని దెబ్బతీశాడు. గిల్ క్యాచ్‌ను గల్లీలో మార్ష్ పట్టేశాడు. అటు రాహుల్ మాత్రం ఆరో ఓవర్‌లో రెండు ఫోర్లు సాధించి పరుగుల కోసం ప్రయత్నించాడు. అలాగే హాజెల్‌వుడ్ ఓవర్‌లో మణికట్టు వద్ద బంతి బలంగా తాకినా చికిత్స చేయించుకుని మరీ ఆడాడు. మరో ఎండ్‌లో విరాట్ (3) 16 బంతులు ఎదుర్కొన్నా ఎప్పటిలాగే ఆఫ్‌సైడ్ అవలి బంతిని డ్రైవ్ చేయబోయి కీపర్ క్యారీకి క్యాచ్ ఇచ్చాడు. 22/3 స్కోరుతో నిలిచిన వేళ వర్షం మొదలైంది. దీంతో లంచ్ బ్రేక్‌ను ప్రకటించారు. రెండో సెషన్ ఆరంభమైన కాసేపటికే మళ్లీ వర్షంతో 45 నిమిషాల పాటు అంతరాయం కలిగింది. క్రీజులో రాహుల్‌తో పంత్ (9) కూడా ఉండడంతో ఆ తర్వాతైనా స్కోరు కుదురుకుంటుందనిపించింది. కానీ కమిన్స్ విసిరిన బంతి పంత్ బ్యాట్ ఎడ్జ్ తీసుకుని క్యారీ చేతుల్లో పడింది. ఆ తర్వాత మరో రెండు బంతులకే భారీ వర్షం పలకరించడంతో ఈసారి రెండు గంటలపాటు ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితమయ్యారు. తిరిగి ఆసీస్ కాలమానం ప్రకారం సాయంత్రం 5 గంటలకు ఆఖరి సెషన్ ఆటను ఆరంభించారు. కేవలం మూడు ఓవర్లు సాగాక మరోసారి వర్షం కురవడంతో చేసేదేమీలేక ఆటను ముగించాల్సి వచ్చింది.



పంత్



గిల్



జైస్వాల్

స్కోరుబోర్డు

ఆసీస్ తొలి ఇన్నింగ్స్: ఖవాజా (సి) పంత్ (బి) బుమ్రా 21; మెక్‌స్వీనే (సి) విరాట్ (బి) బుమ్రా 9; లబుషేన్ (సి) విరాట్ (బి) నితీశ్ 12; స్మిత్ (సి) రోహిత్ (బి) బుమ్రా 101; హెడ్ (సి) పంత్ (బి) బుమ్రా 152; మార్ష్ (సి) విరాట్ (బి) బుమ్రా 5; క్యారీ (సి) గిల్ (బి) ఆకాశ్ 70; కమిన్స్ (సి) పంత్ (బి) సిరాజ్ 20; స్టార్క్ (సి) పంత్ (బి) బుమ్రా 18; లియోన్ (బి) సిరాజ్ 2; హాజెల్‌వుడ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 35; మొత్తం: 117.1 ఓవర్లలో 445 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-31, 2-38, 3-75, 4-316, 5-326, 6-327, 7-385, 8-423, 9-445, 10-445; **బౌలింగ్:** బుమ్రా 28-9-76-6; సిరాజ్ 23.2-5-97-2; ఆకాశ్ 29.5-5-95-1; నితీశ్ 13-1-65-1; జడేజా 23-2-95-0.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 4; రాహుల్ (బ్యాటింగ్) 33; గిల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 1; విరాట్ (సి) క్యారీ (బి) హాజెల్‌వుడ్ 3; పంత్ (సి) క్యారీ (బి) కమిన్స్ 9; రోహిత్ (బ్యాటింగ్) 0; **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 17 ఓవర్లలో 51/4. వికెట్ల పతనం:** 1-4, 2-6, 3-22, 4-44; **బౌలింగ్:** స్టార్క్ 8-1-25-2; హాజెల్‌వుడ్ 5-2-17-1; కమిన్స్ 2-0-7-1; లియోన్ 1-0-1-0; హెడ్ 1-0-1-0.

2 ఆసీస్ గడ్డపై ఎక్కువ టెస్టు వికెట్లు (50) తీసిన రెండో భారత బౌలర్‌గా బుమ్రా. కపిల్ (51) టాప్‌లో ఉన్నాడు.



ఎనిమిదేళ్ల దిగువకు..

'పేలవ ఫామ్‌తో ఇబ్బందిపడుతున్న విరాట్ కోహ్లీ టెస్టు సగటు ఎనిమిదేళ్ల దిగువకు చేరింది. పెర్త్ టెస్టులో సెంచరీ చేశాక అతడు 7, 11, 3 పరుగులకే పరిమితమయ్యాడు. దీంతో తన టెస్టు సగటు 47.49కి పడిపోయింది. 2016 తర్వాత విరాట్ ఇంత తక్కువ సగటుకి చేరడం ఇదే ప్రథమం. మరోవైపు విరాట్ అవుటైన తీరును మాజీ కెప్టెన్ గవాస్కర్ తప్పుబట్టాడు. 'పేలవ షాట్‌తో తీవ్రంగా నిరుత్సాహపరిచాడు. ఒకవేళ ఆ బంతి నాలుగో స్టంప్‌పై పడితే అర్థం చేసుకోగలం. కానీ ఏడు లేదా ఎనిమిదో స్టంప్‌పై పడిన బంతిని ఆడాల్సిన అవసరం ఏమిటి?' అని ప్రశ్నించాడు.

మరో రెండు రోజులు వర్షం ?

మూడో టెస్టులో భారత్‌కు వరుణుడు అండగా నిలిచే అవకాశం కనిపిస్తోంది. రాబోయే రెండు రోజులు కూడా వర్షం కురిసే అవకాశం 90 శాతం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ టెస్టులో తొలి రోజు 13.4 ఓవర్ల ఆటే సాధ్యపడగా.. రెండో రోజు మాత్రం పూర్తిగా సాగింది.

జట్టు సంధి దశలో ఉంది

'ఇప్పుడు తప్పెవరిదనే విషయమై చర్చించుకోవాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం జట్టు సంధి దశలో ఉంది. నితీశ్, ఆకాశ్, హర్షిత్‌లకు ఇక్కడ ఆడిన అనుభవం లేదు. ఆసీస్‌లో క్రికెట్ ఆడడం అంత సులువు కాదు. సీనియర్ బౌలర్‌గా నేను వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉంది' -బుమ్రా

షకీబ్ బౌలింగ్‌పై సస్పెన్షన్

దుబాయ్: బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ బౌలింగ్‌పై ఐసీసీ సస్పెన్షన్ విధించింది. అంతర్జాతీయ మ్యాచ్‌లతో పాటు దేశవాళీ, లీగ్ స్థాయి మ్యాచ్‌ల్లోనూ ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని తెల్పింది. రెండు రోజుల క్రితమే ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) కూడా అతడి బౌలింగ్‌ను బ్యాన్ చేసింది.

సామి..ఇక అన్ని ఫార్మాట్లకూ

బ్రిడ్జిటౌన్ : మాజీ కెప్టెన్ డారెన్ సామి ఇకపై వెస్టిండీస్ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లకూ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ప్రస్తుతం వన్డే, టీ20ల కోచ్‌గా ఉన్న సామి, వచ్చే ఏడాది ఏప్రిల్ ఒకటినుంచి టెస్టు క్రికెట్ కోచింగ్ బాధ్యతలు కూడా స్వీకరిస్తాడని క్రికెట్ వెస్టిండీస్ డైరెక్టర్ మైల్స్ చెప్పాడు. రెండుసార్లు టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన వెస్టిండీస్ జట్టుకు సామి కెప్టెన్‌గా వ్యవహరించాడు.



'బిట్స్ అండ్ పీసెస్' పుస్తకావిష్కరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): క్రీడా విశ్లేషకుడు సి.వెంకటేష్ రచించిన 'బిట్స్ అండ్ పీసెస్-ది లైటర్ సైడ్ ఆఫ్ క్రికెట్ పుస్తకావిష్కరణ సోమవారం ఇక్కడి ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. దేశంలో అత్యంత ప్రజాదరణ ఉన్న క్రికెట్‌కు సంబంధించి స్ఫూర్తిదాయకమైన అంశాలతో తీర్చిదిద్దారని పుస్తకాన్ని ఆవిష్కరించిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ కొనియాడారు. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరనాథ్, ఆదాయపన్ను శాఖ విశ్రాంత అధికారి సుబ్బారావు, మాజీ ఐఏఎస్ పరశురామయ్య, రచయిత సి.వెంకటేష్, దైవజ్ఞ శర్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్జెంటీనా పేసర్ డబుల్ హ్యాట్రిక్

టీ20లలో అరుదైన రికార్డ్



బ్యూనస్‌ఎయిర్స్ (అర్జెంటీనా): అర్జెంటీనా బౌలర్ హెర్నాన్ ఫెన్నెల్ అరుదైన రికార్డు నెలకొల్పాడు. పురుషుల టీ20లలో రెండుసార్లు హ్యాట్రిక్ సాధించిన ఆరో బౌలర్‌గా నిలిచాడు. గతంలో కమిన్స్, సౌథీ, మలింగ తదితరులు ఈ ఘనతను సాధించారు. టీ20 ప్రపంచ కప్ సబ్ రీజనల్ అమెరికా క్వాలిఫయర్స్ మ్యాచ్‌లో ఈ ఫీట్ ఆవిష్కృతమైంది. కేమన్ ఐలాండ్స్‌తో ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్ ఆఖరి ఓవర్లో 36 ఏళ్ల పేసర్ హర్నాన్ చివరి నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా మ్యాచ్‌లో అతడు (5/16) ఐదు వికెట్లు తీశాడు. ఇక వరుసగా నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు తీసిన జాబితాలోనూ ఫెన్నెల్ చేరాడు.

స్పోర్ట్స్

ఆరోసారి ప్లేఆఫ్స్‌కు ఢిల్లీ

పుణె: దబాంగ్ ఢిల్లీ కేసీ జట్టు ప్రొ.కబడ్డీ తాజా సీజన్‌లో ప్లేఆఫ్స్‌కు ప్రవేశించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 47-25తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది. ఢిల్లీ స్టార్ రైడర్ అషు మాలిక్ 17 పాయింట్లతో అదరగొట్టాడు. యోగేష్ (9) అతడికి అండగా నిలిచాడు. బెంగాల్ జట్టులో విశ్వాస్ (8), నితేశ్ కుమార్ (5) రాణించారు. కాగా..వరుసగా ఆరో సీజన్‌లో ప్లేఆఫ్స్‌కు చేరిన జట్టుగా ఢిల్లీ రికార్డు నెలకొల్పింది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 37-32తో పుణెరి పల్టన్‌పై నెగ్గింది.



గుకేష్‌కు ఘనస్వాగతం

నేడు చెన్నైలో సన్మానం

చెన్నై: ప్రపంచ చెస్ కొత్త చాంపియన్ దొమ్మరాజు గుకేష్ సోమవారం.. స్వస్థలం చెన్నై చేరుకున్నాడు. విమానాశ్రయానికి పెద్ద సంఖ్యలో అభిమానులు, తమిళనాడు ప్రభుత్వ అధికారులు తరలివచ్చి అతడిని ఘనంగా స్వాగతించారు. సింగపూర్‌లో జరిగిన వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్లో 18 ఏళ్ల గుకేష్ 7.5-6.5 స్కోరుతో గత విజేత డింగ్ లిరెన్ (చైనా)ను ఓడించి టైటిల్ దక్కించుకున్న విషయం తెలిసిందే. తద్వారా అతి పిన్నవయస్సులో విశ్వ విజేతగా నిలిచిన రికార్డునూ చెన్నై చిన్నోడు అందుకున్నాడు. టోర్నీ జరిగిన రెండు వారాలూ తనకు మద్దతుగా నిలిచిన అందరికీ ఈ సందర్భంగా భారత గ్రాండ్‌మాస్టర్ కృతజ్ఞతలు తెలిపాడు. కాగా తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో గుకేష్‌ను మంగళవారం సన్మానించనున్నారు.

ఇంగ్లండ్ లక్ష్యం 658

హామిల్టన్: న్యూజిలాండ్‌తో మూడో, ఆఖరి టెస్ట్‌లో ఇంగ్లండ్ ఓటమి దిశగా పయనిస్తోంది. 658 పరుగుల కొండంత లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన పర్యాటక జట్టు మూడో రోజు ఆఖరికి రెండు వికెట్లకు 18 పరుగులు చేసింది. అంతకుముందు..ఓవర్‌నైట్ స్కోరు 136/3తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 453 పరుగులకు ఆలౌటైంది. విలియమ్సన్ (156) శతకంతో కదం తొక్కాడు. ఈ క్రమంలో టెస్ట్‌ల్లో 33వ శతకం పూర్తి చేశాడు. ఇక.. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 347, ఇంగ్లండ్ 143 రన్స్ సాధించాయి.

ఆర్ఆర్ఆర్ డీపీఆర్‌కు గడువు పెంపు!

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం రహదారికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికను అందించే కన్సల్టెన్సీ సంస్థ ఎంపిక కోసం ఆహ్వానించిన టెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం గడువు పెంచింది. సోమవారంతోనే గడువు ముగియగా.. దాన్ని ఈ నెల 27 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం నవంబరు 25న ప్రారంభించింది. డిసెంబరు 16ను టెండర్లకు చివరి తేదీగా ప్రకటించింది. అయితే టెండర్ల ప్రక్రియలో పాల్గొనే పలు సంస్థలు నోటిఫికేషన్‌లో కొన్ని మార్పులుచేర్పులు చేయాల్సి ఉందని సూచించినట్లు సమాచారం. సంస్థల సూచనల మేరకు మార్పులు చేయడంతో పాటు టెండర్ల దాఖలుకు గడువును పెంచుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. టెండర్ దాఖలుకు గడువు పెంచడంతో ఈ నెల 27న బిడ్లు తెరవనున్నారు. కాగా, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఖరారు చేసేందుకు కన్సల్టెన్సీ సంస్థ ఎంపిక కోసం ప్రభుత్వం 'ఇంటర్నేషనల్ కాంపిటీటివ్ బిడ్డింగ్' విధానంలో టెండర్లు ఆహ్వానించింది. రహదారి మార్గం నుంచి రోడ్డు నిర్మాణ విధానం సహా పలు అంశాలన్నీ డీపీఆర్‌లో తేలనున్నాయి.



సీఎం సహాయ నిధికి విరాళం అందజేస్తున్న తెలంగాణ స్టేట్ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

సీఎం సహాయ నిధికి 52.02 లక్షల విరాళం

- అందజేసిన తెలంగాణ స్టేట్ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

వనస్థలిపురం, డిసెంబరు 16(ఆంధ్ర జ్యోతి): బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం కృషి చేస్తున్న సీఎం సహాయనిధికి అందరూ సహాయ, సహకారాలు అందజేయాలని తెలంగాణ స్టేట్ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్బ మధుకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వరకంతం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో వారు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లను కలిసి సీఎం సహాయనిధికి రూ. 52,02,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రమాదంలో ఉన్నప్పుడు వారికి మెరుగైన వైద్యం అందించడానికి విశేష సేవలను అందిస్తున్న సీఎం సహాయ నిధికి తమ వంతుగా ఆర్థిక సహాయం అందజేశామన్నారు. మానవతా దృక్పథంతో సీఎం సహాయనిధికి సహాయం అందజేయడం అభినందనీయమని సీఎం రేవంత్, మంత్రి పొన్నం అన్నారని తెలిపారు.

'కాళేశ్వరం' ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకున్నారన్న కేసు
వ్యక్తిగత హాజరు నుంచి దుద్దిళ్లకు మినహాయింపు

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకున్నారని ఆరోపిస్తూ నమోదైన కేసులో ప్రస్తుత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు సోమవారం హైకోర్టు కాస్త ఊరట కలిగించింది. కోర్టులో జరిగే విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. అయితే కేసు నుంచి విముక్తి కలిగించాలంటూ ఆయన వేసిన డిశ్చార్జి పిటిషన్‌ను తిరస్కరించింది. 2017లో పెద్దపల్లి జిల్లా రామవాపురంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో శ్రీధర్‌బాబు మరో 300 మంది అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు, అధికారుల విధులను అడ్డుకున్నారని నీటిపారుదలశాఖ అధికారుల ఫిర్యాదు చేశారు. శ్రీధర్‌బాబు ప్రజాప్రతినిధి కావడంతో ప్రస్తుతం ఈ కేసు నాంపల్లి ఎక్సైజ్ కేసుల మేజిస్ట్రేటు కోర్టుకు వచ్చింది. ఆయన దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను నాంపల్లి కోర్టు కొట్టేసింది. దీనిపై ఆయన హైకోర్టులో అప్పీలు చేశారు. విచారణ జరిపిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం డిశ్చార్జి పిటిషన్ కొట్టివేతకు నిరాకరించింది. తదుపరి విచారణను జనవరి 6కు వాయిదా వేసింది.

భుజంగరావుకు మధ్యంతర బెయిల్ పొడిగింపు..

ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఏ-3గా ఉన్న ఎన్. భుజంగరావుకు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను ఈనెల 23 వరకు పొడిగిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. గతనెల 14నే ఆయన లొంగిపోవాల్సి ఉన్నటిప్పటికీ అనారోగ్య కారణాలతో బెయిల్‌ను పొడిగిస్తూ వస్తోంది. మరో కేసులో బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే నుంచి స్వాధీనం చేసుకున్న ఐఫోన్‌ను తిరిగి ఇచ్చేయాలని హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీచేసింది.

చేనేతకు 490 కోట్ల బకాయిల చెల్లింపులు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగానికి తమ ప్రభుత్వం రూ.490 కోట్ల బకాయిలు చెల్లించినట్లు చేనేత, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రశ్నోత్తరాల సందర్భంగా శాసనమండలిలో సోమవారం చేనేత కార్మికుల సమస్యలపై బీఆర్ఎస్ సభ్యులు ఎల్.రమణ, కవిత తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఇందిరా మహిళా శక్తి కింద మహిళా స్వయం సహాయక సంఘాలకు చెందిన 64.70లక్షల మంది ఆడపడుచులకు ఉచితంగా చీరలు ఇస్తామని వెల్లడించారు. ఏడాదికి రెండుసార్లు 129.40లక్షల చీరలు పంపిణీ చేయడానికి ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో ఏడాదిగా 13 మంది చేనేత కార్మికులు వేర్వేరు కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు మంత్రి తెలిపారు.

సన్నాల అక్రమ రవాణాపై తుమ్మల సీరియస్

- సూత్రధారులు, పాత్రధారులు ఎవరనేదానిపైనా విచారణ

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సన్నరకం ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్‌ను అందిస్తున్న విషయం తెలిసిందే. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది దళారులు ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి నకిలీ పత్రాలతో తెలంగాణకు సన్నధాన్యం అక్రమ రవాణాకు తెరలేపారు. అక్కడి ధాన్యాన్ని రాష్ట్రానికి తీసుకువచ్చి ఇక్కడ పండించిన ధాన్యంగా చూపుతూ క్వింటాకు రూ. 500బోనస్‌ను కొట్టేయాలని ప్రయత్నించారు. ఇదే అంశంపై "ఏపీ నుంచి సన్నాల అక్రమ రవాణా" శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సన్నాల అక్రమ రవాణాపై వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన వెనుక ఎవరున్నా ఉపేక్షించొద్దంటూ అధికారులకు సూచించారు. దాదాపు 90లారీల్లో ధాన్యాన్ని తరలిస్తున్నారంటే.. అసలు దీని వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించాలని ఆదేశించారు.

స్కై బ్లూ కలర్ చీర.. రాబిన్ బ్లూ కలర్ అంచు!

- చీరెలపై ఇందిరా శక్తి లోగోలు
- సెర్ఫ్, మెప్మా, స్త్రీ నిధి సభ్యులకు అందించనున్న ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెప్మా, సెర్ప్, స్త్రీ నిధిలో ఉన్న మహిళా సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చీరెలు అందించనుంది. ఇందుకోసం "టెస్కో" సంస్థ దాదాపు వంద డిజైన్లను సిద్ధం చేసింది. వాటిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలనకు పంపనున్నారు. వాటిలో ఒక నమూనాకు ఆమోదముద్ర వేయగానే చీరెలను మహిళా సభ్యులకు అందించనున్నారు. మహిళలకు అందించే చీరెలను రాబిన్ బ్లూ కలర్ అంచుతో.. స్కై బ్లూ.. రంగులో తయారుచేశారు. ఆ చీరెలపై ఇందిరా శక్తి లోగోలను కూడా ఏర్పాటు చేశారు. కాగా రాష్ట్రంలో సెర్ప్ పరిధిలో 43 లక్షలు, మెప్మాలో 18 లక్షలు, స్త్రీ నిధి పరిధిలో 2 లక్షల మంది కలిపి మొత్తం 63 లక్షల మంది మహిళా సభ్యులున్నారు. ఒక్కో సభ్యురాలికి రెండు చొప్పున చీరెలను ప్రభుత్వం అందించనుంది. సీఎం దగ్గర చీరెల డిజైన్‌పై ఆమోద ముద్ర పడగానే సంక్రాంతి కానుకగా మహిళా సభ్యులకు అందించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కేటీఆర్ మెడకు ఈ-కారు

నేడో రేపో నోటీసులు.. అరెస్టుకూ అవకాశం.. కేటీఆర్‌పై విచారణకు ఇప్పటికే గవర్నర్ అనుమతి

- మంత్రి మండలి భేటీలో సుదీర్ఘ చర్చ
- పత్రాలను సీఎస్ ద్వారా ఏసీబీకి పంపాలని నిర్ణయం
- పెట్టుబడుల లెక్కలను ఏసీబీ తేలుస్తుంది
- నా వ్యాఖ్యలు తుస్సుబాంబో ఏ బాంబో కూడా: పొంగులేటి
- ఐదు ఆర్డినెన్సులకు క్యాబినెట్ ఆమోదం



హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-కారు రేసు వ్యవహారం పూర్తిస్థాయిలో మాజీ మంత్రి కేటీఆర్ మెడకు చుట్టుకోనుంది. ఈ అంశంలో చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని సర్కారు నిర్ణయించింది. ఈ కేసులో కేటీఆర్‌ను విచారించేందుకు ఇప్పటికే గవర్నర్ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ వ్యవహారాన్ని ఏసీబీకి అప్పగించారు! నేడో రేపో కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేయనుంది! ఈ మేరకు క్యాబినెట్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది! సోమవారం అసెంబ్లీ వాయిదా పడిన తర్వాత మధ్యాహ్నం 4.10 గంటల నుంచి 8 గంటల వరకూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమైంది. ఈ సందర్భంగా ఫార్ములా ఈ-కారు రేసు కేసులో కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గ సహచరులకు వివరించారు. ఇందులో జరిగిన అవినీతిపై ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయాన్ని మంత్రులకు తెలిపారు. అనంతరం ఈ అంశంపై మంత్రుల అభిప్రాయాన్ని సీఎం తెలుసుకున్నారు. చట్ట ప్రకారమే ముందుకు వెళ్లాలని మంత్రులంతా తమ అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. కేటీఆర్‌పై విచారణకు సంబంధించి ఇప్పుడే నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని, ఈ విషయంలో జాప్యం జరిగితే ఉపయోగం ఉండదని మెజార్టీ మంత్రులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. దాంతో, ఫార్ములా వన్ ఈ-కార్ రేసుకు సంబంధించి కేటీఆర్‌పై కేసు నమోదుకు అనుమతిస్తూ గవర్నర్ పంపిన పత్రాలను సోమవారం రాత్రే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపాలని నిర్ణయించారు. అనంతరం అక్కడి నుంచి ఏసీబీకి పంపనున్నారు. ఆ తర్వాత చట్ట ప్రకారం ఏసీబీ దర్యాప్తు కొనసాగుతుందని మంత్రులకు సీఎం వివరించినట్లు సమాచారం. కాగా, ఏసీబీ దర్యాప్తులో భాగంగా తొలుత ఒకటి రెండు రోజుల్లో కేటీఆర్‌కు నోటీసులివ్వనున్నారు. ఆ తర్వాత ఆయనను అరెస్టు చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ-కారు రేసు పేరిట రెండు మూడు విడతలుగా దేశం నుంచి విదేశాలకు పెద్ద మొత్తంలో డబ్బులు వెళ్లాయని, అక్కడి నుంచి తిరిగి ఎక్కడికి వెళ్లాయో ఏసీబీ విచారణలో తేలుతుందని మంత్రి మండలి అభిప్రాయపడింది. అలా విదేశాలకు వెళ్లిన డబ్బులకు సంబంధించి ఆర్బీఐ అనుమతి ఉందా లేదా అనే అంశం కూడా విచారణలో తేలుతుందని క్యాబినెట్‌లో చర్చ జరిగింది.

ఆర్వోఆర్ బిల్లు మినహా..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్లపై జస్టిస్ లోకూర్ కమిషన్ ఇచ్చిన నివేదికపై కూడా మంత్రిమండలి సుదీర్ఘంగా చర్చించింది. కమిషన్ నివేదికను మంత్రులకు సీఎం వివరించినట్లు సమాచారం. దీనిపై కూడా మంత్రుల అభిప్రాయాన్ని సీఎం తెలుసుకున్నారు. నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అలాగే, ఆర్వోఆర్ బిల్లును కూడా ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. అయితే, బిల్లు ముసాయిదాకు మంత్రిమండలి సోమవారం ఆమోదం తెలపలేదని తెలుస్తోంది. దీనిపై క్యాబినెట్ మరోమారు సమావేశం కావాలని భావించినట్లు సమాచారం. ఇక, ఐదు ఆర్డినెన్స్‌లకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. పంచాయతీరాజ్ చట్ట సవరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటి దాకా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారికి ఇద్దరే పిల్లలుండాలన్న నిబంధనను మార్చి.. ఆ స్థానంలో ముగ్గురు పిల్లలుండేలా చట్టాన్ని మార్చారు. ఈ మేరకు బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రైతు భరోసాతోపాటు రైతు కూలీలకు ఇచ్చే రూ.12 వేల సాయంపైనా చర్చించినట్లు తెలిసింది.

50 కోట్లా!? 700 కోట్లా!? అనేది ఏసీబీ తేలుస్తుంది: మంత్రి పొంగులేటి



ఈ-కార్ రేసు విషయంలో చట్టప్రకారం ముందుకు వెళ్లాలని మంత్రి మండలి నిర్ణయించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన పెట్టుబడుల లెక్కలను కూడా ఏసీబీ తేలుస్తుందని, అవి రూ.50 కోట్లా లేక రూ.700 కోట్లా అనేది ఏసీబీ విచారణలో తేలుతుందని వ్యాఖ్యానించారు. మంత్రి మండలి సమావేశం తర్వాత ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈ-కార్ ఫార్ములా రేసు పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం దోపిడికి పాల్పడిందని ఆరోపించారు. ఈ విషయంలో కేటీఆర్ అరెస్టు అవుతారో లేదో తనకు తెలియదని, చట్టం తన పని తాను చేస్తుందని వ్యాఖ్యానించారు. తన వ్యాఖ్యలు తుస్సు బాంబో.. ఏ బాంబో త్వరలోనే తేలుతుందన్నారు. అరెస్టు భయంతో కేటీఆర్ రాత్రికి రాత్రే ఢిల్లీకి ఎందుకు పరుగులు పెట్టారో, అక్కడ ఎవర్ని కలిశారో చెప్పాలని ప్రశ్నించారు. అరెస్టు భయంతోనే ఇంటి దగ్గర కాపలా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌ను అరెస్టు చేస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని మాట్లాడటం బీఆర్ఎస్ నేతల అహంకారానికి నిదర్శనమన్నారు. తాము ఎవరిపైనా కక్షపూరితంగా వ్యవహరించడం లేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరుపుతున్నామని చెప్పారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం కలగా మిగులుతుందన్నారు. శాసన సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు గుండాలను తలపించిందని, మాట్లాడేందుకు అంశాలు లేకనే ప్లకార్డులను పట్టి నినాదాలతో పదే పదే ఆటంకం కలిగించారని మండిపడ్డారు.

రేపు టీపీసీసీ ఆధ్వర్యంలో
చలో రాజ్‌భవన్

- పాల్గొననున్న సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్, మంత్రులు .. జీహెచ్ఎంసీలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తేవాలి
- హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతల సమావేశంలో మహేశ్ కుమార్‌గౌడ్
- క్షేత్రస్థాయిలో పని చేసిన నాయకులకు గుర్తింపు: మంత్రి పొన్నం

హైదరాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గౌతమ్ అదానీ ఆర్థికంగా అవకతవకలకు పాల్పడి దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడం, మణిపూర్‌లో అల్లర్లు జరిగినా ప్రధాని మోదీ ఇప్పటి దాకా ఆ రాష్ట్రాన్ని సందర్శించక పోవడాన్ని నిరసిస్తూ టీపీసీసీ ఆధ్వర్యంలో బుధవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమం జరగనుంది. ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగే ఈ చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. కాగా జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆ ఎన్నికల్లో మెజారిటీ డివిజన్లు గెలవడమే లక్ష్యంగా పెట్టుకోవాలని కార్యకర్తలకు సూచించారు. గాంధీభవన్‌లో జరిగిన హైదరాబాద్ జిల్లా పార్టీ సమీక్ష సమావేశంలో మహేశ్ మాట్లాడారు గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కులం, మతం పేరుతో ఉద్రేకాలు రెచ్చగొట్టి ఇతర పార్టీలు సీట్లు గెలుచుకున్నాయని ఆరోపించారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బలమైన నాయకులకే టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పని చేసిన నాయకులకే గుర్తింపు ఉంటుందని, ఆయా డివిజన్‌లలో ప్రజలతో మమేకమైన నేతలకే టిక్కెట్లు లభిస్తాయని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేస్తేనే గ్రేటర్‌లో పార్టీ బలోపేతమవుతుందన్నారు. కాగా బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో కులగణన ఎప్పుడు చేస్తారంటూ ప్రధాని మోదీని కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు ప్రశ్నించారు. వీర సావర్కర్ బాటలో మోదీ నడుస్తున్నారని, అయితే వీర సావర్కర్ దేశానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అంతకుముందు.. బంగ్లాదేశ్ లిబరేషన్ డే.. విజయ్ దివస్ సందర్భంగా గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్.. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మరోవైపు.. మహేశ్ కుమార్‌గౌడ్ డమ్మీ కాదు.. డైనమిక్ అని, పనిమంతుడు కాబట్టే ఆయన పీసీసీకి అధ్యక్షుడయ్యారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్ అన్నారు. కేటీఆర్ లాగా తండ్రి పేరు చెప్పుకుని రాజకీయాల్లోకి రాలేదన్నారు.



త్వరలో ఫీజు రియంబర్స్‌మెంట్
బకాయిల చెల్లింపు

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా పెండింగులో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం సాధ్యమైనంత త్వరలో చెల్లిస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం సచివాలయంలో తనను కలిసిన ప్రైవేట్ ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలల యజమాన్యాల సంఘం ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. పెండింగు బకాయిలను చెల్లించాలన్న ప్రతినిధుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత నాన్ ప్రొఫెషనల్ కాలేజీలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపు ప్రక్రియను మొదలు పెడతామన్నారు. నాన్ ప్రొఫెషనల్ కాలేజీలకు బకాయిలను పూర్తిగా చెల్లించడానికి వీలైనంత తొందరగా కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్ పాలకులు 10 సంవత్సరాల్లో చేసిన అప్పులకు ఈ 10 నెలల కాలంలో అప్పులు, వడ్డీల కింద రూ. 66 వేల కోట్లు బ్యాంకులకు కట్టామని భట్టి విక్రమార్క తెలిపారు.

కేసీఆర్‌పై కేసు!

(మొదటిపేజీ తరువాయి)



ఆ తర్వాత ఇంధన సర్దుబాటు పేరిట రూ.4.50; బయటి మార్కెట్లో యూనిట్ ఏడు రూపాయలకు కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని తప్పుబట్టింది. 1000 మెగావాట్ల కరెంట్‌ను తీసుకోవడానికి ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకున్నారని, కానీ, ఆ మేరకు ఆ రాష్ట్రం కరెంట్ ఇవ్వలేదని, దాంతో, బహిరంగ విపణి (ఓపెన్ యాక్సెస్)లో కొనుగోలు చేయాల్సి వచ్చిందని, ఫలితంగా, రూ.2,000 కోట్ల అదనపు భారం తెలంగాణపై పడిందని ఆక్షేపించింది. అలాగే, కరెంట్ కొనుగోళ్లు చేసినా ఛత్తీస్‌గఢ్‌కు సకాలంలో చెల్లింపులు చేయని కారణంగా లేట్ పేమెంట్ సర్‌ఛార్జీ కింద వడ్డీలు/పెనాల్టీల రూపంలో రూ.750 కోట్లు చెల్లింపులు చేస్తున్నారని తప్పుబట్టింది. వెయ్యి మెగావాట్ల తరలింపునకు పవర్ గ్రిడ్‌తో కారిడార్ బుక్ చేసుకున్నారని, ఆ మేరకు తరలించకపోవడంతో రూ.635 కోట్లు చార్జీలు అయ్యాయని తప్పుబట్టింది. మరో 1000 మెగావాట్ల కారిడార్‌ను రద్దు చేసుకున్నందుకు నష్టపరిహారం కింద రూ.261 కోట్లు పరిహారం కింద చెల్లించాలని పవర్ గ్రిడ్ నోటీసు ఇచ్చిందని (ఈ కేసు అప్పిలేట్ ట్రిబ్యునల్ విచారణలో ఉంది) గుర్తు చేసింది. అలాగే, బొగ్గు గనులకు దూరంగా ప్లాంటును నిర్మించడంపైనా సమావేశంలో చర్చ జరిగింది. గోదావరి ఒడ్డున బొగ్గు నిల్వలు ఉన్నాయని, పిట్ హెడ్ (బొగ్గు గని ఉపరితల భాగం)లోనే ప్లాంటు కట్టాలని, దీనివల్ల విద్యుత్తు ఉత్పత్తి ధర తగ్గుతుందని కేంద్ర విద్యుత్తు అథారిటీ (సీఈఏ) పలు దఫాలుగా గుర్తు చేసిందని, అయినా.. గనులకు సగటున 280 కిలోమీటర్ల దూరంలో (ఇల్లెందు 179 కి.మీ., ఇతర గనులు 360 కి.మీ.) యాదాద్రి నిర్మించడంతో ఏటా రూ.1,600 కోట్లు బొగ్గు రవాణాకే ఖర్చవుతుందని కమిషన్ తేల్చింది. దీనిపైనా క్యాబినెట్ మండిపడింది.

సవాలు విసిరి..

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడగానే విద్యుత్తు రంగంపై శాసనసభలో శ్వేతపత్రం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జరిగిన చర్చలో.. విద్యుత్తు కొనుగోళ్లపై విచారణ జరిపించాలని బీఆర్ఎస్ సభ్యులు సవాల్ విసిరారు. దాంతో, ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. గత మార్చి 14వ తేదీన జస్టిస్ ఎల్.నర్సింహా రెడ్డి నేతృత్వంలో కమిషన్‌ను నియమించింది. విచారణ ప్రక్రియ పలు కీలక దశలు దాటి.. త్వరలో నివేదిక ఇస్తారనే క్రమంలో సుప్రీం కోర్టు తీర్పుతో జస్టిస్ ఎల్.నర్సింహా రెడ్డి విచారణ ప్రక్రియ నుంచి తప్పుకొన్నారు. ఆ తర్వాత జూలై 29న జస్టిస్ లోకూర్ నేతృత్వంలో కమిషన్ వేసింది. ఆయన సమర్పించిన నివేదిక ఆధారంగా ఇప్పుడు ప్రభుత్వం అడుగులు వేయనుంది.

కాలినడకన వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక దర్శనం

- ఇందుకు ప్రత్యేక ట్యాగ్ కేటాయింపు
- త్వరలో అందుబాటులోకి: ట్రావెన్‌కోర్ బోర్డు

శబరిమల, డిసెంబరు 16: అటవీ మార్గంలో శబరిమల అయ్యప్ప దర్శనానికి కాలినడకన వెళ్లే భక్తులకు ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించనున్నారు. పులిమేడు, ఎరుమేలి అటవీ మార్గంలో అయ్యప్ప సన్నిధానానికి చేరుకునే యాత్రికుల కోసం ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ సోమవారం తెలిపారు. ఇందుకు యాత్రికుల చేతికి ప్రత్యేక ట్యాగ్‌ను కేటాయిస్తామని, పంపా నుంచి అయ్యప్పన్ రోడ్డు మార్గం ద్వారా సన్నిధానంకు చేరుకునే భక్తులను నేరుగా దర్శనానికి అనుమతి ఇస్తామని చెప్పారు. మరక్కూట్టం వద్ద ప్రత్యేక ట్యాగ్ కలిగిన భక్తులను శరంకుతి మార్గం ద్వారా కాకుండా నేరుగా చంద్రానందన్ రోడ్డు ద్వారా గుడికి వెళ్లే వెసులుబాటు ఉంటుం ది. పులిమేడు, ఎరుమేలి, నీలిమల మార్గాల నుంచి ప్రత్యేక ట్యాగ్‌లతో వచ్చే యాత్రికులను నేరుగా దర్శనానికి అనుమతిస్తామని ప్రశాంత్ తెలిపారు. ఇందుకు అటవీ శాఖ అధికారుల సహకారం తీసుకుంటామని, భక్తులకు ట్యాగ్‌లను అందించే బాధ్యతను వారికే అప్పగిస్తామని చెప్పారు.

సభ అజెండాను ఇప్పుడే నిర్ణయించండి

బీఏసీ సమావేశంలో బీఆర్ఎస్ డిమాండ్.. సభ్యులు సలహాలు ఇస్తారు.. స్పీకర్ అజెండాను నిర్ణయిస్తారు

- సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- నిర్ణయాధికారం స్పీకర్‌దేనన్న బీఏసీ
- సమావేశం నుంచి బీఆర్ఎస్ వాకౌట్
- భేటీ మధ్యలోనే వెళ్లిపోయిన అక్బరుద్దీన్
- శుక్రవారం వరకూ సభ జరిగే అవకాశం!



స్పీకర్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో సీఎం రేవంత్, భట్టి, శ్రీధర్‌బాబు, పొన్నం, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, అక్బరుద్దీన్ ఒవైసీ, కూనంనేని సాంబశివరావు, పాయల్ శంకర్

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శాసనసభ శీతాకాల సమావేశాలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలి? ఏయే అంశాలను చర్చకు తీసుకోవాలి? అన్న దానిపై నిర్ణయాధికారాన్ని శాసనసభ 'సభా సలహా సంఘం (బీఏసీ)' స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వదిలేసింది. శాసనసభ శీతాకాల సమావేశాల నిర్వహణ అజెండాను ఖరారు చేసేందుకు సోమవారం స్పీకర్ అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, బీజేపీ శాసనసభాపక్ష ఉప నేత పాయల్ శంకర్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో చర్చకు కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్, బీజేపీ, సీపీఐ సభ్యులు ఆయా పార్టీల తరఫున అంశాలను ప్రతిపాదించారు. సమావేశాలను కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలని హరీశ్‌రావు ప్రతిపాదించగా.. 30 రోజుల పాటు జరపాలని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రోజూ జీరో అవర్‌ను చేపట్టాలని కూడా బీఆర్ఎస్ సభ్యులు ప్రతిపాదించారు. అయితే ఆయా పార్టీలు ప్రతిపాదించిన అంశాలను స్పీకర్ పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. సభ ఎన్నిరోజులు నిర్వహించాలన్నదానితో పాటు చర్చించాల్సిన అంశాలపైనా సమావేశంలోనే నిర్ణయం తీసుకోవాలని హరీశ్ పట్టుబట్టారు. హైదరాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానుండడం, క్రిస్మస్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని శ్రీధర్‌బాబు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో సభను ఎన్ని రోజులు నిర్వహించారని నిలదీశారు. ఈ క్రమంలో సుదీర్ఘంగా సమావేశం జరుగుతుండడం, అజెండా ఖరారవకపోవడంపై అసహనం చెందిన అక్బరుద్దీన్ ఒవైసీ సమావేశం నుంచి వెళ్లిపోయారు. బీఏసీలో సభ్యులు సలహా ఇవ్వాలని, నిర్ణయం స్పీకర్ తీసుకుంటారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ క్రమంలో లగచర్ల అంశంపై సభలో చర్చ చేపట్టాలని, ఇతర అంశాలపైనా అజెండాను ఖరారు చేయాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. అదానీ టీ షర్టులతో రాహుల్‌గాంధీ పార్లమెంటుకు వెళ్లారని, ఇక్కడ మాత్రం బీఆర్ఎస్ సభ్యులు అదానీ బొమ్మ ఉన్న టీ షర్టును వేసుకుని వస్తే సభలోకి అనుమతించలేదని హరీశ్ బీఏసీ దృష్టికి తెచ్చారు. సభ నిబంధనల ప్రకారం ప్లకార్డులు ప్రదర్శించడం, అదానీ బొమ్మ ఉన్న టీ షర్టులతో సభలోకి రావడం నిషిద్ధమని, అందుకే అనుమతించలేదని కాంగ్రెస్ సభ్యులు చెప్పారు. బీఏసీ జరగకుండానే సభలో రెండు బిల్లులు ఎలా ప్రతిపాదిస్తారని హరీశ్ ప్రశ్నించారు. అలాగే సభ జరుగుతున్న సమయంలో భూమి లేని వారికి రూ.12 వేల సాయం పథకాన్ని భట్టి విక్రమార్క ఎలా ప్రకటిస్తారని నిలదీశారు. సభలో 9 అంశాలను చర్చకు ప్రతిపాదించిన హరీశ్.. లగచర్ల అంశంపై మంగళవారం చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. అజెండాను స్పీకరే ఖరారు చేస్తారని శ్రీధర్‌బాబు స్పష్టం చేయడంతో నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రొటోకాల్ ఉల్లంఘనలపైనా చర్చకు రాగా.. ఇకపై అలాంటివి జరగకుండా చూసుకుంటామని స్పీకర్ హామీ ఇచ్చారు. శాసనసభ సమావేశాలు శుక్రవారం వరకూ జరిగే అవకాశం ఉన్నట్లు అసెంబ్లీ వర్గాలు చెబుతున్నాయి.

బీఏసీ అంటే.. బిస్కెట్ చాయ్ భేటీ కాదు: హరీశ్

సభను ఎన్ని రోజులు నడుపుతామన్నది స్పష్టం చేయకపోవడంతో బీఏసీ సమావేశం నుంచి తాము వాకౌట్ చేశామని హరీశ్ చెప్పారు. కనీసం 15 రోజులు సభను నడపాలని కోరామన్నారు. ఏయే అంశాలపై చర్చ చేపడతారన్నదీ తేల్చలేదని, దీంతో ఇది చాయ్, బిస్కెట్ సమావేశం కాదంటూ బయటికి వచ్చేశామని మీడియాతో చెప్పారు. ఒకరోజు ప్రభుత్వం ప్రతిపాదించిన అంశంపై, మరో రోజు విపక్షం సూచించిన అంశంపై చర్చించడం సంప్రదాయమని, ఇందులో భాగంగా మంగళవారం లగచర్ల అంశంపై చర్చ చేపట్టాలని కోరినట్లు తెలిపారు.

అది స్పీకర్ నిర్ణయిస్తారు: భట్టి

అసెంబ్లీ నిబంధనల మేరకే బీఏసీ సమావేశం జరిగిందని, బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరించిన తీరు సరిగా లేదని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. మీడియాతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. "అసెంబ్లీ ఎన్ని రోజులు నడపాలన్నది స్పీకర్ నిర్ణయిస్తారు. పదేళ్లు పాలించిన వారికి అది కూడా తెలియదా? హరీశ్‌రావు చెప్పినట్లు సభ పనిదినాలు ఉండాలంటే ఎట్లా? గత ప్రభుత్వం ఏం చేసిందన్నది నాకు తెలియదా? ఇప్పుడు కూడా అప్పటిలాగే సభ ఎన్ని రోజులు జరపాలన్నది స్పీకరే నిర్ణయిస్తారు" అని చెప్పారు. శాసనసభను ఎన్ని రోజుల పాటు నిర్వహించనున్నదీ స్పీకర్ మంగళవారం సభలో ప్రకటిస్తారని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. వారం పాటు సభ జరిగే అవకాశం ఉందన్నారు.

సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు

» కులగణన ఆధారంగా అర్హుల గుర్తింపు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వే నివేదిక ఆధారంగా సంక్రాంతి తర్వాత రేషన్ కార్డులు జారీ ప్రక్రియను ప్రారంభించనున్నట్టు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. రాష్ట్రంలో కొత్తగా 10 లక్షల రేషన్‌కార్డులు జారీచేయడం ద్వారా 31లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం అంచనా వేసినట్టు ఆయన పేర్కొన్నారు. కొత్త కార్డులతో ప్రభుత్వంపై రూ.956కోట్లకు పైగా అదనపు భారం పడుతుందన్నారు. దీంతో పాటు, ప్రస్తుత రేషన్‌కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్ సమాధానం చెబుతూ.. ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో పేర్ల నమోదు కోసం సుమారు 18లక్షల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. కాగా, సంక్రాంతి నుంచే రేషన్ ద్వారా సన్నబియ్యం అందించనున్నట్టు ఉత్తమ్ పేర్కొన్నారు. చౌక ధరల దుకాణాల ద్వారా ఇతర నిత్యావసర వస్తువుల పంపిణీ ఆలోచనలేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడక ముందు ఉమ్మడి ఏపీలో తెలంగాణ ప్రాంతంలో 91,68,231 కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు ఉండగా, ఏపీ వారు తమ ప్రాంతాలకు వెళ్లిపోవడంతో 2,46,324 కార్డులు రద్దు అయినట్లు ఉత్తమ్ వివరించారు. అలాగే, 2016 నుండి 2023 వరకు 19లక్షల మంది లబ్ధిదారులను అనర్హులుగా గుర్తించి 5,98,000 ఆహార భద్రత కార్డులను తొలగించినట్టు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 89.95 లక్షల తెల్ల రేషన్ కార్డులతో 2.81 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని ఉత్తమ్ వివరించారు.

మేము వచ్చాక 54,573 పోస్టుల భర్తీ

» జాబ్ క్యాలెండర్ ప్రకారమే నియామకాలు: భట్టి

హైదరాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత నుంచి 55,172 పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేసి, 54,573 పోస్టులను భర్తీ చేపట్టినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశామని, ఇకపై ఖాళీగా ఉన్న ఉద్యోగాలను జాబ్ క్యాలెండర్ ప్రకారం దశల వారీగా భర్తీ చేస్తామన్నారు. మండలిలో సోమవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు భట్టి విక్రమార్క సమాధానం చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రూప్-1లో 563 పోస్టులకు పరీక్ష నిర్వహించినట్టు చెప్పారు. 11,062 ఖాళీలతో డీఎస్సీ నిర్వహించి 10,600 మందికి నియామక ఉత్తర్వులు ఆర్డర్లు ఇచ్చామని తెలిపారు. ఉద్యోగ పరీక్షలన్నీ ఎలాంటి లీక్‌లు లేకుండా.. పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉర్దూ మీడియంలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి 'డీ' రిజర్వేషన్ విధానానికి అవకాశం లేదని స్పష్టం చేశారు.

'కవ్వాల్'లోని చెంచులను తరలిస్తాం: సురేఖ

కవ్వాల్ అభయారణ్య ప్రాంతంలోని గిరిజన, చెంచు గ్రామాల కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు ప్రారంభించినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల సంచారం పెరగడంతో.. గిరిజనులు, చెంచులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా జీవన్‌రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సురేఖ సమాధానం ఇచ్చారు. వన్యప్రాణుల దాడుల్లో మృత్యువాతపడిన బాధితుల కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. తిరుమలలోతెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వం తరపున టీటీడీ ఛైర్మన్‌ను కోరుతూ లేఖ రాస్తామని ప్రకటించారు.

కులగణన తర్వాత బీసీ రిజర్వేషన్ల పెంపు: పొన్నం

కులగణన సర్వే నివేదిక ఆదారంగా బీసీ రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ప్రభాకర్ సమాధానం చెప్పారు. ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బీసీ కులాల ఆత్మగౌరవ భవనాల విషయంలో చర్యలు తీసుకుంటామన్నారు. బీసీ డిక్లరేషన్‌లో చెప్పినట్టు రిజర్వేషన్లు పెంచుతామని పేర్కొన్నారు. రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ సభ్యుల వాగ్వాదానికి దిగగా.. తన సమాధానం ఇలాగే ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

రెండు బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రులు

తెలంగాణ యువ భారత వ్యాయామ విద్య-క్రీడా విశ్వవిద్యాలయ బిల్లు-2024ను మంత్రి శ్రీధర్‌బాబు, తెలంగాణ విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు-2024ను మంత్రి దామోదర రాజనర్సింహ సభలో ప్రవేశపెట్టారు.

సభలో బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు.. నిరసన

లగచర్ల రైతులపై చర్చించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దాన్ని తోసిపుచ్చారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు నిలబడి 'ఇదేం రాజ్యం.. ఇదేం రాజ్యం.. దొంగల రాజ్యం, దోపిడి రాజ్యం' అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం పెద్దపులుల దాడిపై బీజేపీ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు, పాయల్ శంకర్ ఇచ్చిన వాయిదా తీర్మానంతో పాటు మూసీ పునరుజ్జీవంలో భాగంగా నిర్వాసితులకు పునరావాసం, పునర్నిర్మాణంపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇచ్చిన వాయిదా తీర్మాన ప్రతిపాదనలను స్పీకర్ తోసిపుచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు జ్యోతిదేవి, ఊకే అబ్బయ్య, డి.రామచంద్రారెడ్డి మృతి పట్ల శాసనసభ సంతాపం తెలుపుతూ 2 నిమిషాల పాటు మౌనం పాటించింది.

4 వేల స్కూళ్లు మూసి వేసేందుకు సర్కారు కుట్ర

» ఇబ్బందులను అధిగమించి వాటిని కొనసాగించాలి: సబిత

కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం కారణంగా విద్యార్థులు చేరక రాష్ట్రంలో 1,913 పాఠశాలలు మూతపడే స్థాయికి చేరాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. పది మంది విద్యార్థులున్న నాలుగు వేల పాఠశాలలను మూసివేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆమె ఆరోపించారు. ఆయా పాఠశాలల్లో నెలకొన్న ఇబ్బందులను అధిగమించి వాటిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె విలేకరులతో మాట్లాడారు. విద్యారంగంపై ప్రభుత్వానికి పట్టింపులేదని, గురుకులాల్లో కూడా విద్యార్థుల నమోదు తగ్గిందని అన్నారు. అనంతరం జగదీశ్‌రెడ్డి, వివేకానంద మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజాసమస్యలు చర్చించాలంటే అధికార కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారని అన్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటూ స్పీకర్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, బీఆర్ఎస్ సభ్యులను ఆయన పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

సర్పంచులను ముంచింది బీఆర్ఎస్సే: నాయిని

దొంగే.. దొంగ అని అరిచినట్లుగా బీఆర్ఎస్ పార్టీ నేతల తీరు ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. వారి హయాంలో పనులు చేయించి బిల్లులు చెల్లించకుండా సర్పంచులను నిలువునా ముంచారని ఆయన ఆరోపించారు. కేసీఆర్ పాలనలో చేసిన అభివృద్ధి పనులకన్నా ప్రచారమే ఎక్కువగా ఉందని, వరంగల్‌కు నిధులు ప్రకటించి పైసాకూడా ఇవ్వలేదని రాజేందర్‌రెడ్డి విమర్శించారు.

సార్... మీరెవరూ..!?

» ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు అసెంబ్లీ భద్రతా సిబ్బంది ప్రశ్న

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సార్... మీరెవరూ..? అంటూ వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు అసెంబ్లీ ప్రాంగణంలో భద్రతా సిబ్బంది నుంచి ప్రశ్న ఎదురైంది. సోమవారం మధ్యాహ్నం అసెంబ్లీ సమావేశం వాయిదా అనంతరం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తన సహచరులతో కలిసి అసెంబ్లీ ఆవరణలోని మీడియా పాయింట్‌కు వెళ్తున్నారు. మీడియా పాయింట్ వద్ద భద్రతా విధుల్లో ఉన్న ఓ ఎస్సై, మహిళా కానిస్టేబుల్‌తోపాటు మరికొంత మంది సిబ్బంది ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఆపి సార్... మీరెవరు? అని ప్రశ్నించారు. భద్రతా సిబ్బంది ప్రశ్నతో అవాక్కైన శ్రీనివాస్.. నేనెవరో తెలియదా అని వారిని అడిగారు. అంతే కాదు మీ విషయం ఏంటో మీ సార్‌తో మాట్లాడతానని వారికి చెప్పి మీడియా పాయింట్ వద్దకు వెళ్లారు.

జిల్లాలు యథాతథం

జిల్లాల పునర్వ్యవస్థీకరణ యోచన లేదు.. కొత్త జిల్లాల ఏర్పాటు, పాత జిల్లాల తొలగింపు ఆలోచన లేదు



సభా పర్వం

» అమరావతిపై ఇన్వెస్టర్లకు వరద భయం

» ఇప్పుడు వారి పెట్టుబడులు హైదరాబాద్‌లో

» మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో లేవని రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. కొత్తగా జిల్లాలను ఏర్పాటు చేయడం కానీ, ఉన్న జిల్లాలను తొలగించేది కానీ లేదని చెప్పారు. ప్రశ్నోత్తరాల సందర్భంగా సోమవారం శాసనమండలిలో బీఆర్ఎస్ సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కల్వకుంట్ల కవిత తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సమాధానం చెబుతూ.. రాష్ట్రానికి రావలిసిన నిధుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపగానే వ్యాగన్‌లలో డబ్బుకట్టలు రావని వ్యాఖ్యానించారు. తెలంగాణ దేశంలోని ఒక రాష్ట్రమని రాష్ట్రానికి రావలిసిన నిధుల కోసం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతిపాదనలు రూపొందించి నివేదించడం జరుగుతుందన్నారు. కానీ, కేంద్రంలో ఒక పార్టీ, రాష్ట్రంలో మరో పార్టీ అధికారంలో కొనసాగుతున్న క్రమంలో రావలిసిన నిధుల విడుదల పరిస్థితి ఎలా ఉంటుందో తెలిసిందేనని పేర్కొన్నారు. మీరు (బీఆర్ఎస్) అధికారంలో ఉన్నప్పుడు ఏమేరకు నిధులు తీసుకురాగలిగారో... గతంలో ఎంపీలుగా పని చేసిన అనుభవంలో తెలిసిన విషయమేనని అన్నారు. ఏపీ రాజధాని అమరావతికి వరదలొచ్చాక.. పెట్టుబడిదారులు అక్కడ పెట్టేందుకు జంకుతున్నారంటూ మంత్రి పొంగులేటి.. అసెంబ్లీ లాబీల్లోని తన చాంబర్లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. వారు ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరుల్లో పెట్టుబడులు పెడుతున్నారన్నారు. ఏపీకి చంద్రబాబు సీఎం కాగానే రియల్ రంగ పెట్టుబడులు అక్కడికి పోతాయన్నది ప్రచారం మాత్రమేనని, వాస్తవంలో హైదరాబాద్ రియల్ వ్యాపారం పడిపోలేదని చెప్పారు. ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగంలో కొంత అభద్రతా భావం ఉండేదని, ఇటీవల అమరావతికి వరదలు వచ్చాక అది తొలగి పోయిందని అన్నారు. పెట్టుబడిదారులంతా మళ్లీ ఇప్పుడు తెలంగాణ బాట పట్టారని, గత మూడేళ్ల రాబడులతో పోలిస్తే తెలంగాణలో స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్ ఆదాయం పెరిగిందని వివరించారు. మూడు నెలల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారమూ పెరిగిందని తెలిపారు. హైడ్రా విషయంలోనూ మొదట్లో తప్పుడు ప్రచారం జరిగినా ఇప్పుడు ప్రజలు వాస్తవాలు తెలుసుకున్నారని, హైడ్రా పట్ల వారిలో భయం తొలగిపోయిందని చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కపై ప్రివిలైజ్ మోషన్ పెట్టాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కోరడం అర్థరహితమన్నారు. తెలంగాణ అప్పులు రూ. 3.89 లక్షల కోట్లని ఆర్బీఐ నివేదిక స్పష్టం చేస్తుందంటూ మాట్లాడుతున్న కేటీఆర్.. కార్పొరేషన్ రుణాలతో కలిపి ఎంత మేరకు అప్పు అయిందీ బయటపెట్టాలని, కార్పొరేషన్ల పేరుతో చేసిన అప్పులూ ప్రభుత్వ ఖాతాలోకే వస్తాయన్న సంగతి ఆయన తెలుసుకోవాలని సూచించారు. కార్పొరేషన్ రుణాలతో కలుపుకుని తెలంగాణ అప్పులు రూ.7.20 లక్షల కోట్లని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వస్తే బాగుంటుందని, అసెంబ్లీలో ఆయనతో కూర్చుని మాట్లాడాలన్న కోరిక వ్యక్తిగతంగా తనకు ఉందని తెలిపారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకతా లేదని, వైఎస్ఆర్ హయాంలోనూ ఇలానే ప్రచారం జరిగిందని, ఆ తర్వాత రెండు, మూడేళ్లలో వర్షాలు పడి అన్నీ సర్దుకున్నాయని పేర్కొన్నారు. అదానీ విషయంలో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానమే ఇక్కడా అమలవుతుందని చెప్పారు.

భూమిలేని 15 లక్షల కుటుంబాలకు లబ్ధి

భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయంతో 15లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని పొంగులేటి వెల్లడించారు. ఈ పథకానికి రూ.వెయ్యి కోట్లు విడుదల చేయనున్నట్లు చెప్పారు. సంక్రాంతికి రైతు భరోసా విడుదల చేయనున్నామని, ఆసరా పెన్షన్ల విడుదలకు యత్నిస్తున్నామని చెప్పారు. సినీపరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, తమకు సినిమా వాళ్లు, జర్నలిస్టులు, ప్రజలు అందరూ సమానమేనని స్పష్టం చేశారు.

మీడియా పాసుల్లో తెలంగాణ తల్లి బొమ్మ

అసెంబ్లీ సమావేశాలను కవర్ చేసే జర్నలిస్టులకు ప్రభుత్వం అందించే కొత్త గుర్తింపు కార్డుల్లో 'తెలంగాణ తల్లి' బొమ్మను పొందుపరచాలని అసెంబ్లీ డిప్యూటీ కార్యదర్శిని మంత్రి పొంగులేటి ఆదేశించారు. కొత్తగా అందించబోయే కార్డుల రంగును కూడా మార్చాలన్నారు. అసెంబ్లీలో మీడియాకు సౌకర్యాలు సరిగా లేవని, భోజనంలో నాణ్యత లోపిస్తుందంటూ మీడియా ప్రతినిధులు ఆయన దృష్టికి తెచ్చారు. లాబీలో డ్యూటీ చేసే జర్నలిస్టులు కూడా బయట మీడియా పాయింట్ దగ్గరకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. వెంటనే అసెంబ్లీ డిప్యూటీ సెక్రటరీని పిలిపించిన ఆయన.. తానే మీడియా ప్రతినిధులతో కలిసి భోజనం చేస్తానని, నాణ్యత లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

సర్పంచుల బిల్లులపై దుమారం

(మొదటపేజీ తరువాయి)





ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకొని బీఆర్ఎస్ నేతలకు సభలో మాట్లాడే అవకాశం కల్పిస్తామన్నారు. అయినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తగ్గలేదు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి మాట్లాడారు. సభపైనా, స్పీకర్‌పైనా బీఆర్ఎస్ నేతలకు గౌరవం లేదా? అని ప్రశ్నించారు. సభా మర్యాదను మంటగలుపుతున్నారని మండిపడ్డారు. కాగా, లగచర్ల రైతుల అంశంపై చర్చ జరపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ దాన్ని తోసిపుచ్చారు. రాష్ట్రంలో సర్పంచులకు బిల్లుల చెల్లింపుపై సభలో దుమారం రేగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నాటి బిల్లులే పెండింగ్‌లో ఉన్నాయని, అది బీఆర్ఎస్ కాదని.. 'బకాయిల రాష్ట్ర సమితి' అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. బిల్లులపై మంత్రి సరైన సమాధానం ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. బడా కాంట్రాక్టర్లకు ఒక్క నవంబరు నెలలోనే రూ.1,200 కోట్ల బిల్లులు చెల్లించిన ప్రభుత్వం.. రూ.లక్షల్లో ఉండే సర్పంచుల బిల్లులను చెల్లించడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. సర్పంచుల పాలిట కాంగ్రెస్ హస్తం భస్మాసుర హస్తమైందన్నారు. సభ ప్రారంభం కాగానే స్పీకర్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్తుల పెండింగ్ బిల్లులపై మంత్రి సీతక్క సమాధానమిస్తూ ఈ ఏడాది నవంబరు 1 నాటికి సర్పంచులకు చెల్లించాల్సిన బిల్లుల మొత్తం రూ.691.93 కోట్లుగా ఉన్నట్లు చెప్పారు. ఇవన్నీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి వచ్చిన వారసత్వ బిల్లులేనని, 2014 నుంచి కూడా పెండింగ్ బిల్లులు ఉన్నాయని తెలిపారు. అప్పటి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ఒక్క సంతకం చేస్తే ఈ బిల్లుల చెల్లింపు జరిగిపోయేదని, అప్పుడు ఆ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం వల్ల సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీలకు రూ.740 కోట్లు, బీఆర్ఎస్ హయాంలో పెండింగ్ పెట్టిన ఉపాధి హామీ పథకం బిల్లుల నిధులు రూ.450 కోట్లు కూడా విడుదల చేశామని చెప్పారు. 'మన ఊరు-మన బడి' పథకం కింద గత ప్రభుత్వం రూ.1,100 కోట్ల విలువైన పనులు చేయించిందని, ఇందులో రూ.800 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. 15వ ఆర్థిక సంఘం కింద కేంద్రం నుంచి నిధులు రాలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా పెండింగ్ బిల్లుల సొమ్మును చెల్లిస్తామని తెలిపారు. హరీశ్ మాట్లాడుతూ.. బిల్లుల గురించి గవర్నర్‌ను, మంత్రులను కలిసి మొర పెట్టుకుందామని వస్తే అరెస్టులు చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల బిల్లులు విడుదల చేయకుండా కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. వీరికి 9 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాగా, రానున్న నాలుగేళ్లలో రాష్ట్రంలో 17 వేల కిలోమీటర్ల రోడ్లను నిర్మించనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు.

వెల్‌లోకి దూసుకెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

సభలో గందరగోళం కొనసాగుతుండగానే పర్యాటక విధానంపై మంత్రి జూపల్లి కృష్ణారావును మాట్లాడాలని స్పీకర్ కోరారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక స్థితిని దిగజార్చింది బీఆర్ఎస్సేనని మండిపడ్డారు. జూపల్లి మాట్లాడుతుండగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెల్‌లోకి దూసుకెళ్లారు. వారి చేతుల్లో ఉన్న ప్లకార్డులను తీసుకోవాలని మార్షల్స్‌ను స్పీకర్ ఆదేశించారు. ప్లకార్డులను తీసుకునేందుకు యత్నించగా ఎమ్మెల్యేలు ప్రతిఘటించారు. ఆ గందరగోళం మధ్యనే సభను స్పీకర్ మంగళవారానికి వాయిదా వేశారు.

పారిశ్రామిక పార్కులకు 13,741 ఎకరాల గుర్తింపు: శ్రీధర్‌బాబు



రాష్ట్రంలోని 35 పారిశ్రామిక పార్కుల కోసం మొత్తం 13,741 ఎకరాలను గుర్తించామని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఇందులో 2,338 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా, 7,638 ఎకరాలు అసైన్డ్ భూమి అని, మరో 3,765 ఎకరాలు పట్టా భూమి అని వివరించారు. పారిశ్రామిక పార్కుల్లోకి అనుమతించిన సంస్థలు, ఉత్పత్తి ప్రారంభించని సంస్థల నుంచి భూమిని వెనక్కి తీసుకోవడం తదితర అంశాలను పరిశీలించడానికి కమిటీని వేశామని బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు పెరుగుతాయి

» సుమారు 34 అసెంబ్లీ, 7 ఎంపీ సీట్లు పెరగొచ్చు

» రాజకీయాల్లో హుందాతనం ఉండాలి

» కేటీఆర్, హరీశ్‌కు అది తెలియదు: కోమటిరెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభా గణన తరువాత దేశంలో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని, దాంతో రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు పెరుగుతాయని ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శాసనసభ విరామ సమయంలో అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మీడియాతో సోమవారం ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పునర్విభజనతో తెలంగాణలో సుమారు 34 అసెంబ్లీ స్థానాలు, 7 పార్లమెంటు స్థానాలు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. జమిలి ఎన్నికలపై కేంద్రం అన్ని అంశాలను సిద్ధం చేసుకుందన్నారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని, అది చాలా ముఖ్యమన్నారు. కానీ దురదృష్టవశాత్తు కేటీఆర్, హరీశ్‌రావులకు హుందాతనం లేదన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామన్న నమ్మకం లేకనే.. కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని వ్యాఖ్యానించారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి ఐదారుగురు సభ్యులున్నా కూడా కాంగ్రెస్ తరఫున భట్టి విక్రమార్క సభకు హాజరయ్యారని, అలాంటిది 30 మంది ఎమ్మెల్యేలున్నా.. కేసీఆర్ ఎందుకు రావడం లేదంటూ నిలదీశారు. ప్రతిపక్ష హోదా లేకపోయినా.. పార్లమెంటుకు తమ జాతీయ నాయకులు ఖర్గే వెళుతున్నారంటూ గుర్తుచేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రతిపక్ష నేత పాత్ర పోషించాలని, ఆయన ఏ విషయం గురించి ప్రశ్నించినా సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని.. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్‌లాంటి నేతలు కూడా ఒకానొక సమయంలో ఓటమి ఎని చవి చూశారన్నారు. ఇక ప్రజల్లో పరపతి లేని కేటీఆర్, హరీశ్ గురించి మాట్లాడొద్దని సీఎంకు చెప్పానని తెలిపారు. అందుకే పాలమూరు, నల్లొండ జిల్లాల్లో నిర్వహించిన సభల్లో వారి పేరు ఎత్తలేదన్నారు. పబ్లిక్‌లో వాళ్లిద్దరూ పెద్ద జోకర్లుగా మారారని ఎద్దేవా చేశారు. ఇక సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల విషయంలో బీఆర్ఎస్ సభ్యులు చెప్పిన గణాంకాలు తప్పని అన్నారు. శాసనసభ నిర్వహణపై బీఆర్ఎస్ వాళ్లకు మాట్లాడే హక్కు లేదని, గత పదేళ్లలో ఎన్ని రోజులు అసెంబ్లీని నిర్వహించారనే వివరాలు అసెంబ్లీ రికార్డుల్లో ఉంటాయని, అవి చూస్తే వాస్తవం తెలుతుందన్నారు. సీఎం, మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని చెప్పారు. ఇక కాంగ్రెస్ పార్టీలో, మంత్రివర్గ విస్తరణలో పదవులు ఎవరికి వస్తాయనేదానిపై ఎవరూ అంచనా వేయలేరని చెప్పారు. ఈ విషయంలో అధిష్ఠానం, ముఖ్యమంత్రిదే తుది నిర్ణయమన్నారు. అయితే మంత్రివర్గ విస్తరణలో పాలమూరు జిల్లా నుంచి వాకిటి శ్రీహరికి కచ్చితంగా అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో చావు నోట్లో తలపెట్టి వచ్చానని కేసీఆర్ అంటున్నారని.. కానీ వాస్తవంగా తెలంగాణ కోసం చావు నోట్లోకి వెళ్లొచ్చింది తానేనని చెప్పారు. దీక్ష చేసిన సమయంలో దాదాపు 17 కిలోలకు పైగా బరువు తగ్గి, నీరసించానని వివరించారు. కేసీఆర్‌లా తాను దొంగ దీక్ష చేయలేదన్నారు. ఇక ఉద్యమంలో ఒకాయనకు అగ్గిపెట్టె దొరకలేదంటూ హరీశ్‌రావును ఉద్దేశించి ఎద్దేవా చేశారు.

ఈ ఏడాదికి డిటెన్షన్ విధానం రద్దు!

» ఓయూ, జేఎన్‌టీయూ పరిధిలోని కళాశాలలతో త్వరలో సమావేశం

» శాసనసభలో మంత్రి దామోదర



హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా, జేఎన్‌టీయూ పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో అమలవుతున్న డిటెన్షన్ విధానాన్ని ఈ ఏడాది (2024-25) అమలు చేయబోమని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. రాష్ట్రంలో 40-50 ఏళ్ల నుంచి డిటెన్షన్ విధానం అమల్లో ఉందని గుర్తుచేశారు. అయితే రెండు వర్సిటీల్లో డిటెన్షన్ అమలుకు వేర్వేరు విధానాలు ఉండడంతో పాటు సిలబస్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలపై చర్చించడానికి వీలుగా త్వరలోనే కాలేజీ యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఉస్మానియా వర్సిటీ పరిధిలో బీఈ విద్యార్థులకు డిటెన్షన్ విధానం అమలుపై మజ్లిస్ నేత అక్బరుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రశ్నకు.. రాజనర్సింహ ఈ మేరకు జవాబు ఇచ్చారు. కరోనా కారణంగా 2020-21, 2022-23 విద్యాసంవత్సరంలో డిటెన్షన్ విధానం నుంచి మినహాయింపు ఇచ్చామని, 2023-24 నుంచి మళ్లీ అమల్లోకి వచ్చిందని మంత్రి చెప్పారు. అక్బరుద్దీన్ మాట్లాడుతూ.. జేఎన్‌టీయూలో పేపర్లలో కనీసం 25 శాతం ఉత్తీర్ణులైన, క్రెడిట్ స్కోర్ 25 ఉంటే ప్రమోట్/పాస్ చేస్తున్నారని, అదే ఓయూ పరిధిలో క్రెడిట్ స్కోర్ 50గా నిబంధన విధించారని చెప్పారు. రెండు వర్సిటీల పరిధిలో వేర్వేరుగా డిటెన్షన్ విధానం ఉండడంతో ఓయూ పరిధిలో ఇంజనీరింగ్ విద్యార్థులు డ్రాపౌట్లుగా మిగులుతున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్సిటీల్లో డిటెన్షన్‌తోపాటు సిలబస్‌ను ఏకరూపంగా అమలు చేయాలన్నారు.

లగచర్ల బాధితుల పక్షాన పోరాడతాం

» చర్చ పెట్టకుండా సీఎం పారిపోయారు

» రైతులకు క్షమాపణ చెప్పాలి: కేటీఆర్



లగచర్ల ఘటనలో రైతులకు బేడీలు వేసినందుకు అసెంబ్లీలో నిరసన తెలుపుతున్న కేటీఆర్, హరీశ్ తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూములివ్వబోమని చెప్పిన దళిత, బలహీనవర్గాల రైతులను రేవంత్ సర్కారు జైల్లో పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వారిపై కేసులు పెట్టడమే కాకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమన్నారు. కొడంగల్ ప్రజల తరఫున బీఆర్ఎస్, కేసీఆర్ ఉన్నారని.. అక్కడి రైతుల కోసం పోరాటం చేస్తామని చెప్పారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ, అరాచక తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. లగచర్ల రైతులు ముగ్గురు తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నారని, ఓ రైతుకు గుండెపోటు వస్తే బేడీలతో చికిత్స చేయించారని ధ్వజమెత్తారు. కొడంగల్ మీ జాగీరా..? రైతుల భూములు గుంజుకుంటారా? అని నిలదీశారు. లగచర్ల రైతుల అంశంపై చర్చించాలని పట్టుబట్టినా చర్చ పెట్టలేదని ఆరోపించారు. అసెంబ్లీలో చర్చ జరపాల్సి వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి సభను వాయిదా వేసుకొని పారిపోయారని విమర్శించారు. ఎమ్మెల్యే ప్రొటోకాల్ ఉల్లంఘనపై స్పీకర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఫార్మాసిటీకి 14 వేల ఎకరాలను సేకరించి పెడితే కాంగ్రెస్ ప్రభుత్వమే వద్దన్నదని, రైతులకు రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా జైలుకు పంపిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. లగచర్ల రైతుల అంశంపై చర్చించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో సభను వాయిదా వేశారు. దీంతో వారు శాసనసభ లోపలికి వెళ్లే దారిలో బైఠాయించి నిరసన తెలిపారు.

భట్టిపై హక్కుల ఉల్లంఘన నోటీసు

అప్పులపై సభను తప్పుదోవ పట్టించినందుకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చినట్లు కేటీఆర్ తెలిపారు. ఈ నోటీసుపై చర్చకు అనుమతించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరినట్లు చెప్పారు. అప్పులపై తప్పుడు ప్రకటన చేసినందుకు మంత్రి భట్టిపై చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం పార్టీ ఎమ్మెల్యేలతో వెళ్లి స్పీకర్‌ను కలిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. శాసనసభ నియమావళిలోని 168(1) నిబంధన ప్రకారం ఆర్థిక మంత్రికి నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. తెలంగాణ అప్పులు రూ.3.89 లక్షల కోట్లు అని ఆర్‌బీఐ చెబితే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ.7 లక్షల కోట్లు అంటూ తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. అప్పులపై నెలకు రూ.6,500 కోట్లు వడ్డీ కడుతున్నట్లు సీఎం, భట్టి అబద్ధాలు చెబుతున్నారని తెలిపారు. నెలకు రూ.2100 కోట్లు మిత్తి కడుతున్నట్లు కాగ్ చెబితే, రూ.2400 కోట్లని ఆర్‌బీఐ చెప్పిందని గుర్తుచేశారు. రేవంత్ సీఎం అయ్యాక ఢిల్లీలో పర్యాటక రంగం, రాష్ట్రంలో జైలు పర్యాటక రంగం బాగా అభివృద్ధి చెందిందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి 30 సార్లు, మిగతా మంత్రులంతా కలిసి 70సార్లు ఢిల్లీ వెళ్లి వచ్చారని, అందరూ కలిసి వందసార్లు వెళ్లినా వంద పైసలు కూడా తీసుకురాలేదని గుర్తుచేశారు. అసెంబ్లీ జరుగుతున్న సమయంలో భట్టి విధానపరమైన ప్రకటన చేయడం బాధ్యతారాహిత్యమే అన్నారు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలసాయం చేస్తామని సభలో కాకుండా మధిరలో ఎలా ప్రకటిస్తారని నిలదీశారు.

నేడు అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు

రైతులపై కేసులుపెట్టి, వారికి బేడీలు వేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు అన్ని నియోజకవర్గాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించనున్నట్లు బీఆర్ఎస్ ప్రకటించింది. లగచర్లపై ఇచ్చిన వాయిదా తీర్మానం మీద చర్చకు అనుమతించాలంటూ బీఆర్ఎస్ సభ్యులు శాసనమండలిలో నినాదాలు చేశారు. గందరగోళం నెలకొనడంతో మండలిని మంగళవారానికి వాయిదా వేశారు. రైతులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు మండలి ఛైర్మన్ చాంబర్ ఎదుట ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు.

ప్రభుత్వ సంస్థలు నిర్వీర్యం

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బీడీఎల్ సంస్థ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ వైపు నడిపిందన్నారు. జనవరి మొదటి వారంలో కార్మికుల కోసం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

ఓబీసీలకు కాంగ్రెస్ అన్యాయం

- కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్
- ముస్లింల రిజర్వేషన్లతో ఓబీసీలకు అన్యాయం : ఎంపీ లక్ష్మణ్

న్యూఢిల్లీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఓబీసీలకు కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసిందని కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ ఆరోపించారు. ఓబీసీలకు దక్కాల్సినవి ఆ పార్టీ దక్కనివ్వలేదని విమర్శించారు. వెనుకబడిన తరగతుల సాధికారత కేంద్రం డైరెక్టర్ తూళ్ల వీరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో 'ఓబీసీలు, సామాజిక సంస్కరణలు, గవర్నెన్స్' అనే అంశంపై డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో సోమవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి ఓబీసీలలో పరివర్తన కనిపిస్తోందని, స్వాభిమానంతో జీవించాలని కోరుకుంటున్నారని అన్నారు. ఓబీసీల అభివృద్ధికి ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఏపీ, తెలంగాణలో ముస్లింలకు ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేస్తూ, ఓబీసీలకు అన్యాయం చేస్తున్నారని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ ఆరోపించారు. కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదని, తమ పార్టీ సరైన సమయంలో స్పందిస్తుందని అన్నారు. రాజ్యాంగాన్ని పట్టుకుని రాహుల్‌గాంధీ తిరుగుతున్నారని, అయితే కాంగ్రెస్ హయాంలోనే ఎమర్జెన్సీని విధించారని విమర్శించారు. దేశంలో ప్రజలంతా జమిలి ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నారని, జమిలి ఎన్నికలతో దేశానికి మేలు జరుగుతుందని అన్నారు.

10,490 మంది మైనారిటీలకు కుట్టుమిషన్లు

- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించిన టీజీఎంఎఫ్‌సీ

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 10,490 పేద మైనారిటీ మహిళలకు కుట్టుమిషన్లు అందజేయనున్నారు. ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో భాగంగా కుట్టు మిషన్లు అందిస్తామని తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఈఎంఎఫ్‌సీ) చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్ తెలిపారు. ఈ పథకం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఆయన సోమవారం తన కార్యాలయంలో కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కాంతి వెస్లీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోత్వాల్ మాట్లాడుతూ.. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్ మహిళలు ఈ పథకం దరఖాస్తుకు అర్హులన్నారు. అర్హత, ఆసక్తిగల ఆడపడుచులు అధికార వెబ్‌సైట్ gobmms.cgg.gov.in ఆన్‌లైన్లో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బూరుగుపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు

మోమిన్‌పేట్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం బూరుగుపల్లి గ్రామంలో ప్రజలు దురదతో ఇబ్బంది పడుతున్నారని 'ఇదెక్కడి దురదరా బాబు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యాధికారులు స్పందించారు. డాక్టర్ శాలిమ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు రెండు రోజులుగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి దురదతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించి మందులను అందజేశారు. సోమవారం పంచాయతీ ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శాలిమా మాట్లాడుతూ.. వేడి చేసి చల్లార్చిన నీటినే తాగాలని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దాదాపు 200 మందికి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థినులపై ఎలుకల దాడి

కీసర, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): కీసరలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థినులపై ఎలుకలు దాడి చేశాయి. సనత్‌నగర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు చెందిన గురుకుల పాఠశాలలను కీసరలో ఏర్పాటు చేయగా ఆదివారం రాత్రి నిద్రించే సమయంలో కొందరు పదో తరగతి విద్యార్థినులపై ఎలుకలు దాడి చేశాయి. ఈ విషయాన్ని వారు సోమవారం ఉదయం ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గుట్టుచప్పుడు కాకుండా వారు విద్యార్థినులకు కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. ఎందుకైనా మంచిదని వ్యాక్సిన్ కూడా ఇప్పించారు. అయితే ఈ విషయం వైరల్ కావడంతో మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. పాలకుల డొల్లతనం బయటపడిందంటూ ట్వీట్ చేశారు.



ఎలుకల దాడిలో గాయపడిన గురుకుల విద్యార్థినులకు కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స

భువనగిరి గురుకులంలో అమలుకాని కొత్త మెనూ

- కేర్ టేకర్ సస్పెన్షన్.. ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీస్

భువనగిరి టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నలభై శాతం పెరిగిన డైట్ చార్జీలతో రెండు రోజుల క్రితం అమలులోకి వచ్చిన నూతన డైట్‌ను యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అమలు చేయడం లేదు. దాంతో సదరు గురుకుల సిబ్బందిపై కలెక్టర్ క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఎం. హనుమంతరావు పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి సీఎం కప్ టోర్నీని ప్రారంభించిన అనంతరం గురుకులాన్ని తనిఖీ చేశారు. పెరుగు నాణ్యంగా లేకపోవడం, మెనూ ప్రకారం కూరలు వండకపోవడం, డైనింగ్ హాల్‌లో అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నూతన డైట్‌ను ఎందుకు అమలు చేయడం లేదని, డైట్ చార్ట్‌ను డైనింగ్ హాల్‌లో ఎందుకు ప్రదర్శించలేదని ప్రశ్నించారు. ఉడకబెట్టిన గుడ్ల పొలుసును విద్యార్థులతో తీయిస్తుండటంపై, అలాగే గుడ్డు పరిమాణంపై మండిపడ్డారు. నూతన డైట్ అమలులో నిర్లక్ష్యం చూపిన పాఠశాల కేర్ టేకర్ రమేష్‌ను సస్పెండ్ చేసి, ప్రిన్సిపాల్ మల్లికార్జున్‌రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ స్వయంగా మధ్యాహ్న భోజనం వడ్డించారు.

వణికిస్తున్న చలి!

- ఆదిలాబాద్ జిల్లా అర్లిలో 6.0 డిగ్రీల ఉష్ణోగ్రత
- పఠాన్‌చెరులో 6.4 డిగ్రీలు నమోదు
- చలి తీవ్రతకు దేవాలయ వాచ్‌మన్ మృతి
- నల్లగొండ జిల్లాలో ఘటన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): చలితో రాష్ట్ర ప్రజలు గజ.. గజ వణికిపోతున్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్ మండలం అర్లి(టి)లో అత్యల్పంగా 6.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా మారుమూల గ్రామాలను దట్టమైన పొగమంచు కప్పేయడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు హైదరాబాద్‌లోనూ చలితీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. సోమవారం పఠాన్‌చెరులో అత్యల్పంగా 6.4 డిగ్రీలు, రాజేంద్రనగర్ 8.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో గ్రేటర్ పరిధిలో నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రతలు ఇవేనని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. మరో రెండు రోజుల పాటు గ్రేటర్‌లో ఇదే తరహా పరిస్థితులు కొనసాగుతాయని వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు, వికారాబాద్ జిల్లా బంట్వారంలో 6.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అటు సంగారెడ్డి జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సోమవారం జహీరాబాద్ మండలం సత్వార్‌లో కనిష్ఠంగా 6.6 డిగ్రీలు నమోదైంది. దీంతో చలి తట్టుకోలేక ప్రజలు చలిమంటలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కాగా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం రాత్రి చలి తీవ్రతను తట్టుకోలేక నర్సింగ్ భట్ల గ్రామానికి చెందిన హనుమాన్ దేవాలయ వాచ్‌మన్ చింతకాయల సత్తయ్య మృతి చెందాడు. చిన్నపిల్లలు, సీనియర్ సిటిజన్లు చలిగాలుల బారిన పడకుండా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్లు సూచిస్తున్నారు.



ఆదిలాబాద్ పట్టణాన్ని కమ్మేసిన పొగ మంచు

సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ!

పంట రుణం ఏడాదిలోపు రెన్యువల్ చేస్తే 7% వడ్డీ.. అందునా అసలు, వడ్డీ చెల్లిస్తే 3% వడ్డీ మినహాయింపు

- ఏడాది దాటితే రైతుపైనే భారం.. 12శాతం వడ్డీ
- రెన్యువల్ చేసుకున్నప్పటికీ రుణమాఫీ పథకం వర్తింపు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకర్లు

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంట రుణాలు తీసుకున్న కొందరు రైతులు, రుణమాఫీ అవుతుందని ఎదురుచూస్తూనో.. ఆర్థిక సమస్యలతోనో అసలు బ్యాంకులవైపే చూడకపోవడంతో వారిపైనే వడ్డీ భారం రోజు రోజుకు పెరుగుతోంది. స్వల్పకాలిక పంటరుణాలు ఏడాదిలోపు తిరిగి చెల్లించకపోతే రైతులపై అదనపు వడ్డీ భారం పడుతుంది. ప్రభుత్వం విడతలవారీగా రుణమాఫీ చేస్తుండటం, కొందరు రైతులకు రుణమాఫీ వర్తించకపోవటం, మరికొందరు రైతులకు అర్హత ఉన్నప్పటికీ సాంకేతిక సమస్యలతో మాఫీ కాకపోవటం లాంటి రకరకాల కారణాలతో రుణాలను రెన్యువల్‌కు చిక్కులు ఏర్పడుతున్నాయి. రుణాలను రెన్యువల్ చేసుకుంటే రుణమాఫీ కాదేమోనన్న ఆందోళన రైతుల్లో ఉంది. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల మంది పట్టాదారులుండగా వీరిలో 45 లక్షల మంది రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. ఈ 45 లక్షల పంట రుణ ఖాతాల్లో ఈ ఏడాది కేవలం 25 లక్షల ఖాతాలు మాత్రమే రెన్యువల్ అయ్యాయి. ఈ క్రమంలో బ్యాంకర్లు రెన్యువల్‌పై దృష్టిసారించి, రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రెన్యువల్ చేసుకున్నంత మాత్రాన... రుణమాఫీ పథకం వర్తించకుండా పోదని చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన నిర్ణీత గడువులో (2018 డిసెంబరు 12 తేదీ నుంచి 2023 డిసెంబరు 9 వరకు) ఉన్న బకాయిలకు రుణమాఫీ వర్తిస్తుందని స్పష్టంగా చెబుతున్నారు. నిర్ణీత వ్యవధిలో రెన్యువల్ చేసుకోకపోతే 4 శాతం వడ్డీ రాయితీ కోల్పోతారని రైతులకు బ్యాంకు ఫీల్డు ఆఫీసర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులు పంటరుణం తీసుకున్న తేదీ నుంచి సరిగ్గా ఏడాదికి రెన్యువల్ చేసుకుంటే.. కేవలం 7 శాతం వడ్డీ పడుతుంది. పైగా సకాలంలో అసలు, వడ్డీ తిరిగి చెల్లించినందుకుగాను కేంద్ర ప్రభుత్వం 3 శాతం వడ్డీ రాయితీ ఇస్తుంది. అంటే... ఏడాది లోపు అప్పు తిరిగి చెల్లించిన రైతు... కేవలం 4 శాతం వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది. 3 శాతం వడ్డీ చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఒకవేళ ఏడాది దాటితే... 12 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. అంటే సాధారణ వడ్డీ 7 శాతం, అదనపు వడ్డీ 5 శాతం కలిపి చెల్లించాల్సి వస్తుంది. దీంతో రైతులకు ఆర్థిక భారం పడుతుంది. ఇదిలాఉండగా స్వల్పకాలిక పంట రుణాలు తీసుకున్న రైతులకు రెన్యువల్ చేసుకోవటానికి... ఏడాది నుంచి రెండేళ్ల వరకు అదనపు కాలపరిమితి ఉంటుంది. కాస్త వడ్డీ ఎక్కువైనా... రెండేళ్లలోపు రెన్యువల్ చేసుకుంటే సమస్య ఉండదు. రెండేళ్లు దాటితే మాత్రం... మొండి బకాయిల(ఎన్‌పీఏ) ఖాతాల్లో కలిపేస్తారు. అప్పుడు రైతులు ఎలాంటి లావాదేవీలు నిర్వహించటానికి ఉండదు. వడ్డీ కూడా మోత మోగుతుంది. 2018 నుంచి ఇప్పటివరకు చాలా ఖాతాలు మొండి బకాయిల జాబితాలో పడి ఉన్నాయి.



రుణమాఫీ పథకంతో ముడి

రైతులు పంటరుణాల రెన్యువల్‌కు రుణమాఫీ పథకంతో ముడి పెడుతున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నాలుగు విడతల్లో రుణమాఫీ చేపట్టింది. ఇప్పటివరకు 25.36 లక్షల మంది రైతులకు రూ. 20,617 కోట్ల రుణమాఫీ చేసింది. రూ. 2 లక్షల వరకు బకాయిలున్న, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ పూర్తిచేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. సాంకేతిక సమస్యలతో ఎవరైనా కొందరు రైతులు మిగిలిపోతే.. వారి ఖాతాలను వ్యవసాయశాఖ పరిశీలిస్తుందని చెప్పారు. అయితే రెండు లక్షలకు పైగా అప్పులున్న రైతులకు ఎప్పుడు మాఫీ చేస్తారనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. జీవో విడుదలచేసిన సమయంలో మాత్రం రూ. 2 లక్షలకు పైనున్న మొత్తాన్ని రైతులు చెల్లిస్తే.. ప్రభుత్వం రూ. 2 లక్షలు మాఫీ చేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతమున్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో రూ. 2 లక్షలకు మించి బకాయిలున్న రైతులకు ఇప్పట్లో మాఫీచేసే పరిస్థితులు కనిపించటంలేదు. రైతులు మాత్రం రుణమాఫీ లెక్కలు పూర్తిగా తేలిన తర్వాతే రెన్యువల్ సంగతి చూద్దామనే ఆలోచనతో ఉన్నారు. అయితే బ్యాంకర్లు మాత్రం రెన్యువల్ చేయించటానికే ప్రయత్నాలు చేయిస్తున్నారు. రుణమాఫీ పథకంలో లబ్ధిదారులు అయినా, కాకపోయినా

తెలంగాణ పోలీసులకు అంతర్జాతీయ గుర్తింపు

- వినాయక నిమజ్జనంలో ఏఐ టెక్నాలజీ వినియోగానికి పురస్కారం



హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వినాయక విగ్రహాల నిమజ్జనంలో కృత్రిమ మేధ(ఏఐ) వినియోగించినందుకు రాష్ట్ర పోలీసులకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ ఏడాది గణేష్ చతుర్థి ఉత్సవాల్లో లక్షన్నరకు పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. లక్షలాది మంది పాల్గొన్న ఈ ఉత్సవాల్లో తొలిసారి ఏఐ, జియోగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం(జీఐఎస్) వినియోగించారు. భారీ సమావేశాలు, ట్రాఫిక్ నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ కోసం ఈ పరిజ్ఞానాన్ని పోలీసులు వినియోగించారు. తొక్కిసలాట జరగకుండా ఏఐ టెక్నాలజీతో అనుసంధానమైన డ్రోన్లను వినియోగించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం అమలుచేసిన ఈ విధానం అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందింది. ప్రజారక్షణలో ఆధునిక పరిజ్ఞానం వినియోగిస్తున్న ప్రభుత్వాలు, సంస్థలకు.. ఎల్అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ ఐఎస్‌జీ, సీఎన్‌బీసీ-టీవీ18 సంస్థలతో కలిసి అవార్డులు అందించగా.. డిజిటల్ ఇంజినీరింగ్ అవార్డులలో చాలెంజర్ క్యాటగిరీలో అత్యుత్తమ స్థిరత్వ కార్యక్రమ(టాప్ సస్టెయినబిలిటీ ఇనిషియేటివ్) పురస్కారం తెలంగాణ పోలీసు శాఖకు ప్రకటించారు. ఈ క్యాటగిరీలో ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన 230 నామినేషన్ల నుంచి తెలంగాణ పోలీసులకు పురస్కారం దక్కింది. స్మార్ట్ సిటీ టెక్నాలజీలో తెలంగాణ ప్రభుత్వం కొత్త ప్రామాణికాలను నిర్దేశించిందని అవార్డుల కమిటీ ప్రశంసించింది. ఈ అవార్డు దక్కడంపై అదనపు డీజీపీ వి.వి.శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో టెక్నాలజీ వినియోగానికి ఈ పురస్కారం దక్కడం మరింత ప్రోత్సాహాన్ని అందించిందని అన్నారు.

భారత భద్రతకు భంగం కలిగించేలా వ్యవహరించం

- ప్రధాని మోదీతో శ్రీలంక అధ్యక్షుడు

న్యూఢిల్లీ, డిసెంబరు 16: భారత భద్రతకు భంగం కలిగించేలా శ్రీలంక భూభాగాన్ని ఉపయోగించుకునేందుకు ఎవ్వరినీ అనుమతించబోమని శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిశనాయకే స్పష్టం చేశారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం భారతదేశ పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం ఢిల్లీలో ప్రధానమంత్రి మోదీతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, సముద్ర భద్రతా సహకారానికి సంబంధించిన అంశాలు, రక్షణ సహకార ఒప్పందం, తదితర అంశాల గురించి చర్చించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. భేటీ అనంతరం దిశనాయకే మాట్లాడుతూ, పౌర సంబంధాలను డిజిటలైజ్ చేయడంలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించిందని, శ్రీలంక కూడా అదేబాటలో నడుస్తుందని చెప్పారు. శ్రీలంకలోని హంబన్‌తోట పోర్టులో చైనా కార్యకలాపాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ భారత భద్రతకు భంగం కలిగించేలా తమ భూభాగాన్ని ఉపయోగించుకునేందుకు ఎవ్వరినీ అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పుడు శ్రీలంకకు భారత్ 5 బిలియన్ డాలర్ల విలువైన గ్రాంట్లు, క్రెడిట్ లైన్స్ ఇచ్చిందని దానికి తాము కృతజ్ఞులై ఉంటామని అన్నారు. శ్రీలంకకు ఎల్లప్పుడూ భారత్ మద్దతు ఉంటుందని మోదీ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సెప్టెంబరులో శ్రీలంక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి భారత పర్యటనకు వచ్చిన దిశనాయకే ఆదివారం విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్, అజిత్ డోభాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రపతి ముర్మూతో కూడా ఆయన సమావేశం కానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్ పరీక్షల్లో భాగంగా ఎథిక్స్ హ్యూమన్ వ్యాల్యూ పరీక్షలను జనవరి 29వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నారు. జనవరి 30వ తేదీన ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలను ఉదయం 10 నుంచి 1 గంట వరకు నిర్వహించాలని అధికారులు సూచించారు. జనవరి 31వ తేదీన ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్షలను, ఫిబ్రవరి 1వ తేదీన ఇంటర్ సెకండ్ ఇయర్ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు.

ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్స్!

ఫిబ్రవరి 3వ తేదీ నుంచి రాష్ట్రంలో ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ పరీక్షలు ఫిబ్రవరి 3 నుంచి 22వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రతీ రోజు రెండు సెషన్స్‌లో ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. మొదటి సెషన్‌ను ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, రెండవ సెషన్‌ను మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు.



ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల షెడ్యూల్ వివరాలు (మొదటి ఏడాది పరీక్షలు)

తేదీ	పరీక్ష పేరు
05-03-2025	సెకెండ్ ల్యాంగ్వేజి పేపర్-1
07-03-2025	ఇంగ్లీషు పేపర్-1
11-03-2025	మ్యాథమేటిక్స్ పేపర్-1ఏ, బోటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1
13-03-2025	మ్యాథమేటిక్స్ పేపర్-1బి, జంతుశాస్త్రం పేపర్-1, చరిత్ర పేపర్-1
17-03-2025	ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్ పేపర్-1
19-03-2025	కెమిస్ట్రీ పేపర్-1, కామర్స్ పేపర్-1
21-03-2025	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1, బ్రిడ్జికోర్సు మ్యాథ్స్ పేపర్-1
24-03-2025	మోడరన్ లాంగ్వేజి పేపర్-1, జాగ్రఫీ పేపర్-1

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల షెడ్యూల్ వివరాలు (రెండవ ఏడాది పరీక్షలు)

తేదీ	పరీక్ష పేరు
06-03-2025	సెకెండ్ ల్యాంగ్వేజి పేపర్-2
10-03-2025	ఇంగ్లీషు పేపర్-2
12-03-2025	మ్యాథమేటిక్స్ పేపర్-2ఏ, బోటని పేపర్-2, పొలికల్ సైన్స్ పేపర్-2
15-03-2025	మ్యాథమేటిక్స్ పేపర్-2బి, జంతుశాస్త్రం పేపర్-2, చరిత్ర పేపర్-2
18-03-2025	ఫిజిక్స్ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2
20-03-2025	కెమిస్ట్రీ పేపర్-2, కామర్స్ పేపర్-2
22-03-2025	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2, బ్రిడ్జికోర్సు మ్యాథ్స్ పేపర్-2
25-03-2025	మోడరన్ లాంగ్వేజి పేపర్-2, జాగ్రఫీ పేపర్-2

మార్చి నెలాఖరు నుంచి టెన్త్ పరీక్షలు!

ఈ ఏడాది పదవ తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ ఒకటి రెండు రోజుల్లో విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి అధికారులు కసరత్తును చేస్తున్నారు. మార్చి నెలాఖరు నుంచి ఈ పరీక్షలు ప్రారంభం అయ్యే విధంగా షెడ్యూల్‌ను రూపొందిస్తున్నట్టు సమాచారం. ఏడు రోజుల పాటు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు.

ఉస్మానియాలో అందుబాటులోకి 15 ఈసీజీ యంత్రాలు

- ఆంధ్రజ్యోతి కథనంతో స్పందించిన అధికారులు
- హర్షం వ్యక్తం చేసిన రోగులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంగళ్‌హాట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియాలో రోగులకు 15 ఈసీజీ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. 'గుండెను పరీక్షించలేని ఉస్మానియా' శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈసీజీ యంత్రాలు పనిచేయకపోవడంతో గంటల తరబడి ఔట్ పేషెంట్ విభాగంలో ఈసీజీ కోసం వేచి చూస్తున్న రోగుల కష్టాలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకు వచ్చింది. దాంతో అధికారులు స్పందించారు. పాడైన రెండు ఈసీజీలకు కొత్త కెబుళ్లను తెప్పించి వాటిని బాగు చేయించారు. అదే విధంగా గోదాంలో కొద్ది రోజులుగా దాచి ఉంచిన రెండు కొత్త ఈసీజీ యంత్రాలను బయటకు తీసి అందుబాటులోకి తీసుకువచ్చారు. మరో ఐదింటిని బాగు చేయించేందుకు టెక్నీషియన్లను సంప్రదించినట్లు సమాచారం. ప్రస్తుతం 15 యంత్రాలు వాడుకలోకి తీసుకురాగా మరో 7 మాత్రం ఇంకా బాగు చేయించాల్సి ఉందని ఉస్మానియా అధికారులు తెలిపారు. మొత్తానికి ఈసీజీ యంత్రాలు అందుబాటులోకి రావడంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



భూతప్పలు వచ్చే దారిలో పడుకున్న భక్తులు.. భక్తులను తొక్కుకుంటూ వస్తున్న భూతప్పలు

వైభవంగా భూతప్పల ఉత్సవం

కాలి స్పర్శతో వ్యాధులు నయమవుతాయన్నది వారి నమ్మకం. నేలపై బోర్ల పడుకుంటే... భూతప్పలు వారిపై నుంచి నడుస్తూ వెళ్తారు. దీంతో తమకు స్వాంత్వన వస్తుందన్నది వారి విశ్వాసం. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం భక్తరహళ్లిలో వెలసిన నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భూతప్పల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, సంతానంలేని వారు వేకువజామునే స్నానం చేసి, తడిదుస్తులతోనే భూతప్పలు వచ్చే దారిలో పడుకుంటారు. వారిపై నుంచి నడిచి వెళ్లే భూతప్పల కాలిస్పర్శతో వ్యాధులు నయమవుతాయనీ, సంతానం ప్రాప్తిస్తుందనీ భక్తుల విశ్వాసం. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు భూతప్పల ఉత్సవం సాగింది. అనంతరం భూతప్పలు నరసింహస్వామి ఆలయంలోకి చేరుకున్నారు. - మడకశిర రూరల్, ఆంధ్రజ్యోతి

డీఐజీ, ఐజీ నివేదికల్లో వ్యత్యాసాలు!

- రైతుకు సంకెళ్ల ఘటనలో పొంతన కుదరని అంశాలెన్నో
- డీఐజీ విచారణలో ప్రస్తావనకు రాని జైలర్ పేరు
- ఐజీ విచారణ జరుగుతుండగానే ఆయనపై వేటు
- ముగిసిన విచారణ... నేడు డీజీకి నివేదిక ఇచ్చే చాన్స్

హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : లగచర్ల రైతుకు సంకెళ్లు, ఆ తర్వాతి పరిణమాలను చాలా సీరియస్‌గా పరిగణిస్తున్నామని ప్రభుత్వ పెద్దలు చెతుతుండగా.. జైళ్ల శాఖ అధికారుల వ్యవహార సరళి మాత్రం ఆ స్థాయిలో కనిపించడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటనలో జైళ్ల శాఖ డీఐజీ, ఐజీ నివేదికల మధ్య పొంతన కుదరకపోవడం విమర్శలకు తావిస్తోంది. విషయం వెలుగులోకి వచ్చిన వెంటనే డీఐజీ ప్రాథమిక విచారణ చేపట్టి నివేదిక అందజేయగా, అందులో జైలర్ సంజీవరెడ్డి పేరును ఎక్కడా ప్రస్తావించలేదు. ఐజీ విచారణ చేపట్టిన తర్వాత.. ప్రాథమికంగా అందజేసిన వివరాల మేరకు జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా జైలర్‌ను సస్పెండ్ చేశారు. అయితే, డీఐజీ, ఐజీ నివేదికల మధ్య కొన్ని అంశాల్లో వ్యత్యాసం ఉన్నట్లు తెలిసింది. విచారణలో భాగంగా సంగారెడ్డి జైల్లోని 10 మంది అధికారులు, సిబ్బందిని ప్రశ్నించిన ఐజీ.. ఖైదీల ఫోన్ సంభాషణలను పరిశీలించినట్లు తెలిసింది. అలాగే, హీర్యా నాయక్‌ను ఆస్పత్రికి తరలించిన రోజు ఏం జరిగింది? అంతకు ముందు రోజుల్లో జరిగిన పరిణామాలు, లగచర్ల ఖైదీలను ఎవరెవరు ములాఖత్‌ల్లో పరామర్శించారు? ఆ సమయంలో జైలు అధికారులు వారికి కల్పించిన "ప్రత్యేక" సదుపాయాలు.. ఇలా అన్ని అంశాలను నివేదికలో పొందుపర్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మొత్తం వ్యవహారంపై విచారణ పూర్తి కావడంతో సమగ్ర నివేదికను డీజీ సౌమ్యా మిశ్రాకు మంగళవారం అందించేందుకు ఐజీ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. జైలు సూపరింటెండెట్‌పై చర్యల నిమిత్తం ఆ నివేదికను హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తాకు అందించనున్నారు. అలాగే, ఈ విషయమై నిఘా విభాగం విచారణ సైతం కొనసాగుతోంది. మరోవైపు.. జైళ్ల శాఖ అధికారులు, సిబ్బంది పనితీరుపై ప్రభుత్వంతోపాటు సొంత శాఖలోని ఉన్నతాధికారులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికే విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు.. నష్టనివారణ చర్యల్లో భాగంగానే బదిలీలపై దృష్టి సారించారు. వాస్తవానికి ఇటీవలే జైళ్ల శాఖలో బదిలీలు జరిగాయి. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మరోసారి బదిలీలు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.